సోమవారం 25-9-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 11
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



'ఐదు'తో అదరగొట్టారు

చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో తొలి రోజు భారత క్రీడాకారులు మెరిపించారు. షూటింగ్‌లో రెండు, రోయింగ్‌లో మూడు పతకాలతో రాణించారు. అలాగే భారత మహిళల క్రికెట్ జట్టు సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌లోకి అడుగుపెట్టగా.. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్, చెస్ క్రీడాకారులు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక శుభారంభం చేశారు.

- వివరాలు 12లో



మధ్యప్రదేశ్, ఛత్తీస్‌లో గెలుపు పక్కా

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని.. తెలంగాణలో నెగ్గే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేత రాహుల్ అన్నారు.

వివరాలు 6లో ▸



ఆస్టరాయిడ్ శకలం వచ్చింది

అంతరిక్షంలో సేకరించిన ఆస్టరాయిడ్ తాలూకు తొలి శాంపిల్‌ను అమెరికా భూమి మీదకు తీసుకొచ్చింది.

వివరాలు 6లో ▸

ఖలిస్తాన్ వాదులూ జాగ్రత్త!

ఖలిస్తానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య అనంతరం ఆ నిఘా సమాచారాన్ని అమెరికానే కెనడాకు అందించిందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

వివరాలు 6లో ▸



ప్రపంచ వాణిజ్యానికి అడ్డా

భారత్–మధ్య ప్రాచ్యం–యూరప్ ఆర్థిక కారిడార్ ప్రపంచ వాణిజ్యానికి ప్రధాన ఆధారం కాబోతోందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸

5 వరకు రిమాండ్ పొడిగింపు

చంద్రబాబు పోలీసు కస్టడీ ముగియడంతో ఏసీబీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు

సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచిన అధికారులు

థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? భౌతికంగా ఏమైనా ఇబ్బంది పెట్టారా? అని ప్రశ్నించిన కోర్టు

అలాంటిది ఏమీ లేదు.. అన్యాయంగా ఇరికించారు.. అక్రమంగా జైల్లో ఉంచారన్న బాబు

దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.. అన్ని డాక్యుమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదన్న న్యాయస్థానం

ఆధారాలన్నింటినీ పరిశీలించాకే మీ పాత్రపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చాం

అందుకే మిమ్మల్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామన్న కోర్టు

రిమాండ్ ఉత్తర్వులు యాంత్రికంగా ఇచ్చారన్న చంద్రబాబు న్యాయవాది

దీనిపై తీవ్రంగా స్పందించిన న్యాయస్థానం

కేసు డైరీ, సెక్షన్ 164 వాంగ్మూలాలు, 2 వేల పేజీలకు పైగా డాక్యుమెంట్లను పరిశీలించామని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌ను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అక్టోబర్ 5వ తేదీ వరకు పొడిగించింది. చంద్రబాబు రెండు రోజుల పోలీసు కస్టడీ ఆదివారం సాయంత్రంతో ముగిసిన నేపథ్యంలో ఏసీబీ కోర్టు ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు కస్టడీ ముగియడంతో జైలు అధికారులు ఆదివారం సాయంత్రం 5.45 గంటలకు చంద్రబాబును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా న్యాయస్థానం ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకుంది. విచారణ సందర్భంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? కఠినంగా ఏమైనా వ్యవహరించారా? అని ఆరా తీసింది. అలాంటిది ఏమీ లేదని చంద్రబాబు కోర్టుకు నివేదించారు. విచారణ సందర్భంగా

మిగతా 3వ పేజీలో ▶



మళ్లీ అవు కథే!

- సీఐడీ విచారణకు సహకరించని చంద్రబాబు
- సుదీర్ఘ రాజకీయ అనుభవం, దీర్ఘకాలం సీఎంనంటూ దాటవేత యత్నాలు
- ముగిసిన 2 రోజుల కస్టడీ విచారణ.. జంబ్లింగ్ విధానంతో ప్రశ్నలు సంధించిన అధికారులు
- మరికొద్ది రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరనున్న సిట్

3లో

మరో 15 రోజులు రిమాండ్ పొడిగించండి

- తదుపరి దర్యాప్తు నిమిత్తం పొడిగింపు తప్పనిసరి
- మరికొంత కాలం రిమాండ్‌లో ఉంచాలని ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసిన సీఐడీ

3లో

విజయవాడ రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలు



పట్టాలెక్కిన విజయవాడ–చెన్నై వందేభారత్ రైలు

కాచిగూడ–యశ్వంతపూర్ రైలు కూడా.. దేశవ్యాప్తంగా 9 వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

విజయవాడలో జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్

సాక్షి, అమరావతి/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ–చెన్నై, కాచిగూడ–యశ్వంతపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆదివారం పట్టాలు ఎక్కాయి. దేశవ్యాప్తంగా 9 వందేభారత్ రైళ్లను ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ పాల్గొన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపైకి చేరుకున్న వందేభారత్ రైలును 1,500 మందికిపైగా విద్యార్థులతో కలసి రైల్వే అధికారులు

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

సూర్య, చంద్ర ప్రభలపై కోనేటిరాయుడు



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన ఆదివారం నాడు ఉదయం సూర్యప్రభపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చిన మలయప్ప స్వామి.. రాత్రి చంద్రప్రభపై భక్తులను అనుగ్రహించారు.

వివరాలు 5లో ▸

ప్యాకేజీకి చంద్రబాబు అంగీకారం



రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బదులు స్పెషల్ ప్యాకేజీ తీసుకునేందుకు అప్పటి సీఎం చంద్రబాబు అంగీకరించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్పష్టం చేశారు. ఆ తర్వాత ఎస్పీవీని ఏర్పాటు చేయకపోవడం వల్ల తగిన నిధులు విడుదల కాలేదన్నారు.

వివరాలు 3లో ▸


'నైరుతి' నిష్క్రమణ ఆరంభం



నైరుతి రుతుపవనాల తిరోగమనం సోమవారం పశ్చిమ రాజస్థాన్ నుంచి మొదలు కానుంది. అక్టోబర్ 15కల్లా దేశం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ పూర్తవుతుంది. రుతుపవనాల తిరోగమనం లోనూ రాష్ట్రంలో వర్షాలకు ఆస్కారముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

వివరాలు 5లో ▸

టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ



తమ పార్టీ రాజకీయ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం 14 మంది సభ్యులతో పొలిటికల్ యాక్షన్ కమిటీని నియమించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ప్రకటించారు.

వివరాలు 3లో ▸

ఇదంజగత్



..మనకు 'సినిమా' చూపించారు కదా!

కిలారు.. పరారు!

అదృశ్యమైన లోకేశ్ సన్నిహితుడు రాజేశ్

ఇన్నర్ రింగ్‌రోడ్, ఫైబర్‌నెట్ కుంభకోణాల్లో కీలక పాత్రధారి

అక్రమంగా నిధుల తరలింపులోనూ అతడే కీలకం

చంద్రబాబు పీఎస్ పి.శ్రీనివాస్, మనోజ్ పార్థసాని ఇప్పటికే జంప్

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు హయాంలో సాగించిన కుంభకోణాల్లో పాత్రధారుల పరారీ పరంపర కొనసాగుతోంది. సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో టీడీపీ సర్కారు అవినీతి బాగోతాలు బయట పడుతున్న కొద్దీ పరారవుతున్న వారి జాబితా పెరుగుతూ వస్తోంది. తాజాగా నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారు రాజేశ్ అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. ఎప్పుడూ లోకేశ్ వెన్నంటే ఉండే రాజేశ్ కొద్ది రోజులుగా కనిపించడం లేదు. లోకేశ్ ప్రస్తుతం ఢిల్లీలో ఉండగా రాజేశ్ మాత్రం ఎక్కడున్నాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలతోనే అతడు పరారైనట్లు

మిగతా 3వ పేజీలో ▶


టీడీపీ నేత లోకేశ్‌తో ఆయన సన్నిహితుడు కిలారు రాజేశ్ (ఫైల్)

కోవిడ్ తర్వాత పెట్టుబడులు కళకళ



- గత 27 నెలల్లో కొత్తగా రూ.32,697 కోట్ల ఒప్పందాలు
- ఇదే సమయంలో రూ.60,486 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి
- ఈ ఏడాది తొలి 3 నెలల్లో రూ.7,187 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు
- 13 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడంతో రూ.4,919 కోట్ల పెట్టుబడులు కార్యరూపంలోకి.. డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి

- వివరాలు 2లో

విదేశీ విద్యాదీవెన కింద

1,830 మందికి సాయం

- రూ.కోటి నుంచి రూ.కోటి 25 లక్షల వరకు ఆర్థిక సాయం
- వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచడంతో ఎక్కువ మందికి మేలు
- గత ప్రభుత్వ లోపాలు చక్కదిద్ది పటిష్టంగా అమలు
- నాడు సాయం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు మాత్రమే

2లో



ఇండోర్‌లో ఇరగదీశారు

అద్భుత ఆటతో టీమిండియా ఆస్ట్రేలియాకు చుక్కలు చూపించింది. రెండో వన్డేలో 99 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంది. శ్రేయాస్ అయ్యర్, శుబ్‌మన్ గిల్ సెంచరీలతో సత్తా చాటారు.

- వివరాలు 12లో

త్వరలో పేపర్‌లెస్ కోర్టులు


విశాఖలో కోర్టుల భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు

న్యాయమూర్తులు, న్యాయవాదులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఏపీలోని అన్ని కోర్టుల ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు

త్వరలోనే టెండర్లు పిలిచేందుకు ప్రణాళికలు.. కమర్షియల్ హబ్‌గా విశాఖ అభివృద్ధి చెందుతోంది

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

విశాఖలో 10 కోర్టుల భవన సముదాయాన్ని ప్రారంభించిన సీజే

సాక్షి, విశాఖపట్నం: సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని కోర్టులు త్వరలోనే కాగిత రహిత(పేపర్ లెస్) న్యాయస్థానాలుగా మారనున్నాయని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. విశాఖపట్నంలో కొత్తగా నిర్మించిన 10 కోర్టుల భవన సముదాయాన్ని చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం విశాఖ జిల్లా కోర్టుల సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బాంబే హైకోర్టులో చాలామంది అడ్వొకేట్లు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

విలేజ్ క్లినిక్స్‌లో 2 లక్షల డెంగ్యూ నిర్ధారణ కిట్‌లు

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రామిరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో 2 లక్షల డెంగ్యూ ఆర్డీటి కిట్స్ అందుబాటులో ఉంచినట్లు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఏరియా, జిల్లా, బోధనాస్పత్రుల్లో ఎలిసా డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, ఇతర జ్వరాలకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ప్రైవే ట్ ఆసుపత్రిలో డెంగ్యూకు ర్యాపిడ్ కిట్ పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఎలిసా పరీక్ష కోసం ప్రైవేట్ ఆస్పత్రులు కూడా ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రైవేట్ ల్యాబ్‌లపై ప్రత్యేక దృష్టి ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించని ల్యాబ్‌ల అనుమతులు రద్దు చేయాలని ఆదేశించారు.

ప్రజల ఆరోగ్యానికి ఆయుష్మాన్ భవతో భరోసా

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ పథకం ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరి వైద్య, ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవాడలోని కాకరపర్తి భావ నారాయణ కళాశాల (కేబీఎన్) ఆవరణలో ఆదివారం నిర్వహించారు. దీనికి హాజరైన భారతీ ప్రవీణ్ పవార్ రక్తదాన శిబిరం ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి విస్తృతమైన ఆరోగ్య భరోసా కల్పించే పథకం ఆయుష్మాన్ భవ అన్నారు. ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయల వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం, అవయవదానం ఇతర వైద్య సేవలకు సంబంధించి విస్తృత సేవలందించిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీఐ సదస్సులో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు



సదస్సులో పాల్గొన్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు

సాక్షి, అమరావతి: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ న్యాయవాదుల సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. చైర్మన్ గంటా రామారావు, సభ్యులు నల్లారి ద్వారకనాథ్‌రెడ్డి, యర్రంరెడ్డి నాగిరెడ్డి, వీఆర్ రెడ్డి కొవ్వూరి, కృష్ణమోహన్, రామిరెడ్డి, రోళ్ల మాధవి, వి.బ్రహ్మారెడ్డి, ఎం.సుబ్బారావు, వి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి భవితలో..

- హయ్యర్ ఎడ్యుకేషన్: **పీహెచ్‌డీ లేకున్నా.. అసిస్టెంట్ ప్రొఫెసర్!** గతంలో కళాశాల స్థాయిలో అధ్యాపక పోస్టులకు పోటీ పడాలంటే.. పీహెచ్‌డీ తప్పనిరి! ఇకపై పీజీ,నెట్ అర్హతలతోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడొచ్చు. పీహెచ్‌డీ లేకున్నా.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం పొందొచ్చంటూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల మార్గనిర్దేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ తాజా మార్గనిర్దేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ప్రమాణాలు, ఎంపిక విధానం, పదోన్నతుల ప్రక్రియ తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కోవిడ్ తర్వాత పెట్టుబడులు కళకళ

- గత 27 నెలల్లో కొత్తగా రూ.32,697 కోట్ల ఒప్పందాలు
- ఇదే సమయంలో రూ.60,486 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి
- ఈ ఏడాది తొలి మూడు నెలల్లో రూ.7,187 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు
- 13 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడంతో రూ.4,919 కోట్ల పెట్టుబడులు కార్యరూపంలోకి
- డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తల్లో నమ్మకం అంతకంతకు పెరుగుతోంది. కోవిడ్ తర్వాత ఏటా పెరుగుతున్న ఒప్పందాలు, వాస్తవ రూపంలోకి వచ్చిన పెట్టుబడులే దీనికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా రీస్టార్ట్ ప్యాకేజీతో పరిశ్రమలను ఆదుకోవడంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా ఎంచుకుంటున్నారు. 2021 తర్వాత నుంచి రాష్ట్రం ఆకర్షిస్తున్న పెట్టుబడుల విలువ భారీగా పెరుగుతోంది. 2021లో రూ.9,373 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 47 ఒప్పందాలు కుదరగా 2022లో 54 యూనిట్ల ద్వారా రూ.16,137 కోట్ల విలువైన ఒప్పందాలు జరగడం గమనార్హం. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 18 యూనిట్ల ద్వారా రూ.7,187 కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి. అంటే గత 27 నెలల్లో కొత్తగా 119 యూనిట్లను ఆకర్షించడం ద్వారా రూ.32,697 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. మార్చిలో విశాఖ కేంద్రంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 387 ఒప్పందాల ద్వారా రూ.13.11 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకోగా గరిష్టంగా ఆరు నెలల్లోనే పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో రానున్న త్రైమాసికాల్లో ఈ ఒప్పందాల విలువ మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఉత్పత్తి ప్రారంభించడంలోనూ అదే జోరు

కేవలం కొత్త పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా సాధ్యమైనంత త్వరగా ఉత్పత్తి ప్రారంభించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట ప్రణాళికను అమలు చేస్తోంది. 'వైఎస్ఆర్ వన్' ద్వారా ఒప్పందం కుదిరినప్పటి నుంచి ఉత్పత్తి ప్రారంభించే వరకు అనుమతుల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ వ్యవస్థను తెచ్చింది. దీంతో గతేడాది పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తేవడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2021లో రూ.10,350 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన 47 యూనిట్లు వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించినట్లు డీపీఐఐటీ తెలిపింది. 2022లో రూ.45,217 కోట్ల విలువైన 46 ప్రాజెక్టులు ఉత్పత్తిని ప్రారంభించగా ఈ ఏడాది తొలి మూడు నెలల్లో రూ.4,919 కోట్ల విలువైన 13 యూనిట్లు ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి. అంటే గత 27 నెలల వ్యవధిలో మొత్తం 106 భారీ యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా రూ.60,486 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 కాలంలో సగటున ఏటా రూ.11,994 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రాగా ఇప్పుడు నాలుగేళ్లుగా ఏటా సగటున రూ.13,200 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రావడం గమనార్హం. ఈ ఏడాది ముగిసేనాటికి సగటు మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న కాలనీల్లో ఇంధన పొదుపు

- ప్రతి ఇంటికీ 4 ఎల్‌ఈడీ బల్బులు, 2 ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, 2 బీఎల్‌డీసీ ఫ్యాన్లు
- ఒక్కో ఇంట్లో ఏటా 734 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని అంచనా
- ఈఈఎస్‌ఎల్ సహకారంతో గృహనిర్మాణ శాఖ అమలు
- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్–జగనన్న కాలనీల్లో పేదల కోసం నిర్మిస్తున్న గృహాల్లో ఇంధన సామర్థ్య చర్యలను దేశానికే రోల్ మోడల్‌గా అమలు చేయనున్నట్లు ఏపీ గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్‌ఎల్) సీఈవో విశాల్ కపూర్ తరఫున సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు అనిమేష్ మిశ్రా, నితిన్‌భట్, సావిత్రిసింగ్, పవన్‌లు అజయ్ జైన్‌ను కలిసినట్లు ఈఈఎస్‌ఎల్ దక్షిణాది రాష్ట్రాల సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం... హౌసింగ్ ఎండీ లక్ష్మీశా, జేడీ శివప్రసాద్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ గురించి ఈఈఎస్‌ఎల్ అధికారులకు వివరించారు. అజయ్ జైన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈఈఎస్‌ఎల్, కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అతిపెద్దదైన ఇంధన సామర్థ్య కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించనుందని తెలి పారు. సీఎం జగన్ సూచన మేరకు వైఎస్సార్–జగనన్న కాలనీల్లోని ఇళ్లకు అత్యంత నాణ్యమైన స్టార్ రేటెడ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ పరికరాలను గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలోనే ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అందించనుందని తెలిపారు. ప్రతి ఇంటికి 4 ఎల్‌ఈడీ బల్బులు, 2 ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు, 2 ఎనర్జీ ఎఫిషియెన్సీ బీఎల్‌డీసీ ఫ్యాన్లను మార్కెట్ ధర కన్నా తక్కువకు ఈఈఎస్‌ఎల్ సహకారంతో సమకూర్చనున్నట్లు చెప్పారు. అయితే ఇది స్వచ్ఛందమేనని, లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ పరికరాలు తీసుకోవాలని లేదన్నారు. ఈ పరికరాలను వినియోగించడం వల్ల ప్రతి ఇంట్లో ఏటా 734 యూనిట్ల ఇంధనం ఆదా అవుతుందని ఈఈఎస్ ఎల్ అంచనా వేసిందని తెలిపారు. దాని ప్రకారం ఫేజ్–1లోని 15.6 లక్షల ఇళ్లకు రూ.352 కోట్ల వార్షిక ఇంధనం ఆదా అవుతుందని అజయ్ జైన్ వివరించారు.



విశాల్ కపూర్‌కు నివేదిక అందజేస్తున్న అజయ్‌జైన్ తదితరులు

ఫీడ్ ధరలకు ముకుతాడు

- టన్నుకు రూ.256 వరకు పెంచేందుకు యత్నించిన కంపెనీలు
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో రంగంలోకి దిగిన అప్సడా
- పెంపు ప్రతిపాదనను ఉపసంహరించుకునేలా చర్యలు



సాక్షి, అమరావతి: రొయ్య రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. తాజాగా రొయ్యల మేత (ఫీడ్) ధరలు పెంచేందుకు కంపెనీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) రంగంలోకి దిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఫీడ్ ధర టన్నుకు రూ.103 నుంచి రూ.256 వరకు పెంచుతూ సీపీఎఫ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలను తక్షణమే అమలు చేయాలంటూ డిస్ట్రిబ్యూటర్లకు ఆదేశాలు సైతం జారీ చేసింది. సీపీఎఫ్ బాటలోనే మిగిలిన కంపెనీలు కూడా ధరల పెంచేందుకు సిద్ధమయ్యాయి. ఈ విషయాన్ని రొయ్య రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్సడా సీపీఎఫ్ కంపెనీ ప్రతినిధులతో చర్చించింది. పెంచిన ధరలను ఉపసంహరించుకునేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వంతో చర్చించకుండా ధరలు పెంచొద్దని ఫీడ్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మిగిలిన అన్ని కంపెనీలు ధరల పెంపుదల నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాయి. తాజాగా ధరల పెంపు ఉపసంహరణ ఫలితంగా కిలో రొయ్యల ఉత్పత్తిపై రూ.4.50 చొప్పున భారం తగ్గింది.

గతంలోనూ ధరల పెంపును అడ్డుకున్న ప్రభుత్వం

ప్రస్తుతం మేత కోసం ప్రతి రైతు కిలో రొయ్యల ఉత్పత్తికి రూ.90 వరకు ఖర్చు చేస్తున్నారు. ఏటా ఫీడ్ అమ్మకాల ద్వారా రూ.12,600 కోట్ల టర్నోవర్ జరుగుతోంది. గతంలో ఏటా కనీసం రెండు, మూడుసార్లు ఫీడ్ కంపెనీలు ధరలు పెంచేవి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీడ్ తయారీ, అమ్మకాలను సైతం అప్సడా చట్టం పరిధిలోకి తీసుకురావడంతో ఇష్టానుసారంగా ధరల పెంపునకు కళ్లెం పడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా 2022 మే 19న టన్నుకు రూ.256 చొప్పున పెంచేందుకు కంపెనీలు ప్రయత్నించాయి. అంతర్జాతీయ ఒడిదుడుకులతో ఆశించిన ధర లేక సతమతమవుతున్న అప్పటి తరుణంలో రైతులపై పైసా భారం మోపడానికి వీల్లేదని ప్రభుత్వం తేల్చిచెప్పడంతో కంపెనీలు పెంపు ప్రతిపాదనలను పూర్తిగా వెనక్కి తీసుకున్నాయి. అదే రీతిలో 2022 అక్టోబర్ 13న టన్నుకు రూ.260 చొప్పున పెంచాయి. ప్రభుత్వ ఆదేశాలతో పెంచిన నాలుగు రోజులకే కంపెనీలు వెనక్కి తీసుకున్నాయి. ఇలా రెండేళ్లలో మూడుసార్లు పెంచిన ధరలను వెనక్కి తీసుకోవడంతో సగటున కిలోకు రూ.8.60 చొప్పున మేత ఖర్చుల భారం రైతులకు తగ్గింది.

సీఎం జగన్ ఆదేశాలతో..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్సడా ఆధ్వర్యంలో సీపీఎఫ్ కంపెనీ ప్రెసిడెంట్ సహా ఇతర ఉన్నతాధికారులను పిలిపించి సమావేశం నిర్వహించాం. ధరల పెంపు ప్రతిపాదనను ఉపసంహరింప చేసుకునేలా ఆదేశాలిచ్చాం. ప్రభుత్వాదేశాలతో సీపీఎఫ్‌తో సహా ఇతర కంపెనీలు కూడా ధరల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నాయి.

– వడ్డి రఘురాం, కో–వైస్ చైర్మన్, అప్సడా

విదేశీ విద్యా దీవెన కింద 1,830 మందికి సాయం

- రూ.కోటి నుంచి రూ.కోటి 25 లక్షల వరకు ఆర్థిక సాయం
- వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచడంతో ఎక్కువ మందికి మేలు
- గత ప్రభుత్వ లోపాలు చక్కదిద్ది పటిష్టంగా అమలు
- నాడు సాయం రూ.10 నుంచి రూ.15 లక్షలు మాత్రమే

2019 నుంచి కార్పొరేషన్ల వారీగా జగనన్న విదేశీ విద్యాదీవెన లబ్ధిదారులు..



కార్పొరేషన్	లబ్ధిదారులు
ఈబీసీ	803
బీసీ	263
కాపు	316
ఎస్సీ	195
ఎస్టీ	24
మైనారిటీ	229
మొత్తం	1,830

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తున్న 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం కింద ఇప్పటివరకు 1,830 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం లభించింది. గత ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విద్య పథకం అక్రమాల పుట్టగా మారిందని విజిలెన్స్ విచారణలో వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పథకంలోని లోపాలను చక్కదిద్ది మరింత ఎక్కువ మందికి, మరింత ఎక్కువ ఆర్థిక సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీనికింద రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులందరికీ సంతృప్త విధానంలో విదేశీ విద్యకు ప్రభుత్వం సాయమందిస్తోంది. 21 నిర్దేశిత సబ్జెక్ట్ కేటగిరీల్లో 50 విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో ప్రవేశం పొందినవారికి ట్యూషన్ ఫీజు కింద రూ.కోటి 25 లక్షల వరకు ఆర్థిక సాయం (వాస్తవ రుసుం) అందిస్తోంది. ఈబీసీలు రూ.కోటి వరకు ఆర్థిక సాయానికి అర్హులు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు మాత్రమే సాయం అందించేది. అంతేకాకుండా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారి కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ.6 లక్షలకే పరిమితం చేసింది. ఆ ఆదాయ పరిమితిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.8 లక్షలకు పెంచింది. దీంతో ఎక్కువ మంది విద్యార్థులకు మేలు జరుగుతోంది.

త్వరలో పేపర్‌లెస్ కోర్టులు

▶ మొదటి పేజీ తరువాయి

ఐప్యాడ్స్ ద్వారా తమ కేసులపై వాదోపవాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. ఇదే తరహాలో టెక్నాలజీని అన్ని కోర్టులు క్రమంగా అందిపుచ్చుకుంటున్నాయని, రాష్ట్రంలోనూ ఆ తరహా విధానం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకే న్యాయవాదులు, న్యాయమూర్తులు సాంకేతికను అందిపుచ్చుకుని, సవాళ్లని ఎదుర్కొనేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యాయస్థానాల్లో న్యాయవాదులు, న్యాయమూర్తులతోపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసే కక్షిదారులకు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రతినిధులతో కలిసి రాష్ట్రంలోని అన్ని కోర్టులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసిందని, న్యాయస్థానాల ఆధునీకీకరణ, కొత్త భవనాల నిర్మాణం, కోర్టుల్లో ఏసీ సౌకర్యంతోపాటు అన్ని మౌలిక వసతులు సమకూర్చేందుకు త్వరలోనే టెండర్లు పిలవనుందని చీఫ్ జస్టిస్ వెల్లడించారు. ఇప్పటికే కొన్ని కోర్టు భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని, అక్టోబర్ 30 నాటికి 5 భవనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కక్షిదారులకు కోర్టు నియమాలు తెలియవని, కోర్టులో ఏమైనా తప్పుగా ప్రవర్తించినా వారికి నియమనిబంధనలు తెలియజేసి, వారిపట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే అడ్వొకేట్స్ ప్రాక్టీస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ ఫండ్ అందించడం చాలా ఊరటనిచ్చే అంశమని అన్నారు. విశాఖ కాస్మోపాలిటిన్ నగరమని చీఫ్ జస్టిస్ అభిప్రాయపడ్డారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ముందువరసలో ఉన్న విశాఖ... రాష్ట్రంలో ఉన్న అన్ని నగరాలతో పోల్చితే కమర్షియల్ హబ్‌గా మారుతోందన్నారు. ఈ సందర్భంగా విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీమలపాటి రవి, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ ఆలపాటి గిరిధర్, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతపల్లి రాంబాబు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్

రేపు మహానది–గోదావరి అనుసంధానంపై కీలక భేటీ

నీటి లభ్యత గురించి ఎన్ఐహెచ్ ఇచ్చిన నివేదికపై చర్చించనున్న సబ్ కమిటీ

సాక్షి, అమరావతి: మహానది–గోదావరి అనుసంధానంపై ఈ నెల 26న జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) ఢిల్లీలో కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. మహానది–గోదావరి అనుసంధానానికి సంబంధించి నీటి లభ్యతపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ(ఎన్ఐహెచ్) అధ్యయనం చేసి ఇచ్చిన నివేదికపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రిటైర్డ్ చైర్మన్ ఏబీ పాండ్య అధ్యక్షతన ఏర్పాటైన సబ్ కమిటీ ఈ సమావేశంలో చర్చించనుంది. ఎన్ఐహెచ్ నివేదిక ఆధారంగా రెండు నదుల అనుసంధానానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను ఖరారు చేయనుంది. ఒడిశాలోని బర్మూల్ వద్ద మహానది నికర జలాల్లో (75 శాతం లభ్యత ఆధారంగా) 239 టీఎంసీల మిగులు ఉందని ఎన్ఐహెచ్ అంచనా వేసింది. అక్కడి నుంచి 230 టీఎంసీలను గోదావరికి మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ప్రతిపాదనను అమలు చేయవచ్చని తెలిపింది. ఒడిశాలోని బర్మూల్ వద్ద మహానదిపై బ్యారేజ్ నిర్మించి అక్కడి నుంచి 230 టీఎంసీలను తరలించి ధవళేశ్వరం బ్యారేజ్‌కు ఎగువన గోదావరిలో కలిపేలా ఎన్‌డబ్ల్యూడీఏ మహానది–గోదావరి అనుసంధానాన్ని ప్రతిపాదించింది. ఒడిశాలోని నయాగర్, కుర్దా, గంజాం, గజపతి జిల్లాల్లో 2,56,770 హెక్టార్లకు, మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో 1,07,819 హెక్టార్లకు నీళ్లు అందించవచ్చని పేర్కొంది. ఈ ప్రతిపాదనను ఒడిశా ప్రభుత్వం తోసిపుచ్చింది. మహానది నికర జలాల్లో మిగులు లేదని, బర్మూల్ వద్ద 661 టీఎంసీల కొరత ఉందని తెలిపింది. నీటిలభ్యతే లేనప్పుడు మహానది–గోదావరి అనుసంధానం ఎలా చేపడతారని ఎన్‌డబ్ల్యూడీఏను నిలదీసింది. దీంతో ఈ అంశంపై ఎన్ఐహెచ్‌తో ఎన్‌డబ్ల్యూడీఏ అధ్యయనం చేయించింది. మహానది బేసిన్‌లో 1973 నుంచి 2012 వరకు 39 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటిలభ్యతపై ఎన్ఐహెచ్ అధ్యయనం చేసింది. ఏటా 75శాతం లభ్యత ఆధారంగా మహానదిలో 1,733 టీఎంసీల లభ్యత ఉందని లెక్కగట్టింది. మహానది బేసిన్‌లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలో ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకోగా, బర్మూల్ వద్ద ఇంకా 239 టీఎంసీల మేర నికర జలాల్లో మిగులు ఉందని తేల్చింది. ఈ మేరకు ఇటీవల ఎన్‌డబ్ల్యూడీఏకు నివేదిక ఇచ్చింది. ఈ నివేదికపై ఏబీ పాండ్య అధ్యక్షతన ఏర్పాటైన సబ్ కమిటీ సమగ్రంగా చర్చించనుంది.

'అమ్మ'కు అండగా..

హై రిస్క్ గర్భిణుల కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

- ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్, రక్తమార్పిడి కోసం ఆస్పత్రులకు తరలింపు
- ప్రసూతి మరణాల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ఆగస్టు నుంచి ప్రారంభం.. ఇప్పటి వరకూ 3,500 మందికి సేవలు
- గత ఏడాది ఏప్రిల్ నుంచి 500 కొత్త ఏసీ వాహనాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: మాతృత్వం మరో జన్మ. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చేవరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉండాలి. రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం వారికి సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మందులు, పౌష్టికాహారం అందిస్తోంది. మరోవైపు ప్రసూతి మరణాలు మరింతగా తగ్గించడంపైనా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోంది. రాష్ట్రంలో ఏటా 9 లక్షల ప్రసవాలు నమోదవుతుంటాయి. వీరిలో 28 శాతం మంది రక్తహీనత, ఇతరత్రా అనారోగ్య కారణాలతో బాధపడే హైరిస్క్ గర్భిణులు ఉంటారని అధికారులు చెబుతున్నారు. వీరి ఆరోగ్యంపై నిరంతరం వాకబు చేస్తూ, తల్లీబిడ్డ ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రసవం జరిగేలా వైద్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. హైరిస్క్ గర్భిణులను డెలివరీ తేదీకి ముందే ఆస్పత్రులకు తరలించి వైద్యుల సంరక్షణలో ఉంచుతున్నారు. దీంతోపాటు తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్, రక్తమార్పిడి కోసం ఆస్పత్రులకు వెళ్లడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత రవాణా సేవలు అందుబాటులోకి తెచ్చారు.

గుమ్మం వద్దకే వాహనం

ఈ ఏడాది ఆగస్టు నుంచి హైరిస్క్ గర్భిణులను ప్రసవం, ఐరన్ సుక్రోజ్, రక్తమార్పిడి కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో తరలించడం ప్రారంభించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్, ఆశా వర్కర్‌లు తమ పరిధిలో హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి తరలించాల్సి ఉన్నట్లయితే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా కో–ఆర్డినేటర్‌కు సమాచారం చేరవేస్తారు. సమాచారం అందుకున్న 24 గంటల నుంచి 48 గంటల్లో వాహనం గర్భిణుల స్వగ్రామంలో వారి గుమ్మం వద్ద పికప్ చేసుకుని ఆస్పత్రికి తీసుకువెళ్తుంది. తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ఐరన్ సుక్రోజ్, రక్తమార్పిడి అనంతరం తిరిగి క్షేమంగా ఇంటి వద్దకు చేరుస్తున్నారు. ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరిన వారికి ప్రసవానంతరం తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా ఇంటికి తరలిస్తున్నారు. ఇలా ఆగస్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 3,500 మంది గర్భిణులు సేవలు వినియోగించుకున్నారు. వీరిలో 2,300 మందికిపైగా రక్తహీనత సమస్య ఉండి ఐరన్ సుక్రోజ్, రక్తమార్పిడి కోసం ఆస్పత్రులకు వెళ్లిన వారు ఉన్నారు.

గర్భిణులు ఇబ్బంది పడకుండా..

రక్తహీనతతో బాధపడే గర్భిణులు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్, రక్తమార్పిడి కోసం సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వారు ఆస్పత్రులకు వెళ్లి రావాలంటే ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తూ ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఇక మారు మూల గ్రామాల్లో అయితే ప్రయాణ ఇబ్బందులకు భయపడి గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లడం మానేస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గర్భిణులను ఉచితంగా ఆస్పత్రులకు తరలించేందుకు ప్రభుత్వం ఈ సేవలను ప్రవేశపెట్టింది. హైరిస్క్ గర్భిణులు ఈ సేవలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ అనిల్‌కుమార్, అదనపు సంచాలకులు, వైద్య శాఖ

3.27 లక్షల మంది బాలింతలు క్షేమంగా ఇంటికి..

ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి బాలింతలను క్షేమంగా ఇంటికి చేర్చడం కోసం ఏర్పాటుచేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. గతేడాది ఏప్రిల్ నుంచి 500 కొత్త ఎయిర్ కండిషన్డ్ వాహనాలను ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 3,27,289 మంది బాలింతలను క్షేమంగా ఇంటికి చేర్చింది. ఈ సేవల కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పటికే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా ప్రతి లక్ష ప్రసవాలకు ప్రసూతి మరణాల రేటు(ఎంఎంఆర్) 45కు తగ్గింది. ఇదే జాతీయ స్థాయిలో పరిశీలించినట్లయితే ఎంఎంఆర్ 76గా ఉంది.

క్లుప్తంగా...

టీడీపీని బతికించేందుకే పార్టీని పెట్టారా పవన్?

- సామాజిక న్యాయ పోరాట వేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు మూడో ప్రత్యామ్నాయం రావాలని సామాజిక న్యాయ పోరాట వేదిక రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. వేదిక చైర్మన్ యర్రాకుల తులసీరామ్‌యాదవ్ అధ్యక్షతన విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో పవన్‌కళ్యాణ్‌ను తీరును తప్పుబడుతూ బహిరంగ లేఖను విడుదల చేశారు. బీసీ వ్యక్తి సీఎం అయితే చూడాలని ప్రకటించిన పవన్.. ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్‌లలో ఎవరో ఒకరిని సీఎం చేసేందుకు తాపత్రయ పడుతున్నారని తప్పుబట్టారు. టీడీపీని బతికించడం కోసమే జనసేన పార్టీని పెట్టారా? అని ఆ లేఖలో ప్రశ్నించారు. ఈ సమావేశంలో వేదిక రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య, కో చైర్మన్ కందుల సాంబశివరావు గౌడ్, ఐక్య కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు, నరహరశెట్టి నరసింహారావు తదితరులు మాట్లాడారు.

హోదాకు బదులు ప్యాకేజీకి చంద్రబాబు అంగీకరించారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, విశాఖపట్నం: ఏపీకి ప్రత్యేక హోదాకు బదులు స్పెషల్ ప్యాకేజీ తీసుకునేందుకు అప్పటి సీఎం చంద్రబాబు అంగీకరించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్పష్టం చేశారు. ఆ తర్వాత దీనిపై స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ను ఏర్పాటు చేయలేదని, దీంతో రాష్ట్రానికి తగిన రీతిలో నిధులు విడుదల కాలేదన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం తగదన్నారు. ఆదివారం విశాఖలో జరిగిన బీజేపీ రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా వలంటీర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. పోలవరం నిర్మాణ బాధ్యత తమకు అప్పగించాలని అప్పటి సీఎం చంద్రబాబు కోరడం వల్లే కేంద్రం అప్పగించిందన్నారు.

14 మందితో టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ

సాక్షి, అమరావతి: 14 మంది సభ్యులతో టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది.చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ రాజకీయ కార్యక్రమాల పర్యవేక్షణకు ఈ కమిటీని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కమిటీలో తొలి పేరు యనమల రామకృష్ణుడిది ఉంది. ఆ తర్వాత అచ్చెన్నాయుడు, అయ్యన్న పాత్రుడు, ఎంఏ షరీఫ్, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ, నిమ్మల రామానాయుడు, నక్కా ఆనంద్‌బాబు, కాలువ శ్రీనివాసులు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్‌రెడ్డి, అనిత, బీద రవిచంద్రయాదవ్, నారా లోకేశ్‌ల పేర్లు ఉన్నాయి. చంద్రబాబు అరెస్టవడంతో టీడీపీలో తీవ్ర గందరగోళం నెలకొన్న నేపథ్యంలో సీనియర్ నాయకులతో కమిటీ ఏర్పాటు చేసుకుని నిరసన కార్యక్రమాల రూపకల్పన, పర్యవేక్షణ చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది.

బహుజనుల ఉసురు తగిలే చంద్రబాబు జైలుపాలు

1,092వ రోజు దీక్షల్లో బహుజన నేతలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: పేదల కడుపుకొట్టి ప్రజాసామ్యాన్ని ఖూనీ చేయాలని చూసిన వారికి శిక్ష తప్పదన్న విషయం చంద్రబాబు అరెస్టుతో తేటతెల్లమైందని బహుజన పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 1,092వ రోజుకు చేరాయి. నేతలు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదవాడు నివసిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ కోర్టుల్లో తప్పుడు కేసులు వేసి అడ్డుకున్నందుకే తమ ఉసురు తగిలి చంద్రబాబు జైలు పాలయ్యారని దుయ్యబట్టారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

బాబుది అక్రమ అరెస్ట్ అంటే.. కోర్టులను తప్పుబట్టడమే!

మాలమహానాడు అధ్యక్షుడు మంగరాజు



పాలకొల్లు అర్బన్: చంద్రబాబుది అక్రమ అరెస్ట్ అంటూ గగ్గోలు పెట్టడం అంటే కోర్టులను తప్పుబట్టడమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పూలపల్లిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సీఐడీ కోర్టు జడ్జిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా 30 కేసుల్లో చంద్రబాబు నిందితుడని, ఆ స్టేలన్నీ ఎత్తివేస్తే ఆయన జీవితాంతం జైల్లోనే గడపాల్సి ఉంటుందని చెప్పారు.

మరో 15 రోజులు రిమాండ్ పొడిగించండి

- ప్రధాన సాక్షులు పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని పారిపోయారు
- వారిద్దరికీ ఈ కుంభకోణంతో చాలా దగ్గర సంబంధం ఉంది
- వారి పరారీ వెనుక చంద్రబాబు ప్రధాన అనుమానితుడుగా ఉన్నారు
- సాక్షులను ప్రభావితం చేస్తున్నారు.. సాక్ష్యం ఇచ్చే వారిని ప్రలోభపెడుతున్నారు
- అందువల్ల మరికొంత కాలం రిమాండ్‌లో ఉంచాలని ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసిన సీఐడీ

తదుపరి దర్యాప్తు నిమిత్తం పొడిగింపు తప్పనిసరి

కీలక డాక్యుమెంట్లు సేకరించాల్సి ఉంది.. పలువురు సాక్షులను విచారించాలి



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు రిమాండ్‌ను మరో 15 రోజుల పాటు పొడిగించాలని కోరుతూ సీఐడీ ఆదివారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో మెమో దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు నిమిత్తం చంద్రబాబు రిమాండ్‌ను పొడిగించడం తప్పనిసరి అని అందులో పేర్కొంది. స్కిల్ కుంభకోణంలో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, పలు కీలక డాక్యుమెంట్లను సేకరించాల్సి ఉందని, పలువురు సాక్షులను కూడా విచారించాల్సి ఉందని సీఐడీ తెలిపింది. ఈ కేసులో ప్రధాన సాక్షులైన పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని దర్యాప్తు సంస్థకు అందుబాటులో లేకుండా పరారీలో ఉన్నారని నివేదించింది. ఈ కేసుతో వారిద్దరికీ చాలా దగ్గర సంబంధం ఉందని పేర్కొంది. పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని పరారీ వెనుక చంద్రబాబు ప్రధాన అనుమానితుడిగా ఉన్నారని తెలిపింది. దుర్వినియోగమైన నిధులు అంతిమంగా ఎక్కడకు వెళ్లాయి? షెల్ కంపెనీల ద్వారా నగదు రూపంలో ఎవరికి చేరాయి? అనే వివరాలు వీరిద్దరికీ తెలుసని సీఐడీ తన మెమోలో పేర్కొంది.

సాక్షులపై ఆ స్థాయిలో ప్రభావం చూపుతున్నారు..

చంద్రబాబును జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరం ఉందని, అప్పుడు మాత్రమే ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర గురించి మాట్లాడే సాక్షులకు రక్షణ ఉంటుందని సీఐడీ తెలిపింది. మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ దర్యాప్తును పక్కదారి పట్టించేలా మీడియాలో మాట్లాడారని నివేదించింది. సాక్షులపై చంద్రబాబు, ఆయన మద్దతుదారులు ఆ స్థాయిలో ప్రభావం చూపుతున్నారని వివరించింది. ఈ కేసును డ్యామేజ్ చేసేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారంది. సాక్షులను బెదిరించడం, భయపెట్టడం, ప్రభావితం చేస్తూ, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని పేర్కొంది. చంద్రబాబుకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చే వారిని ప్రలోభపెట్టడం, బెదిరించడం లాంటివి చేస్తూ దర్యాప్తులో జోక్యం చేసుకునే అవకాశం ఉందని సీఐడీ తన మెమోలో తెలిపింది. దర్యాప్తు సంస్థకు, కోర్టుకు వాస్తవాలను తెలియనివ్వకుండా చేస్తున్నారని, వీటిని పరిగణలోకి తీసుకుని చంద్రబాబు రిమాండ్‌ను మరో 15 రోజుల పాటు పొడిగించాలని కోర్టును అభ్యర్థించింది.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని గరికపాడులో రాష్ట్ర సరిహద్దు వద్ద జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాలతో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలతో తెలంగాణ నుంచి ఏపీకి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. మైలవరం ఏసీపీ, సరిహద్దు చెక్ పోస్టు ఇన్‌చార్జ్ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి టీడీపీ ఐటీ విభాగం తరఫున మాజీ సీఎం చంద్రబాబుకు మద్దతు పలికేందుకు హైదరాబాద్ నుంచి కార్లలో ర్యాలీగా రాజమండ్రి వస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. వాహన ర్యాలీకి అనుమతుల్లేవని నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

5 వరకు రిమాండ్ పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

ఆహారం, మందులతోపాటు న్యాయవాదులతో మాట్లాడుకునే వెసులుబాటు తదితర అవకాశాలిస్తూ ఆదేశాలిచ్చామని, వాటిని ఏమైనా అధికారులు ఉల్లంఘించారా? అని న్యాయస్థానం ప్రశ్నించగా అలాంటిది ఏమీ లేదని చంద్రబాబు సమాధానం ఇచ్చారు. భౌతికంగా ఇబ్బందులకు గురిచేశారా? అని కోర్టు ప్రశ్నించగా, లేదని చంద్రబాబు సమాధానం ఇచ్చారు. ఇంకేమైనా చెప్పాల్సి ఉందా? అని న్యాయస్థానం ప్రశ్నించడంతో, తనను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని, అక్రమంగా జైలులో ఉంచారని చంద్రబాబు పేర్కొన్నారు.

మీ పాత్రపై 600కిపైగా డాక్యుమెంట్లు...

మీపై ప్రస్తుతం ఉన్నవి ఆరోపణలేనని కోర్టు చంద్రబాబుకు తెలిపింది. సీఐడీ దర్యాప్తు చేస్తోందని, ఇప్పటి వరకు సాగించిన దర్యాప్తులో మీ పాత్రకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందుంచిందని పేర్కొంది. సీఐడీ సమర్పించిన ఆధారాలను పరిశీలించి వాటికి ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారణకు వచ్చిన తరువాతే జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు కోర్టు చంద్రబాబుకు తేల్చి చెప్పింది. సీఐడీ అధికారులు చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన తరువాతనే మీరు దోషినా? నిర్దోషినా? అన్నది కోర్టు తేలుస్తుందని చంద్రబాబుకు స్పష్టం చేసింది. చట్టాన్ని అనుసరించే ఈ కోర్టు ముందుకెళుతుందని తెలిపింది. సీఐడీ అధికారులు ఈ కేసులో మీ పాత్రకు సంబంధించి 600కిపైగా డాక్యుమెంట్లను కోర్టు ముందుంచారని తెలిపింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో అవన్నీ ఈ దశలో రహస్య డాక్యుమెంట్లే అవుతాయని చంద్రబాబుకు స్పష్టం చేసింది.

దర్యాప్తు జరగాల్సిందే.. అది ప్రొసీజర్

దర్యాప్తు అధికారులకు విశిష్ట అధికారాలుంటాయని కోర్టు పేర్కొంది. అయితే మీ హక్కులను, దర్యాప్తు సంస్థ విశిష్టాధికారాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన న్యాయం చేయాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని, ఇప్పుడు తాము అదే చేస్తున్నామని ఏసీబీ కోర్టు చంద్రబాబుకు తేల్చి చెప్పింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారని, సీఐడీ ఈ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వలేదని చంద్రబాబు పేర్కొనగా, మీకు ఇవ్వదగ్గ డాక్యుమెంట్లు కొన్ని ఉంటాయని, వాటిని మీ న్యాయవాదుల ద్వారా తీసుకోవచ్చని సూచించింది. వాటిని పరిశీలిస్తే మిమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారన్న సంగతి మీకు అర్థం కావచ్చని చంద్రబాబునుద్దేశించి కోర్టు వ్యాఖ్యానించింది. దర్యాప్తు జరగాల్సిందేనని, అది ప్రొసీజర్ అని కోర్టు గుర్తు చేసింది. మీ న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, దానిపై విచారణ జరపాల్సి ఉందని కోర్టు తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాతే బెయిల్ ఇవ్వాలా?వద్దా? అనే విషయాన్ని నిర్ణయించడం జరుగుతుందని, ఇందుకు కొంత సమయం పడుతుందని తెలిపింది. అందుకోసమే జ్యుడీషియల్ రిమాండ్‌ను అక్టోబర్ 5 వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. మీరు ప్రస్తుతం పోలీసు కస్టడీలో లేరని, కోర్టు కస్టడీలో ఉన్నారని పేర్కొంటూ చంద్రబాబును జాగ్రత్తగా చూసుకోవాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది.

మాకు సమయం ఎక్కడిస్తున్నారు?

అటు తరువాత ఏసీబీ కోర్టు ఇరుపక్షాలను ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేసింది. ఈ కోర్టు ఏదీ యాంత్రికంగా చేయడం లేదని పేర్కొంది. ప్రతి చిన్న విషయానికి పలు పిటిషన్లు వేస్తున్నారని, ఒకదాని వెంట మరొకటి పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారని గుర్తు చేసింది. 'మీరు వేసిన దానికి వారు, వారు వేసిన దానికి మీరు కౌంటర్లు వేస్తారు. వాటిన్నింటినీ ఈ కోర్టు క్షుణ్ణంగా చదవాలి. అర్థం చేసుకోవాలి. చట్టం ఏం చెబుతుందో చూడాలి. కోర్టు ఇన్ని పనులు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ చేసేందుకు మీరు కోర్టుకు సమయం ఎక్కడ ఇస్తున్నారు? ఇప్పుడు పిటిషన్ వేశాం, వినాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అందరూ కోర్టుకు సహకరిస్తేనే పనిచేయడం సాధ్యం అవుతుంది. చట్టానికి లోబడే వ్యవహరించాలి. ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం' అని న్యాయస్థానం పేర్కొంది.

యాంత్రికంగా ఉత్తర్వులిస్తున్నామా?

చంద్రబాబు తరపు న్యాయవాదులు ఏసీబీ కోర్టులో చిన్నపాటి హైడ్రామా నడిపారు. జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపుపై చంద్రబాబు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు అభ్యంతరం తెలిపారు. కోర్టు తనంతట తానుగా రిమాండ్‌ను పొడిగించలేదన్నారు. రిమాండ్‌ను పొడిగించవద్దని కోరారు. పొడిగింపు కోసం సీఐడీ మెమో దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రిమాండ్ పొడిగింపు పిటిషన్ వేయలేదా? అని ఏసీబీ కోర్టు ప్రశ్నించడంతో తాము రిమాండ్ పొడిగింపు కోసం పిటిషన్ దాఖలు చేసినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నివేదించారు. ఆ కాపీని చంద్రబాబు న్యాయవాదులకు అందచేయాలని పీపీని న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం పోసాని స్పందిస్తూ కోర్టు యాంత్రికంగా జ్యుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొనడంపై న్యాయస్థానం ఒకింత తీవ్రంగా స్పందించింది. సీఐడీ తమ ముందుంచిన కేసు డైరీని, సెక్షన్ 164 స్టేట్‌మెంట్లన్నింటినీ చదివామని, అలాగే 2,000 పేజీలకుపైగా డాక్యుమెంట్లను పరిశీలించామని, వాటన్నింటినీ చూసిన తరువాతనే చంద్రబాబు పాత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారణకు రావడం జరిగిందని కోర్టు స్పష్టం చేసింది. ప్రాథమిక ఆధారాలకు అనుగుణంగానే జ్యుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తేల్చి చెప్పింది. అంతేకానీ మీరు చెబుతున్నట్లు యాంత్రికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని స్పష్టం చేసింది. కోర్టు ఆగ్రహంతో ఖంగుతిన్న చంద్రబాబు న్యాయవాది తమ ఉద్దేశం అది కాదంటూ సమర్థించుకునే యత్నం చేశారు. చంద్రబాబుతో మాట్లాడిన అనంతరం న్యాయస్థానం ఆయన రిమాండ్‌ను పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

కిలారు.. పరారు!

▶ మొదటి పేజీ తరువాయి

టీడీపీ వర్గాలే చెబుతుండటం గమనార్హం.

నిధుల తరలింపులో పాత్రధారి..

నారా లోకేశ్‌కు కిలారు రాజేశ్ అత్యంత సన్నిహితుడన్నది బహిరంగ రహస్యం. చినబాబు తరపున అన్ని వ్యవహారాలను నెరిపేది రాజేశే. కొన్ని వ్యవహారాల్లో చంద్రబాబు మాట కంటే రాజేశ్ చెప్పిన దానికే లోకేశ్ మొగ్గు చూపుతారని టీడీపీ వర్గాలు చెబుతుండటం గమనార్హం. రాజేశ్ పరోక్షంగా టీడీపీ వ్యవహారాలన్నీ తన గుప్పిట్లో పెట్టుకున్నారు. టీడీపీ అనుకూల ఎన్నారైలతో మంతనాలు జరపడం తోపాటు పార్టీ ఆర్థిక వ్యవహారాలన్నీ రాజేశ్ కనుసన్నల్లోనే సాగుతున్నాయి. పార్టీలో ఏదైనా పదవి కావాలంటే చంద్రబాబు కంటే రాజేశ్ వద్దకు వెళితేనే పని అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా నెలకొంది. లోకేశ్ యువగళం పాదయాత్రకు రాజేశ్ నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నాడు.

షాడో మంత్రి.. నెట్‌వర్క్‌లో కీలకం

టీడీపీ హయాంలో లోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు రాజేశ్ షాడో మంత్రిగా చెలరేగిపోయాడు. అన్ని ఫైళ్లను అనధికారికంగా అతడే చూసేవాడని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. చంద్రబాబు, లోకేశ్ సూత్రధారులుగా సాగించిన అన్ని కుంభకోణాల్లోనూ రాజేశ్ కీలక పాత్రధారిగా ఉన్నాడు. స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణ కాంట్రాక్టుల ఖరారు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, ఫైబర్ నెట్ టెండర్ల ఖరారు.. ఇలా అన్ని కుంభకోణాల్లోనూ ప్రధానంగా వినిపించిన పేరు కిలారు రాజేశ్. అక్రమంగా కాంట్రాక్టులు కట్టబెట్టడం, నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల, షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధుల తరలింపు కోసం చంద్రబాబు ఏర్పాటు చేసిన నెట్‌వర్క్‌కు కిలారు రాజేశ్ సంధాన కర్తగా వ్యవహరించాడు. అదే విషయం సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. చంద్రబాబు, లోకేశ్ ప్రధాన నిందితులుగా ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్, అసైన్డ్ భూముల కేసుల్లో కిలారు రాజేశ్‌ను కూడా విచారిస్తామని సీఐడీ అదనపు ఎస్పీ సంజయ్ ఇప్పటికే ప్రకటించారు. అతడి పాత్రపై పూర్తి ఆధారాలు లభించడంతోనే విచారించాలని సీఐడీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కిలారు రాజేశ్ అదృశ్యం కావడం గమనార్హం.

మూడుకు చేరుకున్న అదృశ్యాలు..

కిలారు రాజేశ్‌ను విచారించాలని సీఐడీ నిర్ణయించడంతో చంద్రబాబు, లోకేశ్ బెంబేలెత్తారు. అతడిని సీఐడీ విచారిస్తే టీడీపీ హయాంలో సాగించిన మరెన్నో కుంభకోణాలు బయటకు వస్తాయని ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో రాజేశ్‌ను అజ్ఞాతంలోకి పంపించాలని నిర్ణయించిన చంద్రబాబు అదే విషయాన్ని ములాకత్‌లో తనను కలిసిన యనమల రామకృష్ణుడుకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజేశ్ అదృశ్యమయ్యాడు. అతడు దేశంలోనే ఎక్కడైనా అజ్ఞాతంలో ఉన్నాడా...? విదేశాలకు పరారయ్యాడా? అన్నది తెలియరాలేదు. దీంతో చంద్రబాబు ఆదేశాలతో పరారైన వారి సంఖ్య మూడుకు చేరుకుంది. స్కిల్ కుంభకోణంలో విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు జారీ చేయగానే చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని దుబాయ్‌కు పరారైన విషయం తెలిసిందే.

మళ్లీ ఆవు కథే!

- సీఐడీ విచారణకు సహకరించని చంద్రబాబు
- సుదీర్ఘ రాజకీయ అనుభవం, దీర్ఘకాలం సీఎంనంటూ దాటవేత యత్నాలు
- ముగిసిన రెండు రోజుల కస్టడీ విచారణ.. మళ్లీ కస్టడీకి ఇవ్వాలని కోరనున్న సిట్

సాక్షి, అమరావతి, రాజమహేంద్రవరం: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబు రెండు రోజుల సీఐడీ విచారణ ఆదివారం ముగిసింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టుగా నకిలీ ఒప్పందంతో నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేసి రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా కొల్లగొట్టిన కేసులో ప్రధాన ముద్దాయి చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలతో సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆయన్ని రెండు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారించింది. పక్కా పన్నాగంతో 'స్కిల్' కుంభకోణానికి పాల్పడ్డ చంద్రబాబు సీఐడీ విచారణను కూడా పక్కదారి పట్టించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. రెండు రోజుల విచారణలోనూ ఆయన ఏమాత్రం సహకరించనందున చంద్రబాబు కస్టడీని పొడిగించాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరాలని సీఐడీ నిర్ణయించింది.

40 ఇయర్స్ ఇండస్ట్రీ.. 14 ఏళ్లు సీఎంనంటూ

సీఐడీ విచారణలో చంద్రబాబు సంబంధం లేని సంగతులు చెబుతూ తప్పించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్కిల్ కుంభకోణానికి సంబంధించి సిట్ అధికారులు ఏ ప్రశ్నలు వేసినా చంద్రబాబు ఒకటే చెబుతూ వచ్చారు. రాజకీయాల్లో తాను 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని... 14 ఏళ్లు సీఎంగా చేశానంటూ కాలయాపన చేసేందుకే ప్రయత్నించారు. దీంతో ఆయన రాజకీయ అనుభవం గురించి తమకు కూడా తెలుసని, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ జీవో, ఒప్పందాలను ఏ ప్రాతిపదికన చేశారు? బిల్లులు చెల్లింపుల్లో హేతుబద్ధత ఏమిటీ? నిధుల మళ్లింపులో పాత్రధారులతో సంబంధాలు ఏమిటీ? అనే అంశాలకు సూటిగా సమాధానాలు చెప్పాలని సిట్ అధికారులు పదేపదే పట్టుబట్టాల్సి వచ్చింది.

వ్యూహాత్మక ప్రశ్నావళి.. కొంతవరకు సఫలీకృతం

మొదటి రోజు చంద్రబాబు విచారణకు ఏమాత్రం సహకరించకపోవడంతో రెండో రోజు సిట్ అధికారులు ప్రశ్నావళిలో కొన్ని మార్పులు చేశారు. వరుస క్రమంలో కాకుండా ఓ అంశం నుంచి మరో అంశానికి జంబ్లింగ్ విధానంలో ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ప్రధానంగా ఈ కేసులో ఇప్పటికే సీఐడీ, ఈడీ అరెస్ట్ చేసిన సుమన్‌బోస్, వికాస్ వినాయక్ కన్విల్కర్‌లతోపాటు నిధుల అక్రమ తరలింపులో షెల్ కంపెనీలతో చంద్రబాబు సంబంధాలు, ఉత్తర ప్రత్యుత్తరాల గురించి కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. నిధుల అక్రమ మళ్లింపులో కీలక పాత్రధారులైన చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తాలతో చంద్రబాబు, లోకేశ్ లావాదేవీలపై కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సీఐడీ నోటీసులు జారీ చేయగానే పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని పరారు కావడంపై సూటిగా ప్రశ్నించినట్లు సమాచారం. వెరసి రెండు రోజుల విచారణలో వ్యూహాత్మకంగా ప్రశ్నలు సంధించడం ద్వారా సీఐడీ అధికారులు కొంత వరకు సఫలీకృతమైనట్టు తెలుస్తోంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు చంద్రబాబు విచారణ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. మధ్యవర్తుల సమక్షంలో ఆయన వాంగ్మూలాన్ని నమోదుచేశారు. విచారణ సాగిన తీరు, వీడియో రికార్డింగ్ తదితర ఫైళ్లను న్యాయస్థానానికి సిట్ అధికారులు సమర్పించనున్నారు.

మరింత విచారించాల్సిన అవసరం

విచారణ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించి కాలహరణం చేసినందున చంద్రబాబును మరి కొద్ది రోజులు కస్టడీలో విచారించేందుకు అనుమతించాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరాలని సీఐడీ నిర్ణయించింది. మరోవైపు ఈ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన ఇద్దరు కీలక వ్యక్తులు విదేశాలకు పరారు కావడం వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నట్లు నివేదించనుంది. ఈ కేసులో గతంలో విచారించిన సాక్షులను ప్రభావితం చేసిన ఉదంతాలను కూడా న్యాయస్థానం దృష్టికి మరింత వివరంగా తీసుకెళ్లనుంది. ఈ నేపథ్యంలో ఈ కుంభకోణంలో కుట్రకోణానికి సంబంధించి పూర్తి వాస్తవాలను రాబట్టేందుకు చంద్రబాబును మరి కొద్ది రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతించాలని న్యాయస్థానానికి సిట్ అధికారులు విజ్ఞప్తి చేయనున్నారు.

పవన్ కళ్యాణ్ ఎక్కడ?

జనసేన నేతలను ప్రశ్నించిన బ్రాహ్మణి

రాజమహేంద్రవరం విద్యానగర్‌లో లోకేశ్ క్యాంపు వద్ద ఆయన భార్య బ్రాహ్మణితో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ నేతలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఎక్కడని జనసేన నేతలను బ్రాహ్మణి ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా కంగుతిన్న నేతలు.. పవన్ బిజీగా ఉన్నారని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రెండు పార్టీలు అన్నదమ్ముల్లా కలిసి పోరాడాలని బ్రాహ్మణి కోరారు. తమకు అండగా నిలబడుతున్న నేతలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ తమకు మద్దతు ఇస్తే పోరాటం చేస్తామని జనసేన నేతలు చెప్పారు. ఉమ్మడి పోరాటానికి నిధులు సమకూర్చాలని బ్రాహ్మణిని జనసేన నేతలు కోరినట్టు సమాచారం. 'నిధుల విషయం తర్వాత మాట్లాడదాం... ఉమ్మడిపోరు ప్రారంభిద్దాం' అని ఆమె చెప్పడంతో జనసేన నేతలు మెల్లగా జారుకున్నట్లు తెలిసింది.

'నన్నయ'లో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు

సీఎస్ఐఆర్‌తో అవగాహన ఒప్పందం.. యువతకు ఉపాధి అవకాశాలకు మెరుగైన రంగం

రాజానగరం: ఆహార సాంకేతికత (ఫుడ్ టెక్నాలజీ) అనేది ఆహార శాస్త్రంలో ఒక శాఖ. ఇది ఆహార ఉత్పత్తుల సంరక్షణ, నాణ్యత నియంత్రణ, పరిశోధన, అభివృద్ధిని సూచిస్తుంది. ఈ విషయాన్ని గ్రహించిన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు.. గోదావరి జిల్లాల్లోని యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే ఆశయంతో ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు శ్రీకారం చుట్టారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో మ్యాన్‌పవర్‌కి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఇటువంటి కోర్సుల ఆవశ్యకతను గుర్తించారు. సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ ఫర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (మైసూర్) సహకారంతో 'నన్నయ' వర్సిటీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెడుతున్నారు.

పీజీ సెట్ ద్వారా ప్రవేశాలు

ఏపీ పీజీ సెట్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న కౌన్సెలింగ్‌లో 'ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్‌ని ఎంపిక చేసుకొని ఈ కోర్సులో చేరవచ్చు. ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు చేసేందుకు బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ ఒకేషనల్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ బయో టెక్నాలజీ, బీఎస్సీ మైక్రోబయాలజీ, బీఎస్సీ బయోకెమిస్ట్రీ, బీఎస్సీ హోమ్‌సైన్స్, బీఎస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, బీఎస్సీ రూరల్ హోమ్ సైన్స్, క్లినిక్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, బీఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, బీఎస్సీ న్యూట్రిషన్ ఒక పేపరుగా ఉండి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండవలసి ఉంటుంది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రస్తుతం 20 సీట్లతో ఈ కోర్సును ప్రారంభిస్తున్నారు.

రూ.80 లక్షలతో ప్రత్యేక ల్యాబ్

'నన్నయ' యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును అమలు చేసేందుకుగాను రూ.80 లక్షల వ్యయంతో ప్రత్యేక ల్యాబ్‌ని ఏర్పాటు చేయనున్నారు. సీఎఫ్‌టీఆర్ఐ వంటి ప్రముఖ సంస్థలలో 40 సంవత్సరాలపాటు అధ్యాపక వృత్తిలో సేవలందించిన ఆచార్య పి.రామకృష్ణను ఈ కోర్సుకు కోఆర్డినేటర్‌గా నియమించారు. యూజీసీ నిబంధనలను అనుసరించి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోర్సును సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నాణ్యమైన విద్యతోపాటు ఉపాధి అవకాశాలు



గోదావరి జిల్లాలలోని యువతకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. భారత దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2024 నాటికి 9 మిలియన్ల ఉద్యోగాలను సృష్టిస్తుంది. యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనువైన రంగంగా అభివృద్ధి చెందనుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 'నన్నయ' వర్సిటీలో ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నాం. ఇటీవల మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐని సందర్శించినప్పుడు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు గురించి అక్కడ డైరెక్టర్లతో మాట్లాడాను. యూనివర్సిటీలో ఈ కోర్సును ప్రవేశపెడితే అందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వడానికి వారు సుముఖతను వ్యక్తపరిచారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ప్రధాన సంస్థగా ఉన్నందున, ఈ కోర్సుకు సంబంధించి విద్యా కార్యకలాపాలు ఆ సంస్థ నుంచి పొందేందుకు విద్యానిపుణులు, శాస్త్రవేత్తలు సహకరిస్తారని మాటిచ్చారు. విద్యార్థులకు మైసూరులో పూర్తి సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కూడా కలిస్తారు. ఈ మేరకు సీఎస్ఐఆర్‌తో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకున్నాం.

– ఆచార్య కె. పద్మరాజు, ఉపకులపతి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ



ఒక తెలివైన వ్యక్తిని కనుగొనడానికి
మరొక తెలివైన వ్యక్తి అవసరం.
– డైయోజినీజ్

సాక్షి
సోమవారం, 25 సెప్టెంబర్ 2023

త్రిశంకుస్వర్గం

సృష్టిలో ప్రకృతికి వికృతి ఉంటుంది. ప్రతి సృష్టికీ దానికి దీటైన ప్రతిసృష్టి కూడా ఉండనే ఉంటుంది. సహజమైన సృష్టి ప్రకృతి అయితే, మానవులు తమ అమోఘ మేధతో చేసిన ప్రతిసృష్టి వికృతి. సృష్టికి పోటీగా ప్రతిసృష్టి చేయాలనే తపన మానవులకు యుగాల కిందటే మొదలైంది. మానవులకు ఉన్న ఈ తపన వారి కల్పనల్లో ప్రతిఫలించింది. పురాణాలు మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు ప్రతిసృష్టి కల్పనలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

ప్రతిసృష్టికి ఉదాహరణ మన పురాణాల్లోనే కనిపిస్తుంది. అదే– విశ్వామిత్ర సృష్టి. త్రిశంకుడి కోసం విశ్వామిత్రుడు ఏకంగా స్వర్గానికే నకలును సృష్టించాడు. విశ్వామిత్రుడు సృష్టించిన త్రిశంకుస్వర్గం దేవేంద్రుడి స్వర్గానికి ఏమాత్రమూ తీసిపోదు. కాకుంటే, కర్మకొద్ది త్రిశంకుడే అందులో తలకిందులుగా వేలాడుతూ నిలిచిపోయాడు. తన కోసం సృష్టించిన స్వర్గంలో తానే తలకిందులుగా వేలాడే దుర్గతి తటస్థించడమే ప్రతిసృష్టిలోని వికృతి!

కృత్రిమ మేధతో పనిచేసే మరమనిషి ప్రస్తావన గ్రీకు పురాణాల్లో కనిపిస్తుంది. హిఫీస్టస్ అనే గ్రీకుల దేవుడు క్రీట్ దీవిని రక్షించడానికి టాలోస్ అనే భారీ కంచు మరమనిషిని సృష్టించాడు. హిఫీస్టస్ మన భారతీయ పురాణాల్లోని విశ్వకర్మలాంటి వాడు. శిల్పులు, లోహశిల్పులు వంటి వారికి, అగ్నిపర్వతాలకు అధిదేవుడు. క్రీస్తుపూర్వం మూడో శతాబ్దికి చెందిన గ్రీకు కవి అపలోనీయస్ ఆఫ్ రోడ్స్ రాసిన 'ఆర్గనాటికా' కావ్యంలోనిది ఈ గాథ. ఈ కావ్యంలోనే ఒళ్లంతా బంగారమే గల మరమగువల గురించి కూడా వర్ణించాడు. వాళ్లను కూడా హిఫీస్టస్ సృష్టించాడు. 'ఆర్గనాటికా' గాథ ప్రకారం– హిఫీస్టస్ సృష్టించిన టాలోస్‌ను క్రీట్ రాజు జూస్ తన కొడుకు మైనోస్‌కు బహుమతిగా ఇచ్చాడు. మైనోస్ నియంతగా మారి టాలోస్‌ను తన శత్రువులను నిర్మూలించడానికి వాడుకున్నాడు. కృత్రిమ మేధ శక్తిని, దుర్మార్గుల చేతిలో పడితే దానివల్ల వాటిల్లగల ప్రమాదాలనూ అపలోనీయస్ ఎంతో ముందుగానే ఊహించడం విశేషం.

'ఆర్గనాటికా' గాథకు ఇరవైమూడు శతాబ్దాల తర్వాత గాని 'రోబో' అనే మాట పుట్టలేదు. చెక్ రచయిత కారల్ కాపెక్ 1920లో రాసిన నాటకం 'రోసమ్స్ యూనివర్సల్ రోబో' ద్వారా 'రోబో' అనే మాటను వాడుకలోకి తెచ్చాడు. అప్పటి నుంచి మరమనిషికి 'రోబో' అనే మాట ఇంగ్లిష్‌లోకి వచ్చింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి వచ్చింది.

క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దికి చెందిన గ్రీకు మేధావి అరిస్టాటిల్ కూడా కృత్రిమ మేధ గురించిన ఆలోచనలు చేశాడు. ఆయన తన 'పాలిటిక్స్' గ్రంథంలో 'ప్రతి పరికరమూ తనను ఉపయోగించే వ్యక్తి ఆదేశాలకు అనుగుణంగా లేదా వారి అవసరాలను ముందుగానే గుర్తించి అందుకు అనుగుణంగా వాటి పని అవి చేసుకోగలిగితే చేతివృత్తుల వారికి కార్మికుల అవసరం ఉండదు. అలాగే యజమానులకు బానిసల అవసరం కూడా ఉండదు' అని రాశాడు. మనుషులు శ్రమలో నిరంతరం నలిగిపోకుండా, వాళ్లు తమ పనులను యంత్రాలకు అప్పగించి నిక్షేపంగా జీవితాన్ని ఆస్వాదించాలనేది ఆయన ఆలోచన.

కృత్రిమ మేధతో పనిచేసే మరమనుషులను గురించి ప్రాచీనులు కల్పనలు చేసేనాటికి ప్రపంచంలో కనీసం విద్యుత్తు వినియోగంలో లేదు. అప్పట్లో రవాణా వసతులు కూడా అంతంత మాత్రమే! అయితే, నాటి కల్పనలే నేటి కార్యాచరణలు. కాల్పనికమైన ఊహలే శాస్త్ర పురోగతికి ఊతమిస్తాయి. ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా ఆనాటి కల్పనల్లోని వర్ణనల మాదిరిగానే ఇంచుమించుగా మనుషులను పోలిన హ్యూమనాయిడ్ రోబోలు ఇప్పటికే వాడుకలోకి వచ్చేశాయి. ఇవి ఎప్పటికప్పుడు మరింతగా ఆధునికతను సంతరించుకుంటున్నాయి. ఇవి కృత్రిమ మేధతో మనుషుల మాదిరిగానే పనులు చేయగలుగుతున్నాయి. కృత్రిమ మేధ తెరమీద ఏకంగా మనుషులకు నకళ్లనే సృష్టిస్తోంది. కృత్రిమ మేధ ఇప్పుడు ఆధునిక కరాభరణాలైన స్మార్ట్‌ఫోన్‌లకూ పాకింది. కృత్రిమ మేధను విస్తృతంగా వాడుకలోకి తేగలిగిన శాస్త్రవేత్తలు అపర విశ్వామిత్రులే!

విశామిత్రుడు సృష్టించిన త్రిశంకుస్వర్గంలో త్రిశంకుడు తలకిందులుగా వేలాడుతున్నట్లుగానే, ఆధునిక శాస్త్రవేత్తలు సృష్టించిన కృత్రిమమేధతో మానవాళి పరిస్థితులు తలకిందులవుతాయా అనే భయాలు కూడా పుట్టుకొస్తున్నాయి. ఇవి నిష్కారణమైన భయాలు కావు. కృత్రిమ మేధ సృష్టిస్తున్న సమస్యలతో సతమతమవుతున్న వారిలో అనుభవపూర్వకంగా తలెత్తుతున్న భయాలు. పలు దేశాలు రాజ్యాంగబద్ధంగా గోప్యత హక్కుకు భరోసా కల్పిస్తున్నా, కృత్రిమ మేధ వల్ల మనుషుల గోప్యతకు పూచీలేని పరిస్థితి ఇప్పటికే ఏర్పడింది. కృత్రిమ మేధ దుర్వినియోగం వల్ల నేరాలు కూడా జరుగుతున్నాయి. కృత్రిమ మేధ కళా సాహితీరంగాల్లోని సృజనకు సవాలుగా మారింది. నిన్న మొన్నటి వరకు నటీనటులు కెమెరా ముందు స్వయంగా నటిస్తేనే తెరమీద కనిపించేవారు. నటీనటులు కెమెరా ముందు స్వయంగా నటించకపోయినా, అచ్చంగా వారి రూపాలను, హావభావ విన్యాసాలను తెరమీద ప్రదర్శించే స్థాయికి చేరుకుంది కృత్రిమ మేధ. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఇదే సమస్యపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తన అనుమతి లేకుండా, తన రూపాన్ని, మాటలను, హావభావాలను కృత్రిమ మేధ సహాయంతో ప్రదర్శించకుండా ఉండేలా కోర్టు నుంచి ఇటీవల ఉత్తర్వులను కూడా పొందాడు. కృత్రిమ మేధ ఒకవైపు కొన్ని పనులను సులభతరం చేస్తున్నా, మరోవైపు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. వాటికి పరిష్కారం కనుక్కోకుంటే... మన పరిస్థితి త్రిశంకుస్వర్గమే!

డౌనింగ్ స్ట్రీట్ మార్జాల మిత్రుడు

కామెంట్



కరణ్ థాపర్

నిష్క్రమించే ప్రధాని వీడ్కోలు కార్యక్రమ గౌరవ ఆహ్వానితుల జాబితాలో 'ల్యారీ' ఎందుకు కనిపించడు అని బ్రిటన్ ప్రజలు తరచూ ఆలోచిస్తూ ఉంటారు. బహుశా ఆహూతుల అందరి దృష్టీ తన వైపు మళ్లేందుకు ల్యారీ ఎప్పటికప్పుడు కళాత్మకమైన మార్గాలను కొనుగొంటూ ఉండడం అందుకు కారణం కావచ్చు. అవడానికి అది మామూలు మార్జాలమే అయినప్పటికీ దానిని 'సివిల్ సర్వెంట్'గా పరిగణించాలని 2016లో నాటి బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరున్ పార్లమెంటులో ప్రకటించారు. ప్రస్తుతం చీఫ్ మౌజర్ హోదాలో ఉన్న ఆ సివిల్ సర్వెంట్ పేరే 'ల్యారీ'. 2011 నుంచి ల్యారీ బ్రిటన్ ప్రధాని నివాసంలో ఉంటోంది. డేవిడ్ కామెరున్, థెరెసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రుస్, రుషి సునాక్... ప్రధానులుగా ఇంతమంది మారారు కానీ, ల్యారీ అక్కడే ఉంది. కాలధర్మం లేదా వృద్ధాప్యం మాత్రమే ల్యారీని డౌనింగ్ స్ట్రీట్ నుంచి కదలించగలవు.

పెంపుడు కుక్కలపై మక్కువ కలిగిన వారిగా బ్రిటిషర్‌లు లోక విదితం అయినప్పటికీ, వారి ప్రధానమంత్రి అధికారిక నివాసంలో ప్రాముఖ్యం పొందే చతుష్పాదం మాత్రం మార్జాలమే. పిల్లిది అక్కడ 'చీఫ్ మౌజర్' హోదా. చీఫ్ మౌజర్ ప్రధాన విధి డౌనింగ్ స్ట్రీట్‌లో ఒక్క ఎలుకైనా లేకుండా చూడటం. డౌనింగ్ స్ట్రీట్‌లోనే ప్రధాని నివాసం, ప్రధాని కార్యాలయాలు ఉంటాయి. అవడానికి అది మామూలు మార్జాలమే కానీ, దానిని 'సివిల్ సర్వెంట్'గా పరిగణించాలని 2016లో నాటి బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరున్ పార్లమెంటులో ప్రకటించారు. ప్రస్తుతం చీఫ్ మౌజర్ హోదాలో ఉన్న ఆ సివిల్ సర్వెంట్ పేరు 'ల్యారీ'. 'బ్యాటర్‌సీ డాగ్స్ అండ్ క్యాట్స్ హోమ్' నుంచి తప్పించి, దానిని అక్కడికి తెప్పించారు. 2011 నుంచి ల్యారీ బ్రిటన్ ప్రధాని నివాసంలో ఉంటోంది. డేవిడ్ కామెరున్, థెరెసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రుస్, రుషి సునాక్... ప్రధానులుగా ఇంతమంది మారారు కానీ, ల్యారీ అక్కడే ఉంది. కాలధర్మం లేదా వృద్ధాప్యం మాత్రమే ల్యారీని డౌనింగ్ స్ట్రీట్ నుంచి కదలించగలవు.

జీవిత చరిత్రల రచనలో ప్రావీణ్యం కలిగిన నా మేనకోడలు నారాయణీ బసు బ్రిటిష్ ప్రభుత్వ అధికారిక మార్జాలాల జీవిత చరిత్రను సంక్షిప్తంగా సంకలన పరిచారు. ఎనిమిదవ హెన్రీ చక్రవర్తి కాలం నాటి బ్రిటిష్ ప్రభుత్వ మార్జాల జీవిత చరిత్రతో సంకలనం మొదలౌతుంది. ఆ కాలపు రాజనీతిజ్ఞుడు, క్యాథలిక్ బిషప్ అయిన లార్డ్ ఛాన్సలర్... థామస్ వోల్సే దగ్గర ఆ మార్జాలం ఉండేది. 1929కి ముందే బ్రిటిష్ ప్రభుత్వం అధికారికంగా పిల్లి సంరక్షణ బాధ్యతలను చేపట్టినట్లు రికార్డులను బట్టి తెలుస్తోంది. పిల్లి పోషణ, పాలన కోసం రోజుకు ఒక పెన్నీ కేటాయించినట్లు అప్పటి బడ్జెట్ లెక్కలు వెల్లడిస్తున్నాయి. నాటి నుంచి పిల్లి ఖర్చు క్రమంగా పెరుగుతూ వచ్చి 21వ శతాబ్దానికి 'చీఫ్ మౌజర్' బ్రిటిష్ ఖజానాకు పెట్టిస్తున్న ఖర్చు 100 పౌండ్లకు చేరుకుంది.

డౌనింగ్ స్ట్రీట్ వెబ్‌సైట్ ప్రకారం ల్యారీ విధులు ఇలా ఉన్నాయి: ఇంటికి వచ్చే అతిథులను పలకరించడం, భద్రతకు ఉద్దేశించిన రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేయడం, కునుకు తీయడానికి పురాతన ఫర్నిచర్ ఏ మాత్రం నాణ్యతను కలిగి ఉన్నదో పరీక్షించడం. అలాగే, భవంతిలో ఎలుకలు చేరకుండా ఉండేందుకు పరిష్కారం ఆలోచించడం కూడా చేస్తోందనీ, ఆ పరిష్కారం ఇంకా వ్యూహాత్మక ప్రణాళిక దశలోనే ఉందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లిందని కూడా వెబ్‌సైట్‌లో ఉంది. స్పష్టంగా చెప్పాలంటే ల్యారీ తన బాధ్యతల కంటే కూడా ప్రధాని కార్యాలయ అవసరాలను చూడ్డానికే ఎక్కువ ఇష్టపడుతుంది.



ప్రస్తుత బ్రిటన్ ప్రధాని రుషి సునాక్‌తో 'ల్యారీ'

నారాయణి పరిశోధనను బట్టి కామెరున్ దగ్గర తన తర్వాత వచ్చిన ప్రధానుల కంటే కూడా ల్యారీ గురించి చెప్పడానికే ఎక్కువ సమాచారం ఉంది. ఆ పిల్లి గురించి సునాక్ అభిప్రాయాన్ని నారాయణి ప్రస్తావించలేదు. కనుక ల్యారీని అర్థం చేసుకోవాలంటే మనం కామెరున్ మీద ఆధారపడాలి.

ఆయన చెబుతున్న దానిని బట్టి ల్యారీ పురుషుల సమక్షంలో కాస్త బెరుకుగా ఉంటాడు. అయితే అందుకు బరాక్ ఒబామా మినహాయింపు. "తమాషా ఏంటంటే ఒబామాను ల్యారీ ఇష్టపడతాడు. ఒబామా అతడికి మృదువైన చిన్న తాటింపు వంటి స్పర్శను ఇస్తాడు. దాంతో ల్యారీ ఒబామా దగ్గర సౌఖ్యంగా ఉంటాడు.

అయితే ల్యారీ ప్రధానమంత్రుల సతీమణులను కలవరపెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ల్యారీ ఒంటి వెంట్రుకలు తన భర్త సూట్‌లపై కనిపించడంతో సమంతా కామెరున్ ల్యారీని ప్రధాని నివాసంలోకి అడుగు పెట్టనివ్వకుండా చేశారు. అంతెందుకు, పక్కనే ఉండే విదేశాంగశాఖ కార్యాలయంలోకి ల్యారీని ప్రవేశించనివ్వకుండా క్యాట్–ప్రూఫ్‌ను ఏర్పాటు చేయడం కూడా జరిగింది. విదేశాంగ కార్యదర్శి విలియం హేగ్ దానిని కిందికి తీసుకెళ్లండి అని కోరారు. అయితే హేగ్‌కి ల్యారీ పట్ల కొంత ఆపేక్ష ఉండేదట.

కఠోర వాస్తవం ఏంటంటే ల్యారీకి ఉన్న ప్రజాదరణ కారణంగా తరచూ ప్రధాన మంత్రి కంటే కూడా ఎక్కువగా ల్యారీకి భద్రతా బలగం అవసరం అయ్యేది. కామెరాన్ దంపతులు ఆ పిల్లిని ఇష్టపడటం లేదని కథలు వ్యాప్తి చెందడం ప్రారంభమవడంతో ల్యారీ, తను 'పర్–ఫెక్ట్‌లీ వెల్' అని ప్రధాని కామెరున్ తప్పనిసరై ట్వీట్ చేయవలసి వచ్చింది. ఆ ట్వీట్ బ్రిటిష్ ప్రభుత్వానికి భరోసాను ఇచ్చింది.

నిష్క్రమించే ప్రధాని వీడ్కోలు కార్యక్రమ గౌరవ ఆహ్వానితుల జాబితాలో ల్యారీ ఎందుకు కనిపించడు అని బ్రిటన్ ప్రజలు తరచూ ఆలోచిస్తూ ఉంటారు. బహుశా ఆహుతుల అందరి దృష్టీ తన వైపు మళ్లేందుకు ల్యారీ ఎప్పటికప్పుడు కళాత్మకమైన మార్గాలను కనుగొంటూ ఉండడం అందుకు కారణం కావచ్చు. 10 డౌనింగ్ స్ట్రీట్ ప్రవేశ ద్వారం వద్ద ట్రంప్‌తో కలిసి థెరెసా మే, ఆమె భర్త ఫొటోలు దిగుతున్నప్పుడు ల్యారీ వారి వెనుక కిటికీ అంచుపై నిలబడి ప్రతి ఫొటోలోనూ కనిపించింది. తర్వాత వర్షం నుంచి తలదాచుకోడానికి సాయుధుల కనురెప్పల కావలాలో ఉన్న ట్రంప్ క్యాడిలాక్ కారు కింద దూరిన ల్యారీని ఎంత నచ్చచెప్పీ బయటకు రప్పించలేక పోయారు. బి.బి.సి.కి చెందిన జోన్ సోపెల్ ఆ ఘటనను... "బ్రేకింగ్ న్యూస్: ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనకారులు డొనాల్డ్ ట్రంప్ వాహన శ్రేణిని నిలువరించడంలో విఫలమయ్యారు. కానీ 10 డౌనింగ్ స్ట్రీట్ పిల్లి ఆ పని చేయగలిగింది"... అని ట్వీట్ చేశారు.

కొంతకాలంగా ల్యారీపై మునుపెన్నడూ లేని విధంగా తరచూ విమర్శలు వినవస్తున్నాయి. ల్యారీ స్వభావం, పనితీరు చుట్టూ కేంద్రీకృతం అయిన విమర్శలవి. వేటాడి చంపే క్రూర స్వభావం ల్యారీలో విస్పష్టంగా లోపించడాన్ని డౌనింగ్ స్ట్రీట్ అధికారులు గమనించారు. "ఎలుకల్ని వేటాడడం కన్నా ఎక్కువ సమయం ల్యారీ నిద్రలోనే గడుపుతున్నాడు" అని కొందరు ఫిర్యాదు చేశారు. అయితే నేను విన్నదేమంటే సునాక్ అతడిని విధుల నుంచి విరమింపజేసే ప్రమాదం లేదని. ఏ విధంగా చూసినా కూడా సునాక్ దంపతులకు వీడ్కోలు పలికి, కొత్తగా వచ్చేవాళ్ల మెప్పు పొందే వరకైనా ల్యారీ అక్కడ ఉంటాడు. ల్యారీ మాంసం కూరను ఇష్టపడతాడా లేక పప్పూ, అన్నం అంటాడా అనేది బహుశా అప్పుడు మనం తెలుసుకోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ఆవిష్కరణలు



ప్రతి రెండు నిమిషాలకు ఒక తల్లి ప్రసవ సమయంలో మరణిస్తోంది. అధునాతన వైద్య ఆవిష్కరణలను అత్యంత అవసరం అయినవారికి అందుబాటులో ఉంచడం ద్వారా 2030 నాటికి 20 లక్షల మంది తల్లులు, శిశువుల జీవితాలను రక్షించవచ్చు.

– బిల్ గేట్స్, ఐటీ దిగ్గజం

విముక్తి అనుభూతి



మహిళలు తమకు అసౌకర్యంగా ఉన్నా కూడా నవ్వుతూ కనిపించాలి!. లేదంటే 'కోపిష్టి' అనే ముద్ర వేస్తారు. ఆశించడాలకు తగ్గట్లు ఉండవలసిన ఒత్తిడితో ఆడపిల్లలు సతమతమౌతుంటారు. దీని గురించి నాకు వ్యక్తిగత అనుభవం ఉంది. ఆ ఆశించడాలను వదులుకోవడం నిజంగా చాలా విముక్తిని కలిగించే అనుభూతి.

– ప్రొ॥ ప్రజ్ఞా అగర్వాల్, సైంటిస్ట్

ఐ రన్ ఫర్ ఇవాన్



నా సహోద్యోగి ఇవాన్ గెర్ష్కోవిచ్ తన స్వస్థలానికి 4,707 మైళ్ల దూరంలో ఉన్న రష్యన్ జైలులో చట్ట విరుద్ధమైన నిర్బంధంలో ఉన్నాడు. ఆ దూరాన్ని చిన్నది చేయడం కోసం మాలో కొందరం 'ఐ రన్ ఫర్ ఇవాన్' సోషల్ మీడియా ఉద్యమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నాం. దయచేసి మాతో చేరండి.

– క్రిస్టీనా రోకా, వాల్‌స్ట్రీట్ జర్నల్ ఎడిటర్

వరుస ఘటనలు



గత ఆరు నెలల్లో హతం అయిన ఖలిస్థాన్ తీవ్రవాదులు : హర్విందర్ రెండా (పాకిస్థాన్), హ్యాపీ సంఘేరా (ఇటలీ), బషీర్ అహ్మద్, పర్మ్‌జిత్ పంజ్వార్, ఖలీద్ రజా (పాకిస్థాన్), అవతార్ ఖండ (యు.కె.), ఐజాజ్ అహ్మద్, సయ్యద్ నూర్ (ఆఫ్ఘనిస్థాన్), నిజ్జర్, సుక్ దునెకె (కెనడా).

– రిపి బాగ్రీ, డేటా ఎనలిస్ట్

మిశ్రమ స్పందన



నేను లోక్‌సభ, రాజ్యసభ సిబ్బందిలో చాలా మందితో మాట్లాడాను. ఎక్కువ మందికి కొత్త పార్లమెంటు భవనం డిజైన్ నచ్చలేదు. ఇక రెండు సభలకు, సందర్శకుల గ్యాలరీకి దారి తీసే మార్గాలలో సూర్యరశ్మి, స్వచ్ఛమైన గాలి లేకపోవడం నేను గమనించాను. కాంతి, గాలి లేనప్పుడు మనుషుల అలికిడి కూడా తక్కువైపోతుంది.

– షీలా భట్, పాత్రికేయురాలు

అప్పటి రోజులు



మెడికల్ కాలేజీలో చేరి 23 ఏళ్లు! ఆ పెద్ద నోటీస్ బోర్డులో నా పేరు వెతుక్కుని, 'అబ్బ మళ్లీ రోల్ నెం.1' అని ముక్కు మూసుకోవడం నాకింకా గుర్తు. ఫార్మాలిన్ నిండిన అనాటమీ ల్యాబ్ దుర్వాసన గురించి ఇప్పుడు ఆలోచించినా నా కళ్లు మండిపోతున్నట్లే ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు బోధకురాలిని.

– డాక్టర్ ఆరతి బళ్లారి, వైద్యశాస్త్ర బోధకురాలు

తెర వెనుక వైద్యుడు

ఆరోగ్యం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే అందులో ఫార్మసిస్ట్ పాత్ర అత్యంత ప్రధానం. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న వ్యాధులను దృష్టిలో ఉంచుకొని, దానికి తగినట్లుగా కొత్త మందులను తయారు చేయడం, నివారణా మార్గాలు కనుగొనడంలో ఫార్మసిస్ట్ పాత్ర కీలకం. ఔషధాల తయారీ, వాటి నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించడం, తగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఔషధాలను నిల్వచేయడం, వ్యాధిగ్రస్థులకు మందుల వినియోగ విధానం పట్ల తగిన సూచనలు, సలహాలు అందజేయడం, వాటి దుష్ఫలితాల పట్ల అవగాహన కల్పించడం లాంటి అనేక విషయాల్లో ఫార్మసిస్ట్ పాత్ర విస్మరించలేనిది. వ్యాధిని గుర్తించి, దానికి తగిన మందును సూచించేవాడు వైద్యుడైతే, ఔషధ ఎంపిక, మోతాదు, వినియోగ విధానం సమస్తమూ అవగాహన కల్పించేది ఫార్మసిస్టు. నిజం చెప్పాలంటే తెర వెనుక వైద్యుడు ఫార్మసిస్టే.


అందుకే ఆరోగ్యకేంద్రాల్లో అత్యవసర పరిస్థితుల్లో వైద్యాధికారులు అందుబాటులో లేనప్పుడు చికిత్స అందించే బాధ్యత ఫార్మసిస్టులదే. కేంద్ర ఆరోగ్యశాఖ 'జాతీయ ఆరోగ్య విధానం–2017' ఫార్మసిస్టులకు సామాజిక ఆరోగ్యంపై శిక్షణ ఇచ్చి వారి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించింది. కొన్ని సమయాల్లో వైద్యులు రాసిన మందులను సమీక్షించే అధికారం కూడా ఫార్మసిస్టుకు ఉంటుంది. మందుల వినియోగంలో ఫార్మసిస్టుల పాత్రను విస్మరించడంవల్ల వాటి వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయింది. తద్వారా అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టి ప్రాణాంతకమైన దుష్ప్రభావాలు సంభవిస్తున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ లాంటి యూరోపియన్ దేశాల్లో, సౌదీ అరేబియా లాంటి అరబ్ దేశాల్లో ఫార్మసిస్టులకు పెద్దపీట వేస్తారు. ఆ యా దేశాల్లోని వైద్యులు పరీక్షల అనంతరం వ్యాధిని గుర్తించి, ఫలానా వ్యాధి, ఫలానా మందు అని నిర్ధారణ చేస్తారు. ఆ వ్యాధికి ఏ ఔషధం సరిపోతుందో, అది ఏయే సమయాల్లో, ఏ మోతాదులో, ఏ విధంగా వినియోగించాలో ఫార్మసిస్టే రోగికి సూచిస్తాడు. కొన్ని యూరప్ దేశాల్లో రోగి వ్యాధిని గుర్తించి, ఔషధాన్ని సిఫారసు చేసే అధికారం కూడా ఫార్మసిస్టుదే. కానీ మనదేశంలో పరిస్థితి దీనికి పూర్తి భిన్నం.

భారత్‌లో ఫార్మసిస్టులకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, సొంత ఫార్మసీలు పెట్టుకొనే స్తోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేయాలి. నిరుద్యోగులైన ఫార్మసిస్టులకు ఫార్మసీలు ఏర్పాటు చేసుకోడానికి వడ్డీ రహిత రుణ సౌకర్యం కల్పించాలి. ఆ విధంగా ఫార్మసిస్టల సేవలను మరింతగా ఉపయోగించుకోవచ్చు.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్ – కెమిస్ట్
(రేపు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం)

ఆలోచన రేపుతున్న కథనాలు

విశ్లేషణ



యతిన్ కార్యేకర్

ప్రపంచమంతటా హిట్ అయిన 'డాక్టర్ హూ' రచయిత స్టీవెన్ మొఫాట్ ఒకసారి, 'చివరకు, మనందరమూ కథలమే' అని రాశాడు. విశిష్టమైన కథలలో జీవిస్తూ, శ్వాసిస్తూ, ప్రేమిస్తున్న ఒక కళాకారుడిగా అది నిజమని నాకు తెలుసు. మనల్ని మనం ఐడెంటిఫై చేసుకోగల కథల పట్ల మనం చాలా గట్టిగా స్పందిస్తాం. అదీ ఏదో మానవాతీతమైన బృహత్తరమైనదానికి మనల్ని అనుసంధానించినప్పుడూ, భాష, భౌగోళిక ప్రత్యేకతల పరిమితులను అధిగమించి మానవత్వాన్ని చవిచూసేలా చేసినప్పుడే! ఉదాహరణకు వ్యక్తిగత లక్ష్యం, స్నేహం, మానవతావాదానికి చెందిన ఇతివృత్తం కలిగినదైనందువల్లనే 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా అందరికీ చాలా సన్నిహితం అయ్యింది. ఉత్తర అమెరికాలో 1 మిలియన్ యూఎస్ డాలర్లు, ఆస్ట్రేలియాలో రెండున్నర లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు దాటి వసూలు చేసిన మొదటి కన్నడ చిత్రంగా 'కాంతార' సాధించిన అద్భుత విజయానికి దాని ఉద్వేగ భరితమైన నేటివిటీయే సహాయపడింది. గొప్ప నమ్మకంతో ఈ సినిమాను సృష్టించారు. పైగా మానవ భావోద్వేగాలు ప్రతిచోటా ఒకేలా ఉంటాయని మనకు గుర్తు చేస్తూనే, ఆ చిత్రం దాని సొంత నీతికి కట్టుబడి ఉంది. ప్రతిధ్వనించే భావోద్వేగాలు, ప్రత్యేకమైన సాంస్కృతిక సందర్భం, ప్రపంచ స్థాయి టెక్నిక్‌ని కలిగి ఉన్నందున దక్షిణ భారత చిత్ర పరిశ్రమల కంటెంట్‌ని ప్రపంచవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.



గురుదేవులు రవీంద్రనాథ్ టాగూర్ ఒకసారి ఇలా అన్నారు: 'ఎవరూ ప్రపంచ భారాన్ని మరింతగా పెంచకూడదు, ప్రతి ఒక్కరూ దానిని తగ్గించడానికి ప్రయత్నించాలి.' ఈ భారాన్ని తగ్గించడానికి కథలు చెప్పడం ఉత్తమ మార్గం అని నేను భావిస్తున్నాను. భాషకు అతీతంగా మనల్ని కలిపే కథలు మనం ఒంటరిగా లేమని గుర్తుచేస్తాయి. పైగా అవి మన భావోద్వేగాలను తిరుగులేని విధంగా ప్రభావితం చేస్తాయి. జపనీస్ రచయిత అకిరా కురసోవా తీసిన 1954 క్లాసిక్ చిత్రం, 'ది సెవెన్ సమురాయ్స్'ని తీసుకోండి. దీన్ని దాదాపు ప్రతి భాషలోనూ రీమేక్ చేశారు. దాని ఇంగ్లీష్ వెర్షన్ 1960లో జాన్ స్టర్జెస్ తీసిన 'ది మాగ్నిఫిసెంట్ 7', హిందీ వెర్షన్ 1975లో 'షోలే'. విజయ్‌టెండూల్కర్ రాసిన 'గిధాడే', 'శాంతత! కోర్ట్ చాలూ ఆహే', 'సఖారం బైండర్', 'కమలా', 'మిత్రాచి గోష్టా' వంటి మరాఠీ నాటకాలను వివిధ భాషల్లోకి అనువదించారు. వీటిలో చాలా నాటకాలు ఇప్పుడు 'జీ థియేటర్'లో హిందీలో అందుబాటులో ఉన్నాయి.

గత కొన్నేళ్లుగా, భారతీయ వినోద పరిశ్రమ మంచి కథా కథనాలపై దృష్టి సారించినందుకు నేను సంతోషిస్తున్నాను. థియేటర్ అయినా, సినిమా అయినా, ఓటీటీ అయినా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కంటెంట్ ప్రభావాన్ని మనం చూస్తున్నాం. దక్షిణ కొరియా, స్పెయిన్, ఫ్రాన్స్, అర్జెంటీనా, జపాన్, జర్మనీ వంటి అనేక ఇతర దేశాల నుండి కథలు ఇప్పుడు సులభంగా అందుబాటులో ఉంటున్నాయి. అలాగే మన కథకులు కూడా ఇంతవరకు ఎవరూ చెప్పని కథలతో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటికే సుపరిచితమైన కథనాలను కూడా తిరిగి ఆవిష్కరిస్తున్నారు. డబ్బింగ్, సబ్‌టైటిలింగ్‌ల ద్వారా కథల పరిధిని విస్తరిస్తున్నారు. సాంస్కృతికంగా సున్నితమైనవీ, సందర్భోచితమైనవీ అయిన ఉపశీర్షికలూ; సంభాషణకు చెందిన సారాంశాన్ని సంగ్రహించేలా, రెండు భాషల సూక్ష్మ నైపుణ్యాలను పుణికిపుచ్చుకున్న మంచి అనువాదకులు, ట్రాన్స్‌స్క్రైబర్లు ఇందుకు ఎంతో అవసరమనేది ఈ సందర్భంగా గమనార్హం.

ఇక థియేటర్ గురించి చెప్పాలంటే, ఇది కూడా మౌఖిక సంప్రదాయాల నుండి వీధి ప్రదర్శనలు, ప్రోసినియం (పరదాకు ముందు థియేటర్ వేదికకి చెందిన భాగం) ప్రదర్శనలతోపాటు, ముఖ్యంగా టెలివిజన్ ప్రేక్షకుల కోసం రూపొందించిన టెలిప్లేల వరకు అభివృద్ధి చెందింది. ఇవి ఇప్పుడు భాషా సరిహద్దులను దాటి విస్తృత శ్రేణి థీమ్‌లను, పాత్రలను సృష్టిస్తున్నాయి. మనం అలాంటి సృజనాత్మక ప్రకంపనల కాలంలో జీవిస్తున్నందుకూ; నా టెలిప్లేలలో ఒకటైన 'మా రిటైర్ హోతీ హై' ఇప్పుడు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రేక్షకులకు కన్నడ, తెలుగు భాషలలో అందుబాటులో ఉన్నందుకూ నేను ఎంతో పులకరించి పోతున్నాను


మంచి కథలలోని మరొక ముఖ్య అంశం ఏమిటంటే – అవి ఆలోచనలను రేకెత్తిస్తాయి. చాలా సూక్ష్మంగా సామాజిక మార్పును ఉత్కృష్ట స్థాయిలో ప్రారంభిస్తాయి. ఉదాహరణకు – స్వలింగ సంబంధాలు, లింగ పరమైన రాజకీయాలతో సహా అనేక సామాజిక సమస్యల గురించి మన ఆలోచనలను సరిదిద్దుకునేలా చేయడంలో చేతన్ దత్తర్, విజయ్ టెండూల్కర్ వంటి నాటక రచయితల రచనలు సహాయపడ్డాయి. టెండూల్కర్ రాసిన 'కమలా'ను చలనచిత్రంగా రూపొందించినప్పుడు సాధారణ స్త్రీల, మరీ ముఖ్యంగా గిరిజన స్త్రీల గౌరవం గురించి తీవ్రమైన సామాజిక చర్చ రేకెత్తింది.

ఈ రోజు కంటెంట్‌కు టెక్నిక్ సహాయం చేసినమాట నిజమే అయినా, కొత్త బాధ్యతలవైపు మారడానికీ, సమస్యల ప్రపంచంలో వారి స్థానం గురించి కొత్తగా ఆలోచించడానికీ ప్రజలను ప్రేరేపించే కథనాలు ఇప్పటికీ అవసరమే. భారతదేశంలో అటువంటి సుసంపన్నమైన కథనాలకు ఎన్నడూ కొరత లేదు. అవి అపారమైన సాంస్కృతిక, భౌగోళిక వైవిధ్యం నుండి ఉద్భవించినప్పటికీ వాటికి మనల్ని కదిలించే, తరలించే శక్తి ఉంది. మనల్ని కలిసికట్టుగా నవ్వుతూ, దుఃఖిస్తూ జీవితాన్ని ఆస్వాదింప చేస్తాయి.

వ్యాసకర్త ప్రముఖ బాలీవుడ్ నటులు

చేయరానివి ఇవి!

పరస్తుతి, పరనింద, ఆత్మస్తుతి, ఆత్మనింద – ఈ నాలుగూ సజ్జనులు చేసే పనులు కావు అని మహాభారతంలో ఒక నీతి ఉంది. 'అన్య కీర్తనంబు, అన్య నిందయు, తన్ను/ పరగ పొగడికోలు, ప్రబ్బికోలు,/ ఆపగా తనూజ! ఆర్యవృత్తములు కా/వనిరి వీని ఆద్యులైన మునులు...' ఇక్కడ 'ఆపగా తనూజుడు' (నదీ పుత్రుడు) అంటే గాంగేయుడైన భీష్ముడు. ఆ ధర్మవేత్తకు ఈ నీతి బోధిస్తున్నది ఛేదిరాజు శిశుపాలుడు. 'నువ్వు అదే పనిగా శ్రీకృష్ణుడినే పొగుడుతున్నావు. ఇది పెద్దలు చేయదగిన పనికాదు' అని శిశుపాలుడి అభ్యంతరం. ఉటంకించింది శిశుపాలుడయినా, ఇది 'ఆద్యులైన మునుల' మాట కదా! పెద్దలిలా ఎందుకు చెప్పారో ఇంచుక చింతన చేసుకొంటే తప్పులేదు.



జ్యోతిర్మయం

పరులను వాళ్ల ఎదుటే 'ముఖస్తుతి' చేసేవాడు... పలచనైపోయి, ఆశ్రితుల స్థాయికి జారిపోతాడు. గౌరవం కోల్పోతాడు. పరులను వాళ్ల పరోక్షంలో పొగిడినా, అలా పదేపదే చేస్తుంటే... దానివల్ల తనవాళ్లకు నిరుత్సాహం కలగడమే కాక, వాళ్లు దాన్ని పరి పరి విధాలుగా అపార్థం చేసుకొనే ప్రమాదం ఉంది. అలాగే పరనింద కూడా ప్రయోజన శూన్యం. అహంకారాన్ని ప్రకటించుకోవడమూ, శత్రుత్వాన్ని పెంచుకోవడమూ తప్ప నింద వల్ల సాధించేదేముంది? నిందను సకారాత్మకంగా స్వీకరించి, తమ 'తప్పు' గ్రహించి మారిపోయే 'పరులు' ఎక్కడయినా ఉంటారా?

ఆత్మస్తుతి సరేసరి. అది సాధారణంగా అల్పత్వాన్నీ, ఆత్మన్యూనతా భావాన్నీ సూచిస్తుంది. ధీరులూ, సమర్థులూ వాళ్ల ఘనత వాళ్ళు చెప్పుకోరు. ఘనతను చేతలే చెప్తాయి. చేతలు లోపించి నప్పుడే మాటలు. 'నేను ఘనుడిని' అని ఎంత చెప్పుకొన్నా దానికి విలువా, విశ్వసనీయతా ఉండవు. నమ్మేదెవరు?

ఆత్మనింద కూడా ప్రమాదకరమే. ఆత్మవిమర్శతో తన తప్పులు గ్రహించుకొని, తొలగించుకొంటే మంచిదే కానీ ఊరకే తనను తాను నిందించుకొంటూ కూర్చొంటే, అది ఉన్న ఆత్మవిశ్వాసాన్నీ, ధైర్యాన్నీ కూడా దెబ్బ తీసి, క్రమంగా మరింత పిరికితనానికీ, అసమర్థతకూ, కుంగుబాటుకూ దారి తీస్తుంది.

అయితే ఒకటి! మహాభారతమయితే ఇలా చెప్పింది కానీ ఈ రోజులలో, ఆత్మస్తుతీ, పరనిందా, దాంతోపాటు అవసరార్థం 'తమంత వారు లేరు సుమా!' అంటూ పరస్తుతీ, లోకం చేత ఓహో అనిపించుకొనేందుకు అప్పుడప్పుడూ ఆత్మనిందా మానేస్తే, సమాజంలో ఎక్కువగా మౌనమే రాజ్యం చేయాల్సివస్తుందేమో!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.1.36 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.17 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.02 నుండి 2.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.16 నుండి 1.05 వరకు, తదుపరి ప.2.41 నుండి 3.27 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.31 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 5.53.

క్లుప్తంగా...

జూలో ఆడ సింహం మహేశ్వరి మృతి



ఆరిలోవ(విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జూ పార్కులో శనివారం అర్ధరాత్రి ఆడ సింహం మహేశ్వరి మృతి చెందింది. 18 ఏళ్ల వయసు కలిగిన మహేశ్వరి కొద్ది రోజులుగా తీవ్రమైన మయోకార్డియల్ ఇన్ఫార్షన్ వ్యాధితో బాధపడుతుందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. దానికి జూ వైద్యులు వైద్యం అందించినా వృద్ధాప్యం కారణంగా కన్నుమూసిందని పేర్కొన్నారు. 2019లో గుజరాత్‌లో సక్కర్‌బాగ్ జూ పార్కు నుంచి ఇక్కడకు తీసుకొచ్చినట్లు తెలిపారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతోన్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. గుంటూరు–ద్రోణాచలం (17228), కాచిగూడ–నడికుడి (07791), నడికుడి–కాచిగూడ (07792), విజయవాడ–గుంటూరు (07464), గుంటూరు–విజయవాడ (07465), హుబ్లీ–విజయవాడ (17239), గుంటూరు–కాచిగూడ (17251), గుంటూరు–సికింద్రాబాద్ (17253), సికింద్రాబాద్–గుంటూరు (17254), మెదక్–కాచిగూడ (07578), కాచిగూడ–మెదక్(07577), రేపల్లె–మార్కాపురం (07889), మార్కాపురం–రేపల్లె (07890) రైళ్ళు ఈ నెల 25 నుంచి అక్టోబర్ 1 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ద్రోణాచలం–గుంటూరు (17227), విజయవాడ–హుబ్లీ (17330), కాచిగూడ–గుంటూరు (17252) రైళ్లు ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. మచిలీపట్నం–మంత్రాలయం (07067) ఈ నెల 26,28,30 తేదీల్లో, మంత్రాలయం–మచిలీపట్నం(07068) రైలు ఈ నెల 27, 29, అక్టోబర్ 1 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

శ్రీశైలానికి మళ్లీ ప్రారంభమైన వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మళ్లీ ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం ఎగువ ప్రాజెక్ట్ అయిన జూరాలలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతుండడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు 7,742 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శనివారం నుంచి ఆదివారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 6,683 క్యూసెక్కుల నీరు విడుదలైంది. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.117 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 2 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,025 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 1.40 మిమీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 87.6562 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 853.30 అడుగులకు చేరుకుంది.

కొత్తవలస–కిరండోల్ రైల్వే మార్గంలో విరిగిన కొండచరియలు



కొరాపుట్: ఒడిశా రాష్ట్రంలోని కొత్తవలస–కిరండోల్ రైల్వే మార్గంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆదివారం వేకువజామున కొరాపుట్ రైల్వేస్టేషన్ సమీపంలో జరతి–మనబాల్ మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాళ్లు ఒరగడంతో పెద్ద ఎత్తున మట్టి ట్రాక్‌పైకి చొచ్చుకువచ్చింది. విషయం తెలుసుకున్న సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని పునరుద్ధరణ పనులు చేపట్టాయి. లక్ష్మీపూర్, కొరాపుట్‌ల నుంచి 18 జేసీబీలు తెప్పించి మట్టిని తొలగిస్తున్నారు. సోమవారం ఉదయం వరకు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కిరండోల్–విశాఖపట్నం ప్యాసింజర్, కిరండోల్–విశాఖపట్నం రాత్రిపూట ఎక్స్‌ప్రెస్, జగదల్‌పూర్–భువనేశ్వర్ (హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్), జగదల్‌పూర్–కోల్‌కతా (సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్), జగదల్‌పూర్–దుర్గ్ ఎక్స్‌ప్రెస్‌లను రెండు వైపులా నిలిపివేశారు. నేషనల్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని కిరండోల్, బచేలి ప్రాంతాల నుంచి ఈ మార్గంలోనే రవాణా చేస్తుంది. అందుకే భారీ సంఖ్యలో గూడ్స్ రైళ్లు విశాఖపట్నం వైపు వెళ్తాయి. తాజాగా ఘటన నేపథ్యంలో అనేక గూడ్స్ రైళ్లని చిన్నచిన్న స్టేషన్ల వద్ద నిలిపివేశారు.

● తెలంగాణ

గుండెపోటుతో విద్యార్థిని మృతి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టి.పల్లవి (16) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. తొలుత విద్యార్థిని గుండెపోటుతో బాధపడుతుండటంతో వెంటనే అధ్యాపకులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పల్లవి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ.

లైక్ కొడితే రూ.50 కామెంట్ పెడితే రూ.100

టెలిగ్రామ్‌లో సరికొత్త సైబర్ మోసం

టాస్క్ బేస్డ్ స్కామ్‌ల విషయంలో జరభద్రం

సైబర్ భద్రత నిపుణుల సూచన, హెచ్చరిక

కూర్చున్నచోటే రోజుకు రూ.వేల సంపాదన మీ సొంతం.. మీరు చేయాల్సిందల్లా మేం పంపే ఇన్‌స్ట్రాగామ్ అకౌంట్లను ఓపెన్ చేసి వాటిలోని వీడియోలు, ఫొటోలకు లైక్ కొట్టడమే.. అలా లైక్ కొట్టిన స్క్రీన్‌షాట్ మాకు పంపితే ఒక్కో అకౌంట్ స్క్రీన్‌షాట్‌కు రూ.100 చొప్పున మీ ఖాతాలో జమ చేస్తాం... మేం చెప్పిన యూట్యూబ్ వీడియోకు లైక్ కొడితే రూ.50... మేం చెప్పిన సినిమా రివ్యూకు ఐదు పాయింట్లు ఇస్తే.. మీ ఖాతాల్లో రూ.150 వేస్తాం....



ఏంటి ఇదంతా నిజం అనుకుంటున్నారా..?

ఇదో సరికొత్త సైబర్ మోసం.. టెలిగ్రామ్ వేదికగా జరుగుతున్న ఈ తరహా మోసాలు ఇప్పుడు పెరిగాయని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టాస్క్ బేస్డ్ స్కాం అంటే..

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తదారులు వెతుకుతూనే ఉన్నారు. టెలిగ్రామ్ యూజర్లను టార్గెట్ చేసుకుని టాస్క్‌బేస్డ్ స్కాంలు చేస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. టెలిగ్రామ్ యూజర్లకు సైబర్ నేరగాళ్లు కొన్ని మెసేజ్‌లు పంపుతూ అందులో పేర్కొన్న టాస్క్‌పూర్తి చేస్తే డబ్బులు మీ ఖాతాలో వేస్తామని చెప్పే మోసాన్నే టాస్క్‌బేస్డ్ స్కాంగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న టాస్క్‌బేస్డ్ మోసాలు చూస్తే...

ఈ ఖాతాలు ఫాలో కండి.. టెలిగ్రామ్ యూజర్లకు పంపే మెసేజ్‌లలో మేం పంపే లింక్ ఓపెన్ చేసి ఈ ఇన్‌స్టాగామ్ ఖాతాలను ఫాలో అవుతూ, వాటిని ఓపెన్ చేసి స్క్రీన్‌షాట్ తీసి పంపితే డబ్బులు పంపుతామంటారు. రోజుకు 30 నుంచి 50 ఖాతాలు ఫాలో కావాలని చెబుతారు.

యూ ట్యూబ్ వీడియోలకు లైక్‌లు..: సైబర్ మోసగాళ్లు పంపే మెసేజ్‌లలో కొన్ని యూట్యూబ్ వీడియోల లింక్‌లు పెడతారు. వాటిని ఓపెన్ చేసి ఆ వీడియోకు కాసేపు వాచ్ చేయడంతోపాటు లైక్ కొడితే మీ ఖాతాలో డబ్బులు వేస్తామని నమ్మబలుకుతారు.

హోటళ్లు, రెస్టారెంట్లకు రేటింగ్ పేరిట..: ఫలానా హోటల్, లేదంటే ఒక ఏరియాలోని రెస్టారెంట్లో సదుపాయాలు చాలా బాగున్నాయని, ఫుడ్ ఐటమ్స్ బాగున్నాయని, ఆఫర్లు బాగున్నాయని..ఇలాంటి రివ్యూలు, రేటింగ్ ఇచ్చినందుకు డబ్బులు ఇస్తామని చెబుతుంటారు.

సినిమా రివ్యూలకు రేటింగ్.. మేం పంపే లింక్ ఓపెన్ చేసి అందులోని వెబ్‌సైట్‌లో ఉన్న సినిమా రివ్యూలకు రేటింగ్ ఇవ్వాలని టాస్క్ ఇస్తారు..ఇలా ఒక్కో రివ్యూకు రేటింగ్ ఇస్తే మీ బ్యాంకు ఖాతాలో డబ్బులు వేస్తామని టాస్క్ ఇస్తారు.

మోసానికి తెరతీస్తారు ఇలా..

ముందుగా ఇచ్చిన టాస్క్‌పూర్తి చేసిన తర్వాత, మీ బ్యాంకు ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామంటూ పేరు, వయస్సు, వృత్తి, వాట్సప్ నంబర్, ఏ ప్రాంతంలో ఉంటారు..విద్యార్హతలు, బ్యాంకు ఖాతా నంబర్, బ్యాంకు పేరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఇలా పూర్తి వివరాలు సేకరిస్తారు. మొదట ఒకటి రెండు సార్లు మన బ్యాంకు ఖాతాలోకి చిన్నచిన్న మొత్తాలు జమ చేసి నమ్మకాన్ని పెంచుతారు. ఆ తర్వాత మన బ్యాంకు ఖాతాలోంచి ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొట్టి మోసానికి తెరతీస్తారు. మన పూర్తి వివరాలతోపాటు, మన ఫోన్, కంప్యూటర్‌ను వారి ఆధీనంలోకి తీసుకుని ఓటీపీలను సైతం తెలుసుకుని, మన బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తారని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు..

ఇలాంటి మెసేజ్‌లు చూస్తే అనుమానించాల్సిందే..

ఆన్‌లైన్‌లో సైబర్ మోసాలు పెరుగుతున్నందున వీలైనంత వరకు అనుమానాస్పద మెసేజ్‌లలోని లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు.

అడ్డగోలు లాభాలు ఇస్తామని ఊదరగొడుతున్నారంటే అది కచ్చితంగా సైబర్ మోసమని గ్రహించాలి.

వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు అడుగుతున్నట్టు గమనిస్తే జాగ్రత్తపడాలి.

అపరిచిత వ్యక్తులు ఆన్‌లైన్‌లో మనకు పంపే మెసేజ్‌లను నమ్మవద్దు.

బాబూ.. స్కిల్ స్కామ్ డబ్బు రాష్ట్ర ఖజానాకు జమ చేయండి

చంద్రబాబుకు పోస్టుకార్డులు రాసిన ప్రజలు



రాసిన పోస్ట్ కార్డులను చూపుతున్న గొల్లపూడి గ్రామస్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'గజదొంగ నారా చంద్రబాబు నాయుడు గారికి.. అయ్యా.. మీరు స్కిల్ స్కామ్‌లో ప్రజల సొమ్మును దోచుకున్నారని ప్రాథమిక విచారణ జరిగి ఏసీబీ కోర్ట్ రిమాండ్ విధించింది. మాజీ ముఖ్యమంత్రిగా బాధ్యతగల వ్యక్తివంటూ మీ వందిమాగధులు కీర్తిస్తున్న నేపథ్యంలో మీరు నిజాయితీగా ఆ డబ్బు ఎక్కడికి మళ్లించారో రాష్ట్ర ప్రజలకు సవివరంగా తెలియ చేసి.. ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు జమ చేయాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాము..' అంటూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ ప్రజలు చంద్రబాబుకు పోస్ట్ కార్డులు పంపారు. స్కిల్ స్కామ్‌లో రిమాండ్ ఖైదీ (7691)గా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గొల్లపూడి గ్రామస్తులు ఆదివారం నిర్వహించిన పోస్ట్ కార్డుల ఉద్యమంలో భాగంగా గ్రామ ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పోస్ట్ కార్డులపై పైవిధంగా రాసి ఆ పోస్ట్ కార్డ్‌లను చంద్రబాబు పేరుతో రాజమండ్రి సెంట్రల్ జైలు చిరునామాకు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా గొల్లపూడి గ్రామస్తులు మాట్లాడుతూ స్కిల్ స్కామ్‌లో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు సాంకేతిక కారణాలతో తప్పించుకుందామని యత్నిస్తున్నారు తప్ప.. తాను తప్పు చేయలేదని మాత్రం అనకపోవడం గమనార్హమన్నారు. ఈ స్కామ్‌లో లోకేశ్ పాత్ర కూడా ఉందని సీఐడీ తమ రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. అందుకే అతన్నికూడా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున ఢిల్లీ వదిలి రావడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కారంపూడి సురేష్, కోమటి చుక్కయ్య, ధూళిపాళ శ్రీనాథ్, గేరా సుమన్ కుమార్, ధనేకుల చౌదరి, నామాల సుధాకర్, కోట పూర్ణచంద్రరావు, వేమూరి వెంకయ్య, వేముల కొండ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య,చంద్ర ప్రభలపై కోనేటిరాయుడు



తిరుమల మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై అమ్మవార్లతో కలిసి ఊరేగుతున్న మలయప్ప స్వామి

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన ఆదివారం నాడు ఉదయం సూర్య ప్రభపై ఊరేగుతూ మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ వాహనసేవల్లో భజన బృందాల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవంలో గరుడ సేవ తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన వాహనంగా శ్రీవారి రథోత్సవాన్ని చెప్పవచ్చు. సోమవారం ఉదయం 6.55 గంటలకు మలయప్ప మహారథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగనున్నారు.

పట్టాలెక్కిన విజయవాడ–చెన్నై వందేభారత్ రైలు

▶ మొదటి పేజీ తరువాయి




వందే భారత్ రైలు ప్రారంభ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని

హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. కేంద్రమంత్రి భారతి ప్రవీణ్ మాట్లాడుతూ..మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భార్ భారత్, ఇండియా ఫస్ట్ ఇనీషియేటివ్స్ ఆఫ్ ది నేషన్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో సొంత సాంకేతిక పరిజ్ఞానంతో వందే భారత్ సెమీ హైస్పీడ్ రైలును తయారు చేయడం దేశం సాధిస్తోన్న ప్రగతికి నిదర్శనమన్నారు. 9 నెలల్లోనే ఏపీకి 3 వందేభారత్ రైళ్లను కేంద్రం కేటాయించిందని చెప్పారు. రైల్వే చరిత్రలో 2023 గొప్ప మేలి మలుపుగా నిలిచిపోతుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కేంద్ర మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు జెండాలు ఊపి రైలుకు వీడ్కోలు పలికారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కాచిగూడ–యశ్వంతపూర్ వందేభారత్ రైలును ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ రైలు ఏపీలోని కర్నూలు, అనంతపురం రైల్వే స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడ–చెన్నై సెంట్రల్‌కు మొట్టమొదటి వందే భారత్ రైలును చూసేందుకు నగరవాసులు, పలు పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌కు చేరుకోవడంతో స్టేషన్ సందడిగా మారింది. రైల్వేశాఖ ఆధ్వర్యంలో ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురు పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ప్రదర్శించిన పలు నాటకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వందే భారత్ రైలుతో సెల్ఫీలు తీసుకున్నారు.

దీక్షల పేరుతో పసిపిల్లల కడుపు మాడ్చారు!



ఒంగోలు సబర్బన్: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ నేతలు చేస్తున్న రిలే దీక్షల్లో ఆ పార్టీ నాయకులు నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు.. అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీక్షలకు జనం మద్దతు కరువవడంతో ఐదేళ్లలోపు చిన్నారులను కూర్చోబెట్టి విమర్శలనెదుర్కొంటున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన దీక్షల్లో కేసులు, జైలు అంటే కూడా తెలియని ఐదేళ్లలోపు చిన్నారులు ఇద్దరిని ఉదయం నుంచి సాయంత్రం వరకు తిండీతిప్పలూ లేకుండా కూర్చోబెట్టారు. పసిపిల్లలను తమ రాజకీయాలకు వినియోగించుకుంటూ వారి కడుపుమాడ్చిన టీడీపీ నేతల తీరును స్థానిక ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

పొలం బాట పట్టిన విద్యార్థులు

భూసార పరీక్షల పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన తెనాలి కేంద్రీయ విద్యాలయం

- దేశవ్యాప్తంగా 10 కేంద్రీయ విద్యాలయాల్లో అమలు
- తెలుగు రాష్ట్రాల్లో ఎంపికైన ఏకైక విద్యాలయం తెనాలి కేవీ



మట్టి నమూనాలు తీస్తున్న విద్యార్థులు

తెనాలి: తెనాలిలోని కేంద్రీయ విద్యాలయం (కేవీ) విద్యార్థులు పొలం బాట పట్టారు. గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరించారు. తమ విద్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటైన ల్యాబ్‌లో ఆయా నమూనాలకు భూసార పరీక్షలను నిర్వహిస్తారు. ఆ వివరాలతో భూమి ఆరోగ్య కార్డులు సిద్ధం చేస్తారు. సంబంధిత రైతులకు వారి భూమి ఆరోగ్య పరిస్థితులను ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో వెల్లడిస్తారు.

విద్యార్థులేంటి.. నేల ఆరోగ్యాన్ని చెప్పడమేంటి!

సాధారణంగా మట్టి నమూనాలు సేకరించి.. నేల ఆరోగ్యాన్ని గుర్తించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం పని చేస్తుంది. సంబంధిత అధికారులు మట్టి నమూనాలు సేకరించి.. పరీక్షలు జరిపి.. వివరాలు వెల్లడిస్తారు. అందుకు భిన్నంగా కేంద్రీయ విద్యాలయం విద్యార్థులే ఈ పనికి పూనుకున్నారు. భారత వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పాఠశాలల్లో భూసార మట్టి నమూనాల పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 10 కేంద్రీయ విద్యాలయాలను ఎంపిక చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెనాలి కేంద్రీయ విద్యాలయానికి మాత్రమే ఇందులో స్థానం లభించింది. భూసార పరీక్షల నిర్వహణకు విద్యాలయానికి అవసరమైన పరికరాలు, రసాయనాలను ప్రభుత్వం సమకూర్చింది. ఇద్దరు టీచర్లకు శిక్షణ ఇచ్చారు. వీరిలో ఒకరు ఈ ప్రాజెక్టుకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ శాఖ, ఆత్మ విభాగం సహకారంతో వీరు పనిచే సేలా కార్యక్రమాన్ని రూపొందించారు. తెనాలి కేంద్రీయ విద్యాలయంలో 9, 11 తరగతుల విద్యార్థుల్లో 19 మంది ఈ ప్రాజెక్టులో ఇప్పటికే శిక్షణ తీసుకున్నారు. రెండు రోజులుగా తెనాలి మండలంలోని గుడివాడ, నందివెలుగు గ్రామాల్లోని మెట్ట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. 'ఆత్మ' గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ రామాంజనేయులు పర్యవేక్షణలో స్కూల్ నోడల్ అధికారి కేవీ రాజేంద్రప్రసాద్, ఆర్.రామిరెడ్డి సమక్షంలో మొత్తం 52 నమూనాలను సేకరించారు. విద్యాలయంలో ఏర్పాటైన భూసార పరీక్షా కేంద్రంలో వీటికి పరీక్షలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా అందించిన రెండు యాప్‌ల్లో వివరాలను పొందుపరుస్తారు. తద్వారా రైతుల వారీగా భూమి ఆరోగ్య కార్డులు తయారవుతాయని రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. అనంతరం ఆయా కార్డులతో సంబంధిత గ్రామ సభలు నిర్వహించి.. రైతుల వారీగా వారి భూమిలో నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం సహా 10 రకాల పోషకాల స్థాయిలను వివరిస్తారు.

వ్యవసాయ వికాసానికి..



విద్యార్థులకు వ్యవసాయ విజ్ఞానాన్ని నేర్పించటం, రసాయనాలు అధికంగా వాడకుండా సహజ ఎరువులను వినియోగించేలా రైతులకు సూచిస్తూ భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించటం ఆశయాలుగా కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. కేంద్రీయ విద్యాలయాలను భాగస్వాములను చేసింది. తగిన శిక్షణ ఇవ్వటంతో అమలుకు శ్రీకారం చుట్టాం.

– కేవీ రాజేంద్రప్రసాద్, నోడల్ అధికారి

ప్రాజెక్టులో చేరటం సంతోషంగా ఉంది



చదువుతోపాటు వ్యవసాయంపై అవగాహనకు ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులో చేరటం చాలా సంతోషంగా ఉంది. భూసార పరీక్షలను చేసి రైతులకు ఉపయోగపడతాం. రైతుల కోసం పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– ఎస్.శివగగన్, 9వ తరగతి

'నైరుతి' నిష్క్రమణ ఆరంభం

- నేటినుంచి మొదలై అక్టోబర్ 15 నాటికి దేశం నుంచి పూర్తిగా ఉపసంహరణ
- తిరోగమనంలోనూ వర్షాలకు ఆస్కారం
- వాయుగుండం.. తుపానుల ఊసే లేకుండా నిష్క్రమణ
- కేరళ నుంచి రాక.. రాజస్థాన్ నుంచి తిరోగమనం



సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమవుతోంది. సోమవారం నుంచి పశ్చిమ రాజస్థాన్ ప్రాంతం నుంచి వీటి ఉపసంహరణ మొదలవుతుంది. వాయవ్య భారతదేశంలో యాంటీ సైక్లోన్ అభివృద్ధి చెందడం, నైరుతి రాజస్థాన్‌లో పొడి వాతావరణం నెలకొనడం ద్వారా ఈ రుతుపవనాల నిష్క్రమణ మొదలు కానున్నట్టు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమై అక్టోబర్ 15 నాటికి దేశం నుంచి నైరుతి రుతు పవనాల నిష్క్రమణ పూర్తవుతుంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల నిష్క్రమణ రాజస్థాన్ నుంచి సెప్టెంబర్ 17 నుంచి ఆరంభమవుతుంది. కానీ.. ఈ ఏడాది వారం రోజులు ఆలస్యంగా ఉపసంహరణ మొదలవుతోంది. ఈ ఏడాది నైరుతి ఆగమనం కూడా వారం రోజుల ఆలస్యంగానే మొదలైంది. వాస్తవానికి జూన్ 1వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి క్రమంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తాయి. అయితే, ఈ ఏడాది ఇవి వారం రోజులు ఆలస్యంగా అంటే జూన్ 8వ తేదీన కేరళను తాకాయి. వీటి విరమణలోనూ అదే తీరును కనబరిచాయి.

ఈ ఏడాది 'నైరుతి' విభిన్నం!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు విభిన్నంగా ప్రభావం చూపాయి. ఈ రుతుపవనాల సీజన్ జూన్ నుంచి అక్టోబర్ వరకు ఉంటుంది. ఈ సమయంలో బంగాళాఖాతంలో కనీసం ఐదారు అల్పపీడనాలు, మూడు వాయుగుండాలు, ఒకట్రెండు తుపానులు సంభవిస్తాయి. కానీ.. ఈ సీజనులో ఇప్పటివరకు నాలుగు అల్పపీడనాలు మాత్రమే ఏర్పడ్డాయి. ఇవి కూడా స్వల్పంగానే ప్రభావం చూపాయి తప్ప ఆశించిన స్థాయిలో వర్షాలను కురిపించలేదు. ఈ ఏడాది ఒక్క వాయుగుండం గాని, తుపాను గాని ఏర్పడలేదు. వాయుగుండాలు, తుపానులు ఏర్పడితే సమృద్ధిగా వానలు కురిసేందుకు దోహద పడేవి. ఈ దృష్ట్యా రాష్ట్రంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 16.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

ఎందుకిలా జరిగిందంటే!

ఈ సీజన్‌లో నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ప్రభావం చూపకపోవడానికి వాతావరణ నిపుణులు వివిధ కారణాలు చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు భూమధ్య రేఖ ప్రాంతం నుంచి అరేబియా, బంగాళాఖాతం శాఖలుగా విడిపోతాయి. వీటిలో బంగాళాఖాతం శాఖ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కాకుండా చైనా, జపాన్ దేశాల వైపు వెళ్లిపోయాయి. దీంతో చైనా సముద్రంలో ఈ సీజన్‌లో రెండు మూడు బలమైన తుపానులు ఏర్పడ్డాయి. పైగా.. రుతుపవన ద్రోణి దాదాపు నెల రోజులపాటు హిమాలయాల్లోనే ఉండిపోయింది. ఫలితంగా పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడక రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకుండా పోయాయి. దీనికి ఎల్‌నినో పరిస్థితులు కూడా తోడయ్యాయని వాతావరణ శాఖ విశ్రాంత అధికారి ఆర్.మురళీకృష్ణ 'సాక్షి'కి వివరించారు.


తిరోగమనంలో వర్షాలు

సాధారణంగా నైరుతి రుతుపవనాల తిరోగమనంలోనూ వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలకు ఆస్కారం ఉంటుందని, రుతుపవనాలు చురుకుదనం సంతరించుకుంటాయని, ఫలితంగా వానలు కురుస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా తిరోగమనంలో కురిసే వర్షాలతో రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం సాధారణ స్థితికి చేరుకుంటుందని, వచ్చే నెల 15 వరకు వర్షాలు పడతాయని పేర్కొంటున్నారు.

గోదావరి రోడ్డు కమ్ రైల్వే బ్రిడ్జి మూసివేత

- ఈ నెల 27 నుంచి అక్టోబర్ 26 వరకు రాకపోకలు నిలిపివేత
- రూ.2.10 కోట్లతో బ్రిడ్జికి మరమ్మతులు
- తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత వెల్లడి





రాజమహేంద్రవరం–కొవ్వూరు రోడ్డు కం రైల్వే బ్రిడ్జి

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు: గోదావరి నదిపై రాజమహేంద్రవరం–కొవ్వూరు పట్టణాల మధ్య ఉన్న రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిని మరమ్మతుల నిమిత్తం నెల రోజుల పాటు మూసివేయనున్నారు. 1974 నవంబర్ 20న ఈ వంతెనను అప్పటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారు. 49 ఏళ్లుగా సుదీర్ఘ సేవలందించిన ఈ వంతెన పూర్తిగా పాడైంది. సెంట్రల్ క్యారేజ్ వే, వయాడక్ట్ భాగం, అప్రోచ్‌లు సహా దెబ్బ తిన్న సెకండరీ జాయింట్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకూ ఈ బ్రిడ్జిని మూసివేస్తున్నామని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ప్రకటించారు. మరమ్మతు పనులకు, తక్షణ పునరుద్ధరణ చేపట్టేందుకు వీలుగా ఈ వంతెనపై అన్ని రకాల వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నారు. వయాడక్ట్ భాగం, అప్రోచ్‌లు సహా బీటీ క్యారేజ్‌వే పునరుద్ధరణ, 4.473 కిలోమీటర్ల పొడవున దెబ్బ తిన్న సెకండరీ జాయింట్ల వద్ద జియో గ్లాస్ గ్రిడ్‌ల ప్రత్యేక మరమ్మతులకు రూ.2.10 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటికే మిల్లింగ్ మెషీన్‌తో బీటీ సర్ఫేస్ తొలగింపు తదితర పనులు చేపట్టారు. ఈ బ్రిడ్జి మీదుగా తిరిగే వాహనాలను గామన్ బ్రిడ్జి మీదుగా మళ్లించనున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ, రవాణా, ఆర్టీసీ అధికారులను కోరామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. బ్రిడ్జి మూసివేతపై జిల్లాలోని వివిధ విద్యా సంస్థలకు ముందస్తుగా సమాచారం తెలియజేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

బిహార్‌లో పోలీసు స్టేషన్‌లో దొంగతనం

చోరీకి గురైన మద్యం సీసాలు

పట్నా: దొంగలు ఏకంగా పోలీసు స్టేషన్‌ను టార్గెట్ చేశారు. రాత్రిపూట లోపలికి ప్రవేశించి, మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. బిహార్ రాష్ట్రంలోని ముజఫర్ నగర్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బిహార్‌లో మద్యంపై నిషేధం అమల్లో ఉంది. అక్రమ రవాణా జరుగుతున్న మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొని ఈ స్టేషన్‌లోని స్టోర్‌రూమ్‌లో భద్రపర్చారు. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చిమ్మచీకట్లో దొంగలు చాకచక్యంగా గోడదూకి లోపలికి అడుగుపెట్టారు. స్టోర్ రూమ్‌లో ఐదు పెట్టెలు, ఒక సంచిలో ఉన్న మద్యం బాటిళ్లను చోరీ చేశారు. విచిత్రం ఏమిటంటే ఈ సంఘటన జరుగుతున్నప్పుడు పోలీసు సిబ్బంది స్టేషన్‌లోనే ఉన్నారు. అసలు విషయం మరుసటి రోజు బయటపడింది. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పోలీసుల నిర్లక్ష్యంపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి.

80 శాతం సైబర్ నేరాలు 10 జిల్లాల నుంచే..



నోయిడా: దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. దేశంలో ఇలాంటి నేరాల్లో 80 శాతం నేరాలు కేవలం 10 జిల్లాల నుంచే జరుగుతున్నట్లు ఐఐటీ–కాన్పూర్‌కు చెందిన ఫ్యూచర్ క్రైమ్ రీసెర్చ్ ఫౌండేషన్(ఎఫ్‌సీఆర్‌ఎఫ్) అనే స్టార్టప్ కంపెనీ అధ్యయనంలో వెల్లడయ్యింది. రాజస్తాన్‌లోని భరత్‌పూర్, ఉత్తరప్రదేశ్‌లోని మధుర, జార్ఖండ్‌లోని జామ్‌తారా, హరియాణాలోని నూహ్ జిల్లాల్లో సైబర్ నేరగాళ్లు అధికంగా తిష్ట వేశారని అధ్యయనం తెలియజేసింది. ప్రధానంగా భరత్‌పూర్, మధుర జిల్లాలు కేటుగాళ్లకు హాట్‌స్పాట్లుగా మారాయని పేర్కొంది. భరత్‌పూర్ నుంచి 18 శాతం, మధుర నుంచి 12 శాతం సైబర్ నేరాలు జరగుతున్నట్లు వెల్లడించింది. వీటితోపాటు దేవగఢ్, గురుగ్రామ్, అల్వార్, బొకారో, కర్మాటాండ్, గిరిదీ జిల్లాల నుంచి సైబర్ నేరగాళ్లు పంజా విసురుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఇవన్నీ ప్రధాన నగరాలకు సమీపంలో ఉన్నాయని, ఆయా జిల్లాల్లో సైబర్ సెక్యూరిటీ మౌలిక సదుపాయాలు పెద్దగా లేవని ఎఫ్‌సీఆర్‌ఎఫ్ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్ సింగ్ చెప్పారు.

2023 హాటెస్ట్ వేసవి

కనీ వినీ ఎరుగని వడ గాడ్పులు • గ్లోబల్ వార్మింగ్, ఉద్గారాలే కారణం

పులి మీద పుట్రలా ఎల్ నినో • మేలుకోకుంటే వచ్చే వేసవి మరింత భయానకమే!

2023లో ఎండలు అక్షరాలా మండిపోయాయి. ఎంతగా అంటే, మానవ చరిత్రలో రికార్డయిన అత్యంత హెచ్చు ఉష్ణోగ్రతలు ఈ ఎండాకాలంలోనే నమోదయ్యాయి. ఈ ఏడాదే ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రికార్డులు బద్దలయ్యేంతటి వడ గాడ్పులు, వాటి అనంతర పరిణామాలు ఇందుకు మరింతగా దోహదం చేశాయి. కొన్ని దశాబ్దాలుగా భూగోళం అంతటా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోతున్న పరిణామానికి ఇది ప్రమాదకరమైన కొనసాగింపేనని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

2023 వేసవి 1880లో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వివరాలు నమోదు చేయడం మొదలుపెట్టిన నాటినుంచి అత్యంత వేడిమితో కూడినదిగా రికార్డు సృష్టించింది. ఈ ఆందోళనకర గణాంకాలను న్యూయార్క్‌లోని నాసాకు చెందిన గొడార్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ (జీఐఎస్ఎస్) వెల్లడించింది. 'ఇప్పటికైనా మేలుకుని గ్లోబల్ వార్మింగ్‌కు, ముఖ్యంగా విచ్చలవిడిగా సాగిస్తున్న పర్యావరణ విధ్వంసానికి అడ్డుకట్ట వేయడం ప్రపంచ దేశాల ముందున్న తక్షణ కర్తవ్యం' అని పర్యావరణ ప్రియులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

పులి మీద పుట్రలా...

ఈ వేసవిలో ఎండలు గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టడం వడ గాడ్పుల పాత్ర చాలా ఎక్కువే. ఈ ఏడాది ప్రపంచంలో చాలా ప్రాంతాలను అవి తీవ్రంగా వణికించాయి...

- ఇటు అమెరికా నుంచి అటు జపాన్ దాకా, యూరప్ నుంచి దక్షిణ అమెరికా ఖండం దాకా కానీ వినీ ఎరగని స్థాయిలో వేడి గాలులు అతలాకుతలం చేసి వదిలాయి.
- ఇటలీ, గ్రీస్ తో పాటు పలు మధ్య యూరప్ దేశాల్లో విపరీతమైన వర్షపాతానికి కూడా ఈ గాలులు కారణమయ్యాయి.
- ఈ వడ గాడ్పుల దుష్పరిణామాలను ఏదో ఒక రూపంలో ప్రపంచమంతా చవిచూసింది.

ఇవీ రికార్డులు...

ఈ ఏడాది ఎండలు అన్ని రికార్డులనూ బద్దలు కొట్టి పర్యావరణ ప్రియుల ఆందోళనలను మరింతగా పెంచాయి.



ముందుంది మరింత ముప్పు...

- వాతావరణ మార్పుల పుణ్యమా అని వడ గాడ్పులూ ఏటికేడాది విజృంభిస్తున్నాయి.
- ఎల్ నినో తాలూకు అతి దారుణ దుష్పరిణామాలు 2024 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో చవిచూడనున్నామని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.
- వీటివల్ల వాయవ్య అమెరికా జల ప్రళయాలను చవిచూస్తుంది.
- పసిఫిక్ కు దక్షిణాన ఉన్న దేశాలు తీవ్ర కరువు బారిన పడతాయి.

- ముఖ్యంగా జూన్, జూలై, ఆగస్ట్ ఉమ్మడి ఉష్ణోగ్రతలు నాసా రికార్డుల్లోని గత అన్ని గణాంకాల కంటే 0.23 డిగ్రీ సెంటిగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యాయి.
- అదే 1951–1980 మధ్య అన్నీ వేసవి కా సగటు ఉష్ణోగ్రత కంటే ఏకంగా 1.2 డిగ్రీ సెంటిగ్రేడ్ ఎక్కువగా తేలాయి!

మేలుకోకుంటే అంతే...

గ్రీన్ హౌస్, కర్బన ఉద్గారాలు ఉష్ణోగ్రతల్లో విపరీతమైన పెరుగుదలకు ప్రధాన కారణమని నాసా జెట్ ప్రొపల్షన్ లేబోరేటరీలో క్లైమేట్ సైంటిస్ట్, ఓషనోగ్రఫర్ జోష్ విల్లిస్ అంటున్నారు. 'కొన్నేళ్లుగా భూగోళం స్థిరంగా వేడెక్కుతూ వస్తోంది. ప్రధానంగా మనిషి నిర్వాకమే ఈ వాతావరణ అవ్యవస్థకు దారి తీస్తోంది. సాధారణంగా కూడా ఎల్ నినో ఏర్పడ్డప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం రివాజు' అని ఆయన అన్నారు.

> 'ఈ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల దుష్ప్రభావం మున్ముందు కూడా ప్రపంచం మొత్తం మీదా చెప్పలేనంతగా ఉండనుంది'
>
> **- బిల్ నెల్సన్, నాసా అడ్మినిస్ట్రేటర్**

> సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో అత్యంత హెచ్చుదల నమోదవడమే ఈసారి కనీ వినీ ఎరుగని ఎండలకు ప్రధాన కారణం.
>
> **- జోష్ విల్లిస్, క్లైమేట్ సైంటిస్ట్, ఓషనోగ్రఫర్, నాసా జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ**

ఎలా నమోదు చేస్తారు?

నాసా ఉష్ణోగ్రతల రికార్డు పద్ధతిని జిస్ టెంప్ అని పిలుస్తారు.

- దీనిలో భాగంగా భూ ఉపరితల ఉష్ణోగ్రతలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేల వాతావరణ కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు సేకరిస్తారు.
- నౌకలు తదితర మార్గాల ద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను కూడా సేకరిస్తారు.
- 1951–1980 మధ్య కాలాన్ని సూచికగా తీసుకుని, ఆ 30 ఏళ్ల సగటుతో పోలిస్తే ఏటా ఉష్ణోగ్రతల తీరుతెన్నులు ఎలా ఉన్నదీ లెక్కిస్తారు. మరీ విపరీతమైన మార్పులుంటే తక్షణం అన్ని దేశాలనూ అప్రమత్తం చేస్తారు.

చైనా నిండా ఖాళీ ఇండ్లే!

- వాటి సంఖ్య 100 కోట్ల పై చిలుకేనట
- పుట్టగొడుగుల్లా అపార్ట్‌మెంట్లు
- నిర్మాణ దశలో ఉన్నవారికి లెక్కే లేదు



రియల్టీ సంక్షోభంలో చైనా

న్యూఢిల్లీ: చైనా తీవ్ర రియల్టీ సంక్షోభంలో నానాటికీ పీకల్లోతున కూరుకుపోతోందా? దేశవ్యాప్తంగా ఇప్పటికే జనాభాకు మించి గృహాలున్నాయా? అవించాలవని ఇంకా ఎటు చూస్తే అటు భారీ సంఖ్యలో గృహ నిర్మాణ ప్రాజెక్టులే కనిపిస్తున్నాయా? అవుననే అంటున్నారు చైనా ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగి ఒకరు! తన ఆర్థిక వ్యవస్థ కళకళలాడుతోందని చైనా ప్రభుత్వం బయటికి ఎన్ని మాటలు చెబుతున్నా, రియల్టీ సంక్షోభం నానాటికీ ఆందోళన కలిగించేంతగా విస్తరిస్తోందని చెబుతున్నారు! చైనాలో నివాస గృహాల సంఖ్య కనీసం 100 కోట్లు దాటి ఉంటుందని భావిస్తున్నారు. అవి కనీసం 300 కోట్ల మందికి సరిపోతాయట! దేశ స్టాటిస్టిక్స్ బ్యూరో మాజీ డెప్యూటీ హెడ్ హే కేంగ్ స్వయంగా చెప్పిన వివరాలివి. 'చైనాలో ఖాళీగా ఉన్న ఇళ్ల సంఖ్యపై ఒక్కో నిపుణుడు ఒక్కో మాట చెబుతున్నారు. కానీ, ఎవరి నమ్మినా, నమ్మకపోయినా ఒకటి మాత్రం నిజం. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిర్మాణం పూర్తయి అందుబాటులో ఉన్న ఖాళీ ఇండ్లు కనీసం 300 కోట్ల మందికి సరిపోతాయి' అని హేంగ్‌ను ఉటంకిస్తూ 'రాయిటర్స్' వార్తా సంస్థ పేర్కొంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

రియల్టీ సంస్థల దివాలా బాట

చైనాలో 2021 నుంచీ రియల్టీ రంగం సంక్షోభ బాట పట్టింది. క్రమంగా ఒకటి తర్వాత ఒకటిగా దిగ్గజ సంస్థలన్నీ దివాలా బాట పడుతుండడం సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది. చైనాలో నెలకొన్న ఈ రియల్టీ సంక్షోభానికి దేశమంతటా ఎక్కడ చూస్తే అక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అపార్ట్ మెంట్లే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి...

- ఇవి చాలవన్నట్టు దేశం మొత్తంమీద ఇంకా అసంఖ్యాకమైన అపార్ట్ మెంట్లు నిర్మాణంలో ఉన్నాయి.
- అయితే కొనుగోలు చేసేవాళ్లు లేక నిర్మాణ సంస్థలు కొన్నాళ్లుగా అల్లాడుతున్నాయి.
- రుణ భారానికి తాళలేక 2021లో చైనా రియల్టీ దిగ్గజం ఎవర్ గ్రాండ్ గ్రూప్ నిలువునా దివాలా తీసింది.
- అంతకంటే పెద్ద నిర్మాణ సంస్థ కంట్రీ గార్డెన్ వంటివి దివాలా అంచులో కొట్టుమిట్టాడుతున్నాయి!
- గత ఆగస్టు నాటికే చైనాలో ఏకంగా 700 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణానికి సమానమైన ఇళ్లు అమ్ముడుకాకుండా ఖాళీగా మిగిలిపోయినట్టు ఆ దేశ జాతీయ గణాంక బ్యూరో తాజా అధికారిక గణాంకాలే చెబుతున్నాయి.
- ఇది దాదాపు ఒక్కోటీ 90 చదరపు మీటర్ల పరిమాణంలో ఉండే 72 లక్షల ఇళ్లకు సమానమని రాయిటర్స్ అంచనా వేసింది.
- ఇవిగాక ఇప్పటికే అమ్ముడుపోయి నిర్మాణ సంస్థలు ఎదుర్కొంటున్న నగదు ప్రవాహ సమస్యల కారణంగా ఇంకా పూర్తికాని ఇండ్ల ప్రాజెక్టులు దేశమంతటా అసంఖ్యాకంగా ఉన్నాయి.

అవి శ్మశాన నగరాలు!

- అత్యధిక ఇళ్లను ప్రధానంగా మార్కెట్ స్పెక్యులేటర్లు 2016 సమయంలో మార్కెట్లు కళకళలాడుతున్న సమయంలో ఎగబడి కొన్నారు. ఇప్పుడు వాళ్ళూ, రియల్టీ సంస్థల యజమానులూ ఏం చేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు!
- ఆర్థిక సంక్షోభం బారి నుంచి దేశాన్ని ఎలాగోలా బయట పడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న చైనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఈ రియల్టీ సంక్షోభం పెను సవాలుగా పరిణమించింది.
- చైనా జీడీపీలో దాదాపు 30 శాతం వాటా రియల్టీ రంగానిదే.
- ఒకప్పుడు దేశానికి వెన్నెముకగా ఉన్న రియల్టీ రంగమే ఇప్పుడు పెను భారంగా మారింది.
- 1970ల నుంచి గృహ, వాణిజ్య సముదాయాల నిర్మాణం ఊపందుకుంది.
- దాంతో ఒకప్పుడు 18 శాతమున్న పట్టణ జనాభా ఇప్పుడు ఏకంగా 60 శాతం దాటింది.
- ఆ సమయంలో సంపన్నులు విచ్చలవిడిగా ఇళ్లు, గృహ సముదాయాలనే కొని అట్టిపెట్టుకున్నారు. దాంతో ఇప్పుడు పట్టణాలకు పట్టణాలే ఖాళీగా ఉన్న పరిస్థితి! క్వింగ్ హుయి, జెంగ్ డాంగ్, చెన్ గాంగ్, బిన్ హయీ వంటివి శ్మశాన నగరాలుగా మారాయి!!



భారత్ వెలుపల అతిపెద్ద దేవాలయం

వచ్చే 8న అమెరికాలోని న్యూజెర్సీలో ప్రారంభం

రాబిన్స్‌విల్లే: భారత్ వెలుపల నిర్మితమైన ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయం అమెరికాలో అక్టోబర్ 8వ తేదీన ప్రారంభం కానుంది. న్యూజెర్సీ రాష్ట్రంలోని రాబిన్స్‌విల్లె పట్టణంలో బీఏపీఎస్ స్వామినారాయణ్ అక్షర్‌ధామ్‌గా పిలుచుకునే ఈ గుడి రూపుదిద్దుకుంది. అమెరికా వ్యాప్తంగా తరలివచ్చిన 12 వేల మంది కార్యకర్తలు ఈ ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. 183 ఎకరాల విస్తీర్ణంలో దీని నిర్మాణానికి 2011 నుంచి 2023 వరకు సుమారు 12 ఏళ్లు పట్టింది. సుమారు 10 వేల విగ్రహాలను ఇందులో వాడారు. కంబోడియాలోని 12వ శతాబ్దం నాటి అంగ్‌కోర్ వాట్ హిందూ ఆలయం తర్వాత బహుశా ఇదే అతిపెద్దదని అంటున్నారు. ఆలయాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి హిందువులు తరలివస్తున్నారు.

అది ప్రపంచ వాణిజ్యానికి అడ్డా

'భారత్-మధ్యప్రాచ్యం- యూరప్' కారిడార్‌పై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఆర్థిక నడవా(కారిడార్) రాబోయే కొన్ని శతాబ్దాలపాటు ప్రపంచ వాణిజ్యానికి ప్రధాన ఆధారం కాబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ కారిడార్ ఆలోచన భారత్ గడ్డపైనే పుట్టిందన్న విషయాన్ని చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ఆదివారం 105వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. ప్రాచీన కాలంలో వాణిజ్య మార్గంగా ఉపయోగపడిన సిల్క్ రూట్ గురించి ప్రస్తావించారు. ఈ మార్గం ద్వారా భారత్ విదేశాలతో వాణిజ్య వ్యాపార కార్యకలాపాలు నిర్వహించిందని అన్నారు. ఇటీవల జీ20 శిఖరాగ్ర సదస్సులో ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌ను భారత్ ప్రతిపాదించిందని గుర్తుచేశారు. ఈ కారిడార్‌తో శతాబ్దాల పాటు భారీ స్థాయిలో ప్రపంచ వాణిజ్యం జరుగుతుందని వెల్లడించారు. ఢిల్లీలో జీ20 సదస్సు జరిగిన 'భారత్ మండపం' ఒక సెలబ్రిటీగా మారింది. జీ20లో భాగంగా ఈ నెల 26న ఢిల్లీలో 'జీ20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రాం' నిర్వహించబోతున్నామన్నారు. అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు భారీ స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టబోతున్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశీయంగా తయారైన ఖాదీ, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలను కోరుతున్నానన్నారు.

హైదరాబాద్ బాలిక ఆకర్షణ కృషి ప్రశంసనీయం

హైదరాబాద్‌కు చెందిన 11 ఏళ్ల ఆకర్షణ సతీష్ గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆకర్షణ సతీష్ ఏడో తరగతి చదువుతోందని, నిరుపేద విద్యార్థుల కోసం ఏడు గ్రంథాలయాలు నడుపుతోందని ప్రశంసించారు. ఇరుగుపొరుగు, బంధువులు, స్నేహితుల నుంచి పుస్తకాలు సేకరించి, లైబ్రరీల్లో అందుబాటులో ఉంచుతోందని చెప్పారు. ఏడు లైబ్రరీల్లో దాదాపు 6,000 పుస్తకాలు అంబాటులో ఉన్నాయని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఆకర్షణ సతీష్ కొనసాగిస్తున్న కృషి అందరికీ స్ఫూర్తినిస్తోందని ప్రధానమంత్రి కొనియాడారు.

9 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభం

న్యూఢిల్లీ/ఉదయ్‌పూర్: 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు సరితూగేలా మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రక్రియ శరవేగంగా సాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఆదివారం 9 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆయన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. 9 రైల్వే స్టేషన్లలో వందేభారత్ రైళ్ల ప్రారంభోత్సవంలో గవర్నర్లు, సీఎంలు, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్–బెంగళూరు, విజయవాడ–చెన్నై, ఉదయ్‌పూర్–జైపూర్, తిరునల్వేలి– మధురై–చెన్నై, పట్నా–హౌరా, కాసర్‌గోడ్–తిరువనంతపురం, రూర్కేలా– భువనేశ్వర్–పూరీ, రాంచీ–హౌరా, జామ్‌నగర్–అహ్మదాబాద్ మార్గాల్లో ఇవి ప్రయాణించనున్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. వందేభారత్ రైళ్లు దేశవ్యాప్తంగా ప్రతి ప్రాంతాన్నీ అనుసంధానించే రోజు ఎంతోదూరంలో లేదని చెప్పారు.

ఖలిస్తాన్ వాదులూ జాగ్రత్త!

అమెరికాలోని సానుభూతిపరులకు ఎఫ్‌బీఐ హెచ్చరిక

వాషింగ్టన్/న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యతో భారత్–కెనడాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. తమ దేశంలో ఉన్న ఖలిస్తానీల ప్రాణాలకు ముప్పు ఉందంటూ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) హెచ్చరికలు చేసింది. అమెరికన్ సిఖ్ కాకస్ కమిటీ కోఆర్డినేటర్‌గా ఉన్న ప్రీత్‌పాల్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ..తనతోపాటు మరో ఇద్దరు అమెరికన్ సిక్కులను ఎఫ్‌బీఐ అధికారులు జూన్‌లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారని చెప్పారు.

కెనడాకు ఉప్పందించింది అమెరికానే

నిజ్జర్ హత్య అనంతరం ఆ నిఘా సమాచారాన్ని అగ్రరాజ్యం అమెరికానే ఆ దేశానికి అందజేసిందని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. సదరు సమాచారాన్ని ఆధారంగా చేసుకునే కెనడా భారత్‌పై నేరుగా ఆరోపణలకు దిగినట్లు తెలుస్తోందని ఆ కథనం పేర్కొంది. తమ దేశంలోని భారత దౌత్యాధికారుల సంభాషణలను దొంగచాటుగా వినడం ద్వారా కెనడా నిఘా విభాగాలు ఇదే విషయాన్ని ధ్రువీకరించుకున్నట్లు కూడా భావిస్తున్నారు.

ట్రూడోకు వ్యతిరేకంగా ఆందోళన

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు వ్యతిరేకంగా ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో యునైటెడ్ హిందూ ఫ్రంట్ నిరసన తెలిపింది. భారత వ్యతిరేక ఖలిస్తానీలకు కెనడా ప్రధాని మద్దతు, రక్షణ కల్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. వారిపై అంతగా ప్రేముంటే కెనడాలోనే ప్రత్యేక ఖలిస్తాన్‌ను ట్రూడో ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొంది.

ఆ మహిళలు.. పేరుకే సర్పంచులు

రాంచీ: మహిళా సాధికారత సాధనకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం మహిళల భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉంటోంది. జార్ఖండ్‌లో చేపట్టిన సర్వేలో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో మహిళలకు సగం సీట్లు కేటాయించారు. ధన్‌బాద్ జిల్లాలో 95 మంది మహిళా సర్పంచులున్నారు. తమ ఫోన్‌కాల్‌కు వీరిలో 11 మంది సర్పంచులు మాత్రమే స్వయంగా స్పందించినట్లు సర్వే నిర్వాహకులు తెలిపారు. మిగతా 84 మందిలో సర్పంచుల భర్తలో, మరుదులో, లేక ఆమె కుటుంబంలోని ముఖ్యులో ఆ ఫోన్ కాల్‌లకు స్పందించారు. అధికారులు ఏర్పాటు చేసిన సమావేశాలకు సైతం సర్పంచులకు బదులుగా వారి భర్తలు, ఇతర కుటుంబసభ్యులే హాజరవుతున్నట్లు కూడా ఈ సర్వేలో తేలింది. బ్లాక్, సబ్ డివిజన్, జిల్లా స్థాయి సర్పంచుల సమావేశాలకు హాజరై వీరు తమను ఫలానా గ్రామ సర్పంచి భర్త అనో లేక ఇతర కుటుంబ సభ్యులమనో పరిచయం చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇకపై అధికారులు ఏర్పాటు చేసే సమావేశాలకు మహిళా సర్పంచులు మాత్రమే హాజరు కావాలని స్పష్టం చేసింది. వారికి బదులుగా కుటుంబసభ్యులను, ఇతరులను లోపలికి రానివ్వద్దంటూ అధికారులను ఆదేశించాల్సి వచ్చింది!

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో గెలుపు పక్కా

- తెలంగాణలో గెలిచే అవకాశం
- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై రాహుల్ గాంధీ ధీమా

న్యూఢిల్లీ: రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలను సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తంచేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధిస్తుందన్న రాహుల్.. తెలంగాణలో నెగ్గే అవకాశాలున్నాయని చెప్పారు. ఇక రాజస్థాన్‌లో రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీయే విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్ ఆఫ్ అసోమ్ సంస్థ ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన రాహుల్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఐక్య పోరాటం చేస్తాయని, ఆ ఎన్నికల్లో బీజేపీని నివ్వెరపరిచే ఫలితాలు వస్తాయని అన్నారు. ఆయన ఇంకా ఏం అన్నారంటే..

'ప్రజా సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికే బీజేపీ ఒకే దేశం ఒకే ఎన్నికలు అన్న పాట పాడుతోంది. కులగణన వంటి అంశాలను పక్కదారి పట్టించడానికి బీజేపీ ఎన్నో వ్యూహాలు రచిస్తోంది. బీజేపీ ఎంపీ రమేష్ బిధూరీ మరో ఎంపీ దానిష్‌పై చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ప్రజా అంశాలను పక్కదారి పట్టించడానికే. ఆదాయ అసమానతలు, కొందరి చేతుల్లోనే సంపద పోగుపడిపోవడం, నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చడం, వెనుకబడిన కులాలు, ఓబీసీలు, ఆదివాసీల పట్ల చిన్నచూపు, అధిక ధరలు వంటి సమస్యలు దేశాన్ని బాధిస్తున్నాయి. ఈ అంశాలపై దృష్టి సారించలేని బీజేపీ వాటిని పక్కదారి పట్టించే మార్గంలో నడుస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల విషయానికొస్తే తెలంగాణలో కాంగ్రెస్‌కు గెలిచే అవకాశాలున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కచ్చితంగా గెలుస్తాం. రాజస్తాన్‌లో గట్టి పోటీ ఉంది. కానీ కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుంది. ఇది మా పార్టీ అంచనా కాదు. బీజేపీ చేసుకున్న అంతర్గత సర్వేల్లోనూ ఇదే విషయం తేలింది' అని రాహుల్ గాంధీ వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

జిమ్ అంటేనే ఇష్టం

విలేకరులు అడిగిన కొన్ని సరదా ప్రశ్నలకూ రాహుల్ హుషారుగా బదులిచ్చారు. తీరిక సమయాల్లో నెట్‌ఫ్లిక్స్ చూస్తారా, జిమ్ చేస్తారా అని ప్రశ్నిస్తే జిమ్ చేయడమంటేనే తనకు ఇష్టమని చెప్పారు. గెడ్డంతో ఉండడం ఇష్టమా, లేకపోతే ఇష్టమా అని అడిగితే కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను కాబట్టి వేసుకునే వీటిని పట్టించుకోవడం లేదని, ఎలా ఉన్నా ఫర్వాలేదని నవ్వారు. రాజకీయ నేత కాకపోయి ఉంటే ఏమై ఉండేవారు అని ప్రశ్నించగా 'ఏదైనా అయి ఉండేవాడిని. నా మేనల్లుడు, వాడి స్నేహితుల్ని కలిసినప్పుడు టీచర్‌గా మారతా. వంటగదిలోకి అడుగు పెడితే చెఫ్ అయిపోతా. ఇలా నేను బహుముఖ పాత్రలు పోషిస్తుంటా' అని రాహుల్ చెప్పారు. 'క్రికెట్ కంటే ఫుట్‌బాల్ అంటే ఇష్టం. క్రీడాకారుడు మెస్సి రొనాల్డో అంటేఇష్టమన్నారు. గాడ్‌ఫాదర్, డార్క్‌నైట్ వీటిల్లో ఏ సినిమా అంటే ఇష్టం అని అడగ్గా.. రెండూ నాకు ఇష్టమే' అని చెప్పారు. ఇండియా, భారత్‌లో దేశానికి ఏ పేరు ఉండాలని ప్రశ్నించగా ఇండియా అంటేనే భారత్ అని రాహుల్ చెప్పారు.

నాసా తొలి ఆస్టరాయిడ్ శాంపిల్ వచ్చింది

- అమెరికాలో సైనిక స్థావరంలో ల్యాండింగ్
- రేపటి నుంచి పరిశోధనలు

వాషింగ్టన్: అల్లంత దూరాన అంతరిక్షంలో సేకరించిన ఆస్టరాయిడ్ తాలూకు తొలి శాంపిల్‌ను అమెరికా భూమి మీదికి తీసుకొచ్చింది. ఓసిరిస్ ఎక్స్ అంతరిక్ష నౌక భూమికి దాదాపు లక్ష కిలోమీటర్ల దూరం నుంచి విసిరేసిన శాంపిల్ క్యాప్సూల్ 4 గంటల ప్రయాణం తర్వాత ఆదివారం అమెరికాలోని ఉటా ఎడారిలో సైనిక భూభాగంలో దిగింది. నమూనాను సోమవారం హ్యూస్టన్ లోని నాసా జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలిస్తారు. అనంతరం వాటిమీద పరీక్షలు, పరిశోధనలు చేస్తారు. అక్కడ గతంలో తెచ్చిన చంద్ర శిలలున్నాయి. వాటిని 50 ఏళ్ల క్రితం అపోలో మిషన్‌లో భాగంగా చంద్రుని మీదికి వెళ్ళిన అంతరిక్ష యాత్రికులు తీసుకొచ్చారు. తాజా క్యాప్సూల్‌లో కనీసం పావు కేజీ పరిమాణంలో ఆస్టరాయిడ్ తాలూకు శకలాలు ఉండి ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భూమి ఎలా రూపొందిందో, దానిపై జీవం ఎలా వికసించిందో అర్థం చేసుకోవటానికి అవి మరింతగా ఉపకరిస్తాయని భావిస్తున్నారు. ఇప్పటిదాకా జపాన్ ఒక్కటే ఆస్టరాయిడ్ శకలాలను భూమికి తెచ్చింది.

ఏడేళ్ల ప్రయత్నం...

ఆస్టరాయిడ్లపై పరిశోధన నిమిత్తం నాసా 2016లో 100 కోట్ల డాలర్ల ఖర్చుతో ఓసిరిస్ ఎక్స్ అంతరిక్ష నౌకను ప్రయోగించింది. రెండేళ్ల అనంతరం అది బెన్నూగా పిలిచే ఆస్టరాయిడ్ ఉపరితలంపై దిగింది. 2020లో దాని మీదినుంచి స్వల్ప పరిమాణంలో శకలాలను ఒక క్యాప్సూల్ లోకి సేకరించి వెనుదిరిగింది. అప్పటికే అది కోట్లాది కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసుకుంది. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున్న బెన్నూ ఆస్టరాయిడ్ ప్రస్తుతం భూమికి 8.1 కోట్ల కిలోమీటర్ల దూరంలో సూర్యుని చుట్టూ తిరుగుతోంది. అది 2182 సంవత్సరంలో భూమికి అతి సమీపంగా వస్తుందని, అప్పుడది బహుశా మనను ఢీకొనే ప్రమాదమూ లేకపోలేదని అంచనా. ఓసిరిస్ ఎక్స్ ప్రస్తుతం అపోఫిస్‌గా పిలిచే మరో ఆస్టరాయిడ్ వైపు పయనిస్తోంది.



తిరిగొచ్చిన క్యాప్సూల్ వద్ద నాసా సేఫ్టీ బృందం



ఖరీదైన కృత్రిమ వజ్రాలను ఎవరో రోడ్డుపై పడేయడంతో వాటి కోసం కళ్లను భూతద్దాల్లా చేసుకుని వెతుకుతున్న స్థానికులు. ఆదివారం సూరత్‌లోని మినీ హీనాబజార్‌లో తీసిందీ ఫొటో.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
సోమవారం : 25 : సెప్టెంబర్ : 2023

మారథాన్‌కు అనూహ్య స్పందన

కొరుక్కుపేట: కాంచీపురం నార్త్ జిల్లా డీఎంకే యూత్ వింగ్ ఆధ్వర్యంలో కరుణానిధి శతజయంతి సందర్భంగా ఆలందూరు జస్టిస్ హాల్ సమీపంలో 10 కిలోమీటర్ల మారథాన్ పోటీలు నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. జిల్లా యూత్ వింగ్ ఆర్గనైజర్ బంగారు ప్రకాష్, ఆలందూరు మండల కమిటీ అధ్యక్షుడు ఎస్.చంద్రన్, డీఎంకే ఉత్తర కార్యదర్శి బి.కునాలన్ అధ్యక్షత వహించారు. ఈ పోటీలను అన్బరసన్, సుబ్రమణియన్‌తో పాటు మొత్తం తొమ్మిది మంది మంత్రులు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఉప కార్యదర్శి, ఎమ్మెల్యే ఇ.కరుణానిధి, జిల్లా ట్రేడర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ డైరెక్టర్ జయరామ్, మార్తండన్, జనరల్ కమిటీ సభ్యులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు 9 గ్రాముల బంగారు నాణేలు బహుమతిగా అందించారు.

న్యూస్‌రీల్

నాగై జాలర్లను తరిమికొట్టిన శ్రీలంక సముద్రపు దొంగలు

కొరుక్కుపేట: నాగై జిల్లా సెరుదూర్ మత్స్యకార గ్రామానికి చెందిన సభాపతి (56) మత్స్యకారుడు. అదే ప్రాంతానికి చెందిన ప్రదీప్ (34) ఫైబర్ బోటు అతడికి చెందినది. ప్రకాష్ (32), ప్రవీణ్ (30), తిరుమురుగన్ (26)లు ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున చేపల వేటకోసం సముద్రంలోకి వెళ్లారు. ఈ ఉదయం కొడియాక్ రాయ్‌కు తూర్పున 10 నాటికల్ మైళ్ల దూరంలో వారు చేపలు పట్టారు. అప్పుడు రెండు హైస్పీడ్ బోట్లలో ఏడుగురు శ్రీలంక సముద్రపు దొంగలు అక్కడికి వచ్చి నలుగురు నాగై జాలర్లపై దాడి చేశారు. 500 కేజీల వల, 4 జీపీఎస్ పరికరాలు, రూ. 50 వేలు విలువైన చేపలను లాక్కొని తరిమికొట్టారు. శ్రీలంక పైరేట్ షిప్ దాడిలో నలుగురు మత్స్యకారులు గాయపడ్డారు. అనంతరం మత్స్యకారులు ఒడ్డుకు చేరుకుని మత్స్యకార పంచాయతీకి సమాచారం అందించారు. పంచాయితీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగై కోస్ట్‌గార్డ్ గ్రూప్ పోలీసులు బాధిత జాలర్లను విచారించారు.

అభిబస్ అంబాసిడర్‌గా శింబు

సాక్షి, చెన్నై : ఆన్‌లైన్ బస్ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫారం అభి బస్ అంబాసిడర్‌గా తమిళనాడులో తమిళ స్టార్ సిలంబరసన్(శింబు)ను ఎంపిక చేశామని ఆ సంస్థ సీఓఓ రోహిత్ శర్మ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఈ వివరాలను ఆయన ప్రకటించారు. తమిళనాడులో కిక్ స్టార్టింగ్ ప్రచారాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, సిలంబరసన్‌ను ఎంపిక చేశామన్నారు. తమిళనాడులోని బస్సు ప్రయాణికులకు త్వరితగతిన టికెట్లను బుక్ చేసి అందించడంతో పాటు ప్రయాణ అవసరాలను తీర్చడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. తమ సంస్థ 4.6 స్టార్ రేటింగ్‌లో దూసుకెళ్తోందని గుర్తు చేస్తూ, శింబు రాకతో మరింతగా వినియోగదారుల ముంగిటకు వెళ్లబోతున్నామన్నారు.

తిరుచ్చిలో నలుగురు చిన్నారులు మాయం

తిరువొత్తియూరు: తిరుచ్చి జిల్లాలో నలుగురు చిన్నారులు అదృశ్యమయ్యారు. వివరాలు.. తిరుచ్చి జిల్లా నాగమంగళానికి చెందిన వారు శివలింగం ఇతని కుమారుడు గోకుల్ (7) గత రెండు నెలలుగా విరుదునగర్ జిల్లా నరికుడి సమతువపురం నివాస ప్రాంతంలో తన కుమారుడితో కలిసి తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో గోకుల్(7) ఈనెల 22న రాత్రి దుకాణానికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. అతనితో పాటు ముత్తుకుమార్ కుమారుడు హఫీజ్ (16), కుమార్ కుమారుడు అభిలేష్ కార్తీక్ (15), రాజపాండి కుమారుడు అరుణ్‌పాండి (14) కూడా వెళ్లారు. అయితే చాలా సేపటికి నలుగురు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు చాలాచోట్ల వెతికినా నలుగురి గురించి సమాచారం దొరకలేదు. అరుణపాండి తల్లి భూమాదేవి ఫిర్యాదు మేరకు నరికుడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నటి విజయలక్ష్మిపై నామ్ తమిళర్ నాయకుల ఫిర్యాదు

కొరుక్కుపేట: నామ్ తమిళర్ పార్టీ కో–ఆర్డినేటర్ సీమాన్‌పై నటి విజయలక్ష్మి లైంగిక ఫిర్యాదు చేశారు. చాలా ఏళ్లుగా ఈ కేసు నడుస్తుండగా.. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానని, తన ఆత్మహత్యకు సీమానే కారణమంటూ ఓ వీడియో విడుదల చేశారు. పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శి సెంథిల్‌కుమార్ వలసరవాక్కం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో విజయ మాట్లాడుతూ ప్రస్తుతం బెంగళూరు నగరంలో ఉంటున్న మాజీ నటి విజయలక్ష్మి మా పార్టీ అధినేత సీమాన్‌పై 2011లో తప్పుడు ఆరోపణతో ఫిర్యాదు చేశారు. 2012లో ఫిర్యాదును ఉపసంహరించుకున్నాడు. ఈ స్థితిలో ఆ పార్టీ అధినేత సీమాన్‌పై, వీరలక్ష్మి అనే మహిళపై తమిళ పార్టీ, రాజకీయ పార్టీలు కలిసి కుట్ర పన్నుతున్నారు. విజయలక్ష్మిని ఉసిగొల్పి తప్పుడు ఆరోపణలతో సీమాన్‌పై మరో పోలీసు కేసును విజయలక్ష్మి గత నెలలో ఇచ్చారు. సీమాన్ నుంచి డబ్బు వసూలు చేసి పరువు తీయాలనే దురుద్దేశంతో విజయలక్ష్మి గత నెల రోజులుగా నటిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం నామ్ తమిళర్ పార్టీ కేసు హైకోర్టులో విచారణలో ఉండగా.. సీమాన్ నుంచి డబ్బులు వసూలు చేసేందుకు విజయలక్ష్మి సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేసింది. దీనిపై నామ్ తమిళర్ పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

39 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: శంకరాపురం సమీపంలో ఆదివారం ఓ మహిళా వ్యాపారి ఇంట్లో 39 సవర్ల నగలతో పాటు రూ.20 లక్షల విలువైన వస్తువులను దోచుకెళ్లిన దుండగుల పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలోని ఎస్.చెల్లంపట్టు పంచాయతీ పరిధిలోని నత్తకులం ప్రాంతానికి చెందిన అంజలి ఈమె బట్టల వ్యాపారం చేస్తోంది. రెండు రోజుల కు ముందు అంజలి శంకరాపురం పక్కనే ఉన్న ఎస్.కొళత్తూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం ఇంటికి తిరిగి వచ్చింది. అప్పుడు ఇంటి ముందు తలుపులు పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూసింది. బీరువలోని 39 సవర్ల నగలు, 250 గ్రాముల వెండి, రూ.28 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి శంకరాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బై.. బై.. గణేషా!

రాష్ట్రవ్యాప్తంగా వారం పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలు భారీ ఊరేగింపు మధ్య ఆదివారం నిమజ్జనానికి తరలాయి. దీంతో రాష్ట్రంలోని సముద్ర, నదీ తీరాల్లో సందడి నెలకొంది. నిఘానీడలో పలు మార్గాల గుండా స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా చేపట్టారు. మొత్తం మీద చెదురుమదురు ఘటనల మినహా నిమజ్జనోత్సవం ప్రశాంతంగా సాగింది.

- సముద్ర, నదీ తీరాల్లో కోలాహలంగా నిమజ్జనోత్సవం
- నిఘానీడలో విగ్రహాల ఊరేగింపు



క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తున్న సిబ్బంది, వీక్షిస్తున్న ప్రజలు

సాక్షి, చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 18న ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు.. ఆదివారం నిమజ్జనంతో పరిసమాప్తమయ్యాయి. వారంపాటు వాడవాడల్లో గణనాథుడి విగ్రహాలను ప్రజలు కొలువు దీర్చి పూజలు నిర్వహించారు. హిందూ సంఘాలు, బీజేపీ తదితర పార్టీల నేతృత్వంలో రాష్ట్రంలో లక్షకు పైగా ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఆంక్షలకు అనుగుణంగా వేడుకలు చేపట్టారు.

నిమజ్జనోత్సవం..

వినాయక విగ్రహాలకు భారీ భద్రత నడుమ నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపులపై మరిన్ని ఆంక్షలు విధించారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కొలువు దీర్చిన విగ్రహాలను ఆయా ప్రాంతాల్లోని నదీ తీరాలు, చెరువులు, సముద్ర తీరాలకు తరలించి నిమజ్జనం చేశారు. చెన్నైలో నిమజ్జన వేడుకలకు పోలీసు, కార్పొరేషన్ యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేశాయి. కాశిమేడు. తిరువొత్తియూర్, పట్టినంబాక్కం, నీలాంకరై సముద్ర తీరాలలో నిమజ్జనానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఉదయాన్నే చెన్నై, శివారులలో కొలువు దీరిన చిన్న, పెద్ద విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఇళ్లల్లో కొలువు దీర్చి పూజలందుకున్న వినాయక విగ్రహాలను పలువురు ఆయా ప్రాంతాల్లోని సముద్ర తీరాలకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నుంచి రాత్రి పొద్దు పోయే వరకు హిందూ సంఘాల నేతృత్వంలో ఆయా ప్రాంతాల్లో నిమజ్జనోత్సవం సాగింది. ఆయా ప్రాంతాల వారీగా విగ్రహాలను ఒక చోటకు చేర్చి ఊరగింపుగా సముద్ర తీరాలకు తరలించారు. నిర్వాహకులు, యువకులు కేరింతలు కొడుతూ, సందడి సందడి చేస్తూ ర్యాలీలు చేశారు. దక్షిణ చెన్నై పరిసరాలు, తాంబరం పరిసరాల్లో కొలువు దీరిన గణపయ్యలు భారీ ర్యాలీతో నీలాంకరైకు తరలించారు. సెంట్రల్ చెన్నై పరిధిలో కొలువు దీరిన విగ్రహాల్ని ఊరేగింపుగా కాశి మేడు, పట్టినంబాక్కంలకు, ఉత్తర చెన్నై పరిసరాల్లోని విగ్రహాలు తిరువొత్తియూరుకు తరలించారు. అక్కడక్కడ ఈ విగ్రహాలకు కర్పూర నీరాజనాల్ని సమర్పిస్తూ, భక్తిశ్రద్ధలతో, డప్పు వాయిద్యాల హంగామాతో ఊరేగింపులు జరిగాయి. కొన్నిచోట్ల హిందూ సంఘాల నాయకులు విగ్రహాలకు కర్పూర హారతులు సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విగ్రహాలనూ ఒకేరోజు నిమజ్జనానికి తరలించారు.

రూ. 22 వేలు పలికిన లడ్డూ..

పలు ప్రాంతాల్లో నిమజ్జనానికి ముందుగా వినాయకుడికి సమర్పించిన లడ్డూ వేలం పాట జరిగింది. ఇందులో చెన్నై శివారులోని పుళల్ కావంగరై తెలుగు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద చేపట్టిన వేలంలో పి.హేమాద్రి, స్వాతి దంపతులు రూ. 22 వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు లయన్ జి మురళి, సంఘ ప్రెసిడెంట్ జి వి. రామకృష్ణ, సెక్రెటరీ బి.శేఖర్ నాయుడు, ట్రెజరర్ బి నాగరాజు, చీఫ్ కో–ఆర్డినేటర్ బి. కృష్ణయ్యతో పాటు తెలుగు ప్రజలు పాల్గొన్నారు. అలాగే స్థానిక పట్టాలం గోవిందపురంలో సనాతన శ్రీ సెంగోల్ వినాయకుడి నిమజ్జన వేడుకలు డప్పువాయిద్యాల నడుమ వైభవంగా జరిగాయి. భారత్ హిందూ మున్నని తమిళనాడు అధ్యక్షుడు ఆర్‌డీ ప్రభు నేతృత్వంలో 15 అడుగుల భారీ వినాయక ప్రతిమను ప్రతిష్టించి పూజలను నిర్వహించిన విషయం తెలిసిందే.



నిమజ్జనానికి తరలిన విగ్రహాలు

నిఘా కట్టుదిట్టం..

నిమజ్జన వేడుకను పురస్కరించుకుని ప్రధాన నగరాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. మదురై, చెన్నై, కోయంబత్తూరు, తిరునల్వేలిలో ఇతర మతస్తులు అధికంగా ఉండే ప్రదేశాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఆ ప్రాంతాల గుండా ఊరేగింపు చేపట్టకుండా చర్యలు తీసుకున్నారు. అయితే కొన్నిచోట్ల నిషేధాన్ని ఉల్లంఘించేందుకు నిర్వాహకులు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. కొన్నిచోట్ల ఊరేగింపు కారణంగా ట్రాఫిక్ సమస్యను సృష్టించాయి. చెన్నైలో ఆయా మార్గాల్లో ఉన్న ఇతర మతస్తులకు చెందిన ప్రార్థనా మందిరాల వద్ద పోలీసులు ప్రత్యేక భద్రత చర్యలు తీసుకున్నారు. చెన్నైలో 12 వేల మంది పోలీసు భద్రత నడుమ 2,500లకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. సముద్ర తీరాలలో పూజల అనంతరం కార్పొరేషన్ సిబ్బందికి విగ్రహాలను అప్పగించగా వారు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



ఊరేగింపుగా సెంగోల్ వినాయకుడు



వేలం పాటలో లడ్డు దక్కించుకున్న భక్తులు



ఊరేగింపుగా ..



నిమజ్జనం అనంతరం అలల తాకిడికి ఒడ్డుకు చేరిన విగ్రహాలు

వందే భారత్‌లో ఎల్జీ, కేంద్ర మంత్రి ప్రయాణం

సాక్షి, చెన్నై : తిరునల్వేలి నుంచి ప్రారంభమైన వందే భారత్ రైలులో తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ ఆదివారం పర్యటించారు. సాధారణ ప్రయాణికురాలి తరహాలో ఆమె అందరితో కలిసి మెలిసి పర్యటించారు. తిరునల్వేలి నుంచి బయలు దేరిన వందే భారత్ రైలులో ఉదయం బీజేపీ శాసన సభా పక్ష నేత నయనార్ నాగేంద్రన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ ఇతర నేతలతో పాటు ఆమె ప్రయాణించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తనకు వ్యక్తిగతంగా తిరునల్వేలి రైల్వే స్టేషన్ అంటే ఎంతో ఇష్టం అని వ్యాఖ్యానించారు. తిరునల్వేలి తన తల్లి పుట్టి నిళ్లు కాగా, కన్యాకుమారి తన తండ్రి ఊరుగా పేర్కొన్నారు. తన తల్లితో ఈ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా జరిగిన చిన్ననాటి అనుభవాలను ఆమె గుర్తు చేసుకున్నారు. ఇదే రోజున హైదరాబాద్‌లో వందే భారత్ రైలుకు తాను జెండా ఊపాల్సి ఉందని, అక్కడి ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాని పేర్కొన్నారు. అయితే, తన సొంత జిల్లాలో వందే భారత్ పట్టాల మీదకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ ప్రాంతం బిడ్డగా సాధారణ ప్రయాణికు రాలు వలే తాను ఈ రైలులో ప్రయాణిస్తున్నట్టు పేర్కొన్నారు.



రైలులో ఎల్జీ తమిళి సై, కేంద్రమంత్రి ఎల్. మురుగన్, నయనార్ నాగేంద్రన్

చెన్నై ఆటో డ్రైవర్‌కి ప్రధాని ప్రశంస

కొరుక్కుపేట: మాన్ కీ బాత్‌లో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం 105వ సారి జాతినుద్దేశించి ప్రసంగించారు. అనంతరం తమిళనాడులో ఆటోడ్రైవర్ రాజేంద్ర ప్రసాద్ పావురాలను పెంచుతూ వాటి రక్షణకు చేస్తున్న కృషిని కొనియాడారు. జీవించిన వారి పట్ల దయ చూపండి, వారిని మీ స్నేహితులుగా చేసుకోండి అని పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని సుఖ్‌దేవ్ పాములను సంరక్షించడంలో, చెన్నైలో ఆటో డ్రైవర్ రాజేంద్ర ప్రసాద్ పావురాలకు ఆహారం అందించి గొప్పపని చేస్తున్నారని అభినందించారు.

కూటమిపై కీలక ప్రకటన?

- నేడు జిల్లాల నేతలతో పళణి స్వామి భేటీ
- దాడులకు భయపడబోమన్న జయకుమార్

సాక్షి, చెన్నై: బీజేపీతో కూటమి వ్యవహారంపై సోమవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు. ఇందుకోసం చెన్నైలో పార్టీ జిల్లాల కార్యదర్శుల సమావేశం జరగనుంది. ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు చేయించినా భయపడబోమని అన్నాడీఎంకే సీనియర్ నేత జయకుమార్ స్పష్టం చేశారు. వివరాలు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఇటీవల కాలంగా అన్నాడీఎంకే నేతలను టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. గత వారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో తమ ప్రధాన కార్యదర్శి పళణి స్వామి భేటీ అనంతరం అన్నామలైను అన్నాడీఎంకే నేతలు టార్గెట్ చేశారు. అన్నామలైపై అన్నాడీఎంకే నేతలు తీవ్రంగా విరుచుకు పడుతూ వస్తున్నారు. ఈ పరిణామాలు రెండు పార్టీల మధ్య అంతరానికి దారితీసింది. శుక్రవారం ఢిల్లీకి వెళ్లిన అన్నాడీఎంకే బృందం అన్నామలై తీరుపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఫిర్యాదు చేసింది. అమిత్‌షాను కలిసే ప్రయత్నం చేయగా, ఆయన అనుమతి దక్కలేదు. దీంతో నిరాశతో చెన్నైకు చేరిన అన్నాడీఎంకే బృందం కూటమి విషయంగా త్వరితగతిన తేల్చాలనే డిమాండ్‌ను ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ముందు ఉంచినట్లు సంకేతాలు వెలువడ్డాయి.



అన్నాడీఎంకే కార్యాలయం

నేడు సమావేశం..

కూటమి వ్యవహారంలో నాన్చుడు ధోరణి అనుసరించడం కన్నా, త్వరితగతిన నిర్ణయం తీసుకుని పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని పళణి స్వామికి సీనియర్లు సూచించినట్లు సమాచారం. దీంతో సోమవారం జిల్లాల కార్యదర్శుల సమావేశానికి పళణి పిలుపునిచ్చారు. పార్టీ పరంగా ఉన్న అన్ని జిల్లాల కార్యదర్శులు, సీనియర్లు, ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరు కావాల్సిందేనన్న ఆదేశాలు ఆదివారం వెళ్లాయి. దీంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత పెరిగినట్లయ్యింది. ఈ సమావేశంలో బీజేపీతో కటీఫ్ విషయంగా పళణి స్వామి కీలక ప్రకటన చేయవచ్చు అనే సంకేతాలు వెలువడ్డాయి. బీజేపీని దూరం పెట్టి, మిగిలిన మిత్రులను అక్కున చేర్చుకోవడం లేదా, బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను తప్పిస్తేనే కూటమి చర్చ అన్న డిమాండ్‌ను తెర మీదకు తెచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నాడీఎంకే నేత ఒకరు పేర్కొన్నారు. అదే సమయంలో ఐటీ, ఈడీ, సీబీఐను అడ్డం పెట్టుకుని తమను బీజేపీ పాలకులు బెదిరించే అవకాశం ఉండడంతో, దానిని ఎదుర్కొనేందుకు తగ్గట్టుగా ముందుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయంపై ఆ పార్టీ సీనియర్ నేత జయకుమార్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే కూటమి విషయంగా తన నిర్ణయాన్ని స్పష్టం చేశానని తెలిపారు. కటీఫ్ అంటే కటీఫ్ అన్న మాటేనని, ఐటీ, ఈడీ, సీబీఐను ఉసిగొల్పినా తగ్గేది లేదని, ఎలాంటి దాడులైనా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

పట్టాలెక్కిన వందే భారత్ కొత్త రైళ్లు

- చెన్నై – నెల్లై చెన్నై – విజయవాడ తిరువనంతపురం – కాసరగోడ్ మధ్య సేవలు
- జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని

సాక్షి, చెన్నై: చెన్నై – తిరునల్వేలి(నెల్లై), చెన్నై – విజయవాడ. తిరువనంతపురం – కాసర్ గోడ్ మధ్య వందే భారత్ రైళ్లు ఆదివారం పట్టాలెక్కాయి. ఈ రైళ్లను ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించారు. వివరాలు.. చెన్నై –మైసూరు, చెన్నై – కోయంబత్తూరు మధ్య రాష్ట్రంలో ఇప్పటికే రెండు వందే భారత్ రైళ్లు సేవలను అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ రైళ్లకు ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో మరికొన్ని మార్గాల్లో రైళ్ల సేవలకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మూడో వందేభారత్‌గా చెన్నై ఎగ్మూర్ నుంచి తిరునల్వేలికి ఓ రైలును నడిపేందుకు చర్యలు తీసుకున్నారు.

ఎగ్మూర్ స్టేషన్‌లో..

ఆదివారం దక్షిణ రైల్వే పరిధిలోని ఎగ్మూర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో తిరునల్వేలి, తిరువనంతపురం రైళ్లకు జెండా ఊపే కార్యక్రమం జరిగింది. అలాగే విజయవాడ నుంచి బయలుదేరిన మరో రైలుకు ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ఆహ్వాన కార్యక్రమం జరిగింది. ఢిల్లీని ప్రధాని నరేంద్రమోదీ జెండా ఊపగా, దక్షిణ రైల్వే అధికారులు ఇక్కడ జెండాఊపి రైళ్లను పట్టాలెక్కించారు. చెన్నై – తిరునల్వేలి, చెన్నై – విజయవాడ రైళ్ల సేవలు సోమవారం నుంచి పూర్తి స్థాయిలో జరగనున్నాయి. చెన్నై ఎగ్మూర్ – తిరునల్వేలి రైలు మంగళవారం మినహా తక్కిన రోజులలో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో వారమంతా సేవలందించనుంది. ఈ రెండు నగరాల మధ్య ఉన్న 652 కి.మీ దూరం 7.50 గంటల ప్రయాణ సమయంతో వందే భారత్ దూసుకెళ్లనుంది. ఉదయం 6 గంటలకు తిరునల్వేలిలో బయలు దేరే ఈ రైలు విరుదునగర్, మదురై, తిరుచ్చి, దిండుగల్, అరియలూరు, విరుదాచలం, విల్లుపురం, దిండివనం, మేల్ మరువత్తూరు, చెంగల్పట్టు, తాంబరంలో మాత్రమే ఆగుతుంది. చెన్నైకు మధ్యాహ్నం 1.50 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 2.50 గంటలకు బయలుదేరే ఈ రైలు రాత్రి 10.40 గంటలకు తిరునల్వేలికి చేరుకుంటుంది. చెన్నై – విజయవాడ వైపుగా బుధవారం మినహా మిగిలిన రోజులలో వందే భారత్ రైలు పట్టాలపై దూసుకెళ్లనుంది. 516 కి.మీ. దూరానికి గాను 6.40 గంటలు ప్రయాణ సమయంగా నిర్ణయించారు. చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరే ఈ రైలు మధ్యాహ్నం 12.10 గంటలకు విజయవాడ చేరుతుంది. రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలిలో ఈ రైలు ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 3.20 గంటలకు విజయవాడలో బయలు దేరి రాత్రి 10 గంటలకు చెన్నైకు చేరుకోనుంది. అలాగే సోమవారం మినహా తక్కిన రోజుల్లో తిరునవంతపురం – కాసర్‌గోడ్ రైలు అందుబాటులో ఉండనుంది. ఈ రైలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతుంది. సాయంత్రం 4.05 నిమిషాలకు తిరువనంతపురంలో బయలుదేరే ఈ రైలు అదేరోజు రాత్రి 11.58 నిమిషాలకు కాసర్‌గోడ్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 7 గంటలకు బయలుదేరి సాయంత్రం 3.05 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుందని దక్షిణ రైల్వే వర్గాలు ప్రకటించాయి. ఈ రైళ్లకు ముందస్తు రిజర్వేషన్లు ఇప్పటికే మొదలయ్యాయి.



ట్రైన్ వద్ద దక్షిణమధ్య రైల్వే అధికారులు



వందేభారత్ వద్ద సెల్ఫీ దిగుతున్న కళాకారులు

కొంగు మండలాన్ని స్వీప్ చేయాలి



మాట్లాడుతున్న స్టాలిన్

సాక్షి,చెన్నై: కొంగుమండలం పరిధిలోని అన్ని లోక్‌సభ స్థానాలనూ కైవసం చేసుకోవడే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ పిలుపు నిచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లాలను పలు డివిజన్లుగా విభజించి, పోలింగ్ బూత్‌లకు ఇన్‌చార్జ్‌లను డీఎంకే నియమించిన విషయం తెలిసిందే. ఇప్పటికే డెల్టా జిల్లాలు, దక్షిణ తమిళనాడు జిల్లాల పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. వీరితో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ పరిస్థితుల్లో కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, నామక్కల్, కరూర్, నీలగిరి జిల్లాలతో నిండిన కొంగు మండలంపై తాజాగా ప్రత్యేక దృష్టిని స్టాలిన్ పెట్టారు. అసెంబ్లీ ఎన్నికలలో ఇక్కడ డీఎంకేకు ఆశించిన మేరకు స్థానాలు దక్కలేదు. దీంతో అధికారంలోకి వచ్చినానంతరం కొంగు మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టి కార్యక్రమాలను విస్తృతం చేశారు. ఇక్కడి సామాజిక వర్గానికి చెందిన సెంథిల్ బాలాజీకి మంత్రి పదవి కట్టబెట్టి కార్యక్రమాల వేగం పెంచారు. అయితే ఆయన మనీ లాండరింగ్ కేసులో జైలుకు వెళ్లడంతో కొంగు మండలంపై మరింతగా దృష్టిని స్టాలిన్ పెట్టారు. ఇక్కడ గత కొంతకాలంగా సమగ్ర విచారణ, పరిశీలన మేరకు పోలింగ్ బూత్‌లకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఆదివారం వీరికి శిక్షణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్‌లతో స్టాలిన్ సమావేశమయ్యారు.

గెలుపే లక్ష్యంగా..

సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, ఇక్కడకు తాను రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి కార్యకర్తను, నాయకుడిని చూస్తుంటే, చెప్పలేనంత సంతోషం కలుగుతోందన్నారు. నన్ను మీరు చూసేందుకు రాలేదని, మిమ్మల్ని చూసేందుకు నేనే వచ్చానని వ్యాఖ్యలు చేశారు. ద్రావిడ ఇయక్కంకు బీజం పడ్డ ఈ గడ్డను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఆది నుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పథకాలన్నీ ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా? అని ప్రతి పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్ ఇంటింటా వెళ్లి పరిశీలించాలన్నారు. నామక్కల్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, కరూర్, నీలగిరి లోక్ సభ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపు నిచ్చారు.

క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.1.94 కోట్లు


హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1.94 కోట్లు లభించిందని ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి తెలిపారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం హుండీ లెక్కింపు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారి సన్నిధి, అమ్మవారి ఆలయం, వినాయకుడి ఆలయం, గిరివలయం రోడ్డు ప్రాంతాల్లోని 22 హుండీలను ఆలయ జేసీ జ్యోతి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బందితో లెక్కించారు. లెక్కింపులో రూ.కోటి 94 లక్షల 91,430 నగదు, 230 గ్రాముల బంగారం, 993 గ్రాముల వెండి హుండీల్లో భక్తులు కానుకలు వేసినట్లు ఆలయ జేసీ తెలిపారు. నగదును ప్రభుత్వ ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా చైర్మన్ జీవానందం పాల్గొన్నారు.

మారియమ్మన్ కిరీటంపై రామచిలుక



తిరువొత్తియూరు: సేలం జిల్లా కోట్టై మారియమ్మన్ ఆలయంలో అమ్మవారి విగ్రహం కిరీటంపై రామచిలుక వచ్చి కూర్చుంది. ఇది చూసిన భక్తులు పారవశ్యం చెందారు. సేలం పాత బస్టాండ్ వద్ద కోట్టై మారియమ్మ ఆలయం ఉంది. ఈ క్రమంలో కరుమారియమ్మన్‌కు అభిషేకాలు చేసి అలంకరించిన తర్వాత వచ్చిన ఓ రామచిలుక అమ్మవారి విగ్రహం కిరీటంపై వచ్చి కూర్చుంది. చాలా సేపటి వరకు అక్కడే కూర్చున్న రామచిలుక దేవతా విగ్రహం ముందు వున్న పండ్లను రామ చిలుక తింది. కాగా, అమ్మవారికి రామ చిలుక ప్రీతిపాత్రం అనే విషయం గమనార్హం.

వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యం

సాక్షి, చెన్నై: వినియోగదారుల ప్రయోజనాలే తమ లక్ష్యమని అమెజాన్ బిజినెస్ డైరెక్టర్ సుచిత్ సుభాస్ తెలిపారు. తమ సంస్థ ఆరవ వార్షికోత్సవం పురస్కరించుకుని స్థానికంగా జరిగిన సాధికారత వ్యాపారం, వినియోగదారుల ప్రయోజనాల గురించి ఆయన వివరించారు. 2017లో మొదలైన ప్రయాణంలో దేశంలోని వివిధ సంస్థలు, ఉత్పత్తుల గురించి గుర్తు చేశారు. ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్స్ సామగ్రిని ఇంటి వద్దకే తీసుకొచ్చి అందిస్తున్నామని పేర్కొన్నారు. తమకు వినియోగదారులు ముఖ్యం అని, వారి ప్రయోజనాల కోసం అన్ని రకాల చర్యలు తీసుకున్నామని వివరించారు. వార్షికోత్సవ ఆఫర్‌గా వినియోగదారుల ప్రయోజనం పొందేవిధంగా మరిన్ని ఆకర్షణీయ రాయితీలు, క్యాష్ బ్యాక్‌లపై దృష్టి పెట్టామన్నారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్పాడి వద్ద రైలు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. చెన్నై వ్యాసార్పాడి రైల్వేస్టేషన్ వద్ద ఓ యువకుడు రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో వేగంగా వచ్చిన రైలు అతని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు యువకుడి మృతదేహాన్ని శవ పరీక్షకు ఆస్పత్రికి తరలించారు. విచారణలో మృతుడు పెరంబూరు తిరువికానగర్‌కు చెందిన నాగరాజు (30) అని, కోయంబేడు మార్కెట్లో పనిచేస్తున్నట్టు తెలిసింది. స్నేహితున్ని కలిసేందుకు వెళుతుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిసింది.

• ఆర్ట్ గిల్డ్



మద్రాసు ఆర్ట్ గిల్డ్ , యుజ్ ఆర్ట్స్ ఫౌండేషన్ నేతృత్వంలో 3వ ఎడిషన్‌గా ఏ ఫైన్ బ్యాలెన్స్ థీమ్‌తో వీఆర్ మాల్‌లో ఆదివారం పబ్లిక్ ఆర్ట్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. దీన్ని సినీ నటుడు సిదార్థ్, కొరియా కాన్సుల్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, జపాన్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ మియాతా కెంజీలు ఈ ఆర్ట్స్ ప్రదర్శనను ప్రారంభించారు. - సాక్షి, చెన్నై

టీబీ రహిత రాష్ట్రంగా తమిళనాడు

• మంత్రి సుబ్రమణ్యం


కిట్‌ను అందజేస్తున్న మంత్రులు సుబ్రమణ్యం, రాణిపేట గాంధీ

తిరువళ్లూరు: టీబీ రహిత రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్టు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం అన్నారు. తిరువళ్లూరు జిల్లా విల్లివాక్కం యూనియన్ కొల్లుమేడులో టీబీ పరిశోధన-చికిత్స కేంద్రం ప్రారంభించే కార్యక్రమం ఆదివారం ఉదయం కలెక్టర్ నిర్వహించారు. మంత్రులు సుబ్రమణ్యం, రాణిపేట ఆర్.గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా 30 మంది టీబీ బాధితులకు రూ.48 వేల విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం మరో 30 మంది గర్భిణులకు రూ.2 వేలు విలువ చేసే పౌష్టికాహార కిట్‌ను అందజేశారు. మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ టీబీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. టీబీ అనుమానం వున్న వారికి యూనియన్ పరిధిలోనే పరీక్షలు చేసుకునేలా ప్రతి యూనియన్‌లో అందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే సుదర్శనం, జెడ్పీ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, జేడీ శేఖర్ పాల్గొన్నారు. చిన్నారులకు పరామర్శ: ఆరణిలో లెమన్ జ్యూస్ తాగి అస్వస్థతకు గురై పొన్నేరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న 13 మంది చిన్నారులను మంత్రి సుబ్రమణ్యం పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని జాయింట్ డైరెక్టర్ శేఖర్‌ను ఆదేశించారు. కాగా మంత్రి వెంట ఎమ్మెల్యేలు టీజే గోవిందరాజన్, దురైచంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వేతనాల్లో వ్యత్యాసం సరికాదు


సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేషన్, కలెక్టర్

• కమిషన్ అధ్యక్షుడు వెంకటేషన్

తిరువళ్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా చెత్తకుప్పలను సేకరించే పారిశుద్య కార్మికులకు ఇచ్చే వేతనాల్లో వ్యత్యాసాలు వుండడం సరికాదని జాతీయ పారిశుద్య కార్మికుల కమిషన్ అధ్యక్షుడు వెంకటేషన్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పర్యటనలో భాగంగా అధికారులతో సమావేశాన్ని శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కమిషన్ అధ్యక్షుడు వెంకటేషన్ హాజరై కార్మికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను తయారు చేసి అందించాలని కలెక్టర్ సహా ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో కమిషన్ అధ్యక్షుడు వెంకటేషన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చెత్తకుప్పల సేకరణలో పారిశుద్య కార్మికుల జీతాల వ్యవసాయంలో వ్యత్యాసం వుంది. ఈ వ్యత్యాసాలను మార్చి కార్పొరేషన్ పరిధిలో ఇచ్చే కూలీలకు సమానంగా గ్రామాల్లోని పారిశుద్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. కనీస వేతనం కింద రోజుకు రూ.495 కూలీలకు, పారిశుద్య కార్మికులకు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో పారిశుధ్య కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, జాతీయ స్థాయిలో పారిశుద్య కార్మికుల కోసం ప్రత్యేక ఫండ్‌తో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్, ఆవడి కమిషనర్ దర్పకరాజ్, అసిస్టెంట్ కలెక్టర్ ఆయుష్ వెంకటఉద్వాస్ పాల్గొన్నారు.

ఎగ్మూరులో అభివృద్ధి పనుల ప్రారంభం


అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

కొరుక్కుపేట: చెన్నై-ఎగ్మూర్ శాసనసభ నియోజకవర్గంలో మంత్రి ఉదయనిధిస్టాలిన్ పలు సంక్షేమ ప్రాజెక్టులను ప్రారంభించారు. మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బరసన్, ఎంపీ దయానిధి మారల్, ఎమ్మెల్యే పరంధామన్, చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ప్రియారాజన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ పాల్గొన్నారు. మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఎగ్మూర్ నియోజకవర్గంలో వివిధ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు.

ప్రపంచంలో గొప్ప భాష తెలుగు


రఘునాథ శర్మను సత్కరిస్తున్న జేకే రెడ్డి, మధు

కొరుక్కుపేట: ప్రపంచంలోనే గొప్ప భాష తెలుగు అని ప్రాచార్య శలాక రఘునాథ శర్మ వ్యాఖ్యానించారు. ఈ మేరకు వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 141వ ప్రసంగం ఆదివారం రాత్రి జరిగింది. దీనికి చెన్నై టీనగర్‌లోని ఆస్కా క్లబ్‌లోని కృష్ణాహాలు వేదికైంది. ఎఱ్ఱన సాహిత్య వైభవంపై ఏర్పాటైన ఉపన్యాస కార్యక్రమానికి వక్తగా ఆంధ్ర భాషా భూషామణి ప్రాచార్య శలాక రఘునాథ శర్మ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఎఱ్రన శైలి వైవిధ్యభరితమైనదని కొనియాడారు. వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు, వేదిక అధ్యక్షుడు జె.కె.రెడ్డి, రఘునాథ శర్మను నిర్వాహకులు సత్కరించారు.

27, 28 తేదీల్లో ఎగ్జిబిషన్

కొరుక్కుపేట: శ్రీప్రియాగణేశన్, రంభ సేథ్ నేతృత్వంలో ఈనెల 27, 28 తేదీల్లో నియాస్ ఆటిక్ పేరుతో మోడ్రనిజం ప్లస్, ఆర్ట్, డిజైన్ ఎగ్జిబిషన్‌ను నగరంలో నిర్వహించనున్నారు. దీనికి చెన్నై రాయపేటలోని ది ఫాలీ, అమెథిస్ట్‌లో జరుగుతుందని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు.

అలరించిన 'అఖండం'సంగీత విభావరి



ప్రారంభోత్సవంలో సంతాన గోపాలన్, కల్య రఘుకుమార్, సూరి శ్రీవిలాస్

కొరుక్కుపేట: త్యాగరాజస్వామి, పురందర దాసు, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్ అందించిన సంకీర్తనలతో సాగిన అఖండం సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఔత్సాహిక సంగీత చిన్నారులను ప్రోత్సహించేలా శర్వాణి సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అఖండం పేరుతో 12 గంటల పాటు సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం 18వ వార్షిక అఖండం సంగీత కచేరి నిర్వహించారు. స్థానిక మైలాపూర్‌లోని రాగసుధ హాలు వేదికైంది. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీవిలాస్, ట్రస్టీ రఘుకుమార్, సంగీత కళానిధి నైవేలి ఆర్.సంతాన గోపాలన్, ప్రత్యేక అతిథి భారతీయ సంగీత వైభవం ట్రస్ట్ వ్యవస్థాపకులు సురేష్‌కుమార్ బొప్పరాజు పాల్గొని అఖండంను ప్రారంభించారు. అతిథులను ట్రస్టీలు సత్కరించారు.

సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్ధం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న షణ్ముగం

వేలూరు: వేలూరు పార్లమెంట్ స్థానంలోని మొత్తం ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్దంగా ఉన్నామని పుదియనీది పార్టీ వ్యవస్థాపకులు ఏసీ షణ్ముగం అన్నారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు సత్‌వచ్చారిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న కేంద్రాలను ఆయన తనఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేలూరు పార్లమెంట్ స్థానంలో వివిధ ప్రాంతాల్లో ఒకే సారి మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో మొత్తం 340 మంది వైద్యులు పాల్గొన్నారన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రవికుమార్, జీబీకే బాలాజి, యూత్ లీగ్ రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్, జిల్లా కార్యదర్శి భరత్, అసెంబ్లీ కార్యదర్శి జయప్రకాష్, ఎంజీఆర్ యూనివర్సిటీ చైర్మన్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

90 శాతం హామీలు నెరవేర్చారు

కొరుక్కుపేట: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్ ఆదేశానుసారం వల్లలార్ 200వ వార్షికోత్సవం, ముగ్గుల వేడుకలు తండయార్‌పేట్‌లోని పిల్లయార్ కోయిల్ స్ట్రీట్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో హిందూ దేవదాయ శాఖ మంత్రి పి.కె. శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. చెన్నై ఉత్తర జిల్లా కార్యదర్శి, చెన్నై కార్పొరేషన్ 4వ జోనల్ కమిటీ చైర్మన్ నేతాజీ గణేశన్, హిందూ మత ధర్మాదాయ శాఖ జాయింట్ కమిషనర్ ముల్లా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ వల్లలార్ 200వ జయంతిని ఏడాది పొడవునా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు అన్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'తరైప్పడై'


తరైప్పడై చిత్రంలో సన్నివేశం

తమిళసినిమా: స్టోనెక్స్ పతాకంపై పీబీ వేల్ మురుగన్ నిర్మిస్తున్న చిత్రం తరైప్పడై.. నటుడు ప్రజన్, విజయ్ విశ్వ, లొల్లుసభ జీవా హీరోలుగా నటిస్తున్న ఇందులో షాలిని, మేఘనా సిద్ధి, ధన్య హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. కళింగ నావల్, బ్రహ్మపుత్ర చిత్రాల ఫేమ్ రామ్ ప్రభ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర వివరాలను ఆయన తెలుపుతూ తరైప్పడై చిత్రం కమర్షియల్ అంశాలతో కూడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందన్నారు. అన్ని వర్గాల వారు చూసి ఆనందించే విధంగా పలు ఆసక్తికరమైన అంశాలతో కూడిన చిత్రంగా ఇది ఉంటుందన్నారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై పరిసర ప్రాంతాల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఇందులోని పోరాట సన్నివేశాలను ఇటీవలే భారీఎత్తున చిత్రీకరించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని త్వరలో చిత్ర ఆడియో విడుదల తేదీని అధికారికంగా ప్రకటినున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి మనోజ్ కుమార్ బాబు, సురేష్ కుమార్ సుందరం ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

శ్వాస ఉన్నంతవరకు ప్రయత్నించండి


ఆడియో ఆవిష్కరణలో కపిల్ రిటన్స్ చిత్ర యూనిట్

తమిళసినిమా: ధనలక్ష్మి క్రియేషన్స్ పతాకంపై శ్రీనీ సుందరరాజన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించి కథానాయకుడిగా నటించిన చిత్రం కపిల్ రిటన్స్. నటి నిమిషా రియాజ్ ఖాన్, పరుత్తివీరన్ సరవణన్, వయాపురి మాస్టర్ భరత్, మాస్టర్ జాన్, బేబీ షర్మా ముఖ్యపాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు ముస్తాబవుతున్న ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక సాలిగ్రామం లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో ప్రముఖ రచయిత శుభ పాండియన్, దర్శకుడు ఆర్వీ. ఉదయ్ కుమార్, పేరరసు, గీత రచయిత స్నేహన్, నిర్మాత ఎస్. విజయ మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, నిర్మాత, నటుడు శ్రీనీ సుందర రాజన్ మాట్లాడుతూ ఇది 'మీ కలలు నెరవేరాలంటే శ్వాస ఉన్నంతవరకు ప్రయత్నించు' అనే ఇతివృత్తంతో రూపొందించిన కథా చిత్రం అని చెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాలను అలరించే విధంగా చిత్రంలోని కథా సన్నివేశాలు చోటు చేసుకుంటాయన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ ఇది విద్యార్థులకు తల్లిదండ్రులకు మధ్య అవగాహనతో కూడిన అనుబంధాన్ని ఆవిష్కరించే కథాచిత్రంగా దీన్ని తెరకెక్కించారన్నారు. ఇది తల్లిదండ్రులు పిల్లలు కలిసి చూడాల్సిన ఓ అద్భుతమైన చిత్రమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ చిత్ర దర్శకుడికి అభినందనలు తెలిపారు.

అభిమాని కాదు అపరిచితుడు



తమిళసినిమా: సెలబ్రిటీలకు ఒక్కోసారి చేదు అనుభవాలు ఎదురవుతుంటాయి.

ఒక్కోసారి అభిమానుల బెడద, ఇంకోసారి అపరిచితుల భయం ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నటి శృతిహాసన్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు ఆమె చాలా బోల్డ్ అండ్ బ్యూటీ అన్న విషయం తెలిసిందే. మాటల్లోనే కాదు చేతల్లోనూ శ్రుతిహాసన్ ఫెయిర్‌గా ఉంటారు . అలాంటి శ్రుతిహాసనే భయపడే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ప్రభాస్ సరసన పాన్ ఇండియా చిత్రం సలార్ చిత్రంలో నటిస్తున్న శ్రుతిహాసన్ ఇటీవల ముంబై విమానాశ్రయంలో ఒక చేదు అనుభవాన్ని చవి చూశారు. దీని గురించి ఆమె ట్విట్టర్లో పేర్కొంటూ.. నడుచుకుంటూ వస్తుండగా ఓ వ్యక్తి నా వెనకే రావడం గమనించాను. అయితే అతను తనను సమీపించడంతో తొలుత అభిమాని అయ్యి ఉంటాడని భావించానన్నారు. అయితే తాను కారు ఎక్కే వరకు వెనుక రావడంతో కొంత భయమేసింది. అయితే ధైర్యంగా ఎవరు నువ్వు అని అడిగాను అన్నారు. దీంతో అతను తడబడుతూ వెళ్లిపోయాడని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎవరినీ బాడీగార్డ్‌గా పెట్టుకోలేదన్నారు. స్వేచ్ఛగా జీవించాలని కోరుకుంటున్నానని.. అందుకే ఇప్పటివరకు ఎవరినీ బాడీగార్డ్‌గా నియమించుకోలేదన్నారు. ఈ సంఘటన తర్వాత బాడీగార్డ్‌ను ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన కలుగుతోందని శ్రుతి పేర్కొన్నారు.

దీపావళి రేస్ నుంచి తప్పకున్న శివకార్తికేయన్


అలియాన్ చిత్రంలో శివకార్తికేయన్, ప్రీతిసింగ్

తమిళసినిమా: నటుడు శివకార్తికేయన్ దీపావళి రేస్ నుంచి తప్పుకున్నారు. ఈయన్ని ప్రిన్స్ చిత్రం దెబ్బ నుంచి మావీరన్ చిత్రం గట్టెక్కించింది. తాజాగా కమలహాసన్ నిర్మిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. దీనికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి పల్లవి నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. అయితే దీని ముందు శివకార్తికేయన్ కథానాయకుడుగా నటించిన అయిలాన్ చిత్రం విడుదల మాత్రం వాయిదా పడుతూ వస్తోంది. రకుల్‌ప్రీతిసింగ్ కథానాయకిగా నటించిన ఈ చిత్రంలో నటుడు యోగిబాబు, కరుణాకరన్ ముఖ్యపాత్రలు పోషించారు. రవికుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. 24 ఏఎం స్టూడియోస్, కేజేఆర్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ముస్తాబు అవుతోంది. అయితే ఇప్పటికే గ్రాఫిక్స్ సన్నివేశాలు కారణంగా చిత్రం ముందుగా ప్రకటించిన ప్రకారం విడుదల కాలేదు. అయితే అయిలాన్ చిత్రాన్ని దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇటీవల ప్రకటించారు. తాజాగా మరోసారి విచిత్ర విడుదల వాయిదా పడింది. 2024 సంక్రాంతికి విడుదలైనట్లు నిర్మాతలు ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. కారణాలు ఏమైనా ఈ ప్రకటన శివకార్తికేయన్ అభిమానులను నిరాశ పరిచిందనే చెప్పాలి.

ఘనంగా తీ ఇవన్ ఆడియో వేడుక


ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: నవరస నాయకుడు కార్తీక్ కథానాయకుడిగా నటించిన చిత్రం తీ ఇవన్. నటి సన్నీ లియోన్, కార్తీక్ దీపం సేమ్ అత్తిక, సుకన్య, మస్కార అస్మిత ,యువ రాణి, రాధా రవి, ఇళవరసు, జాన్ విజయ్, సింగం పులి, శరవణ శక్తి తదితరులు విక్కీ పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని మనిదన్ సినీ ఆర్ట్స్ పతాకంపై నిర్మలా దేవి జయమురుగన్ నిర్మిస్తున్న చిత్రం ఇది. టీఎం.జయమురుగన్ కథ, కథనం , సంగీతం, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్న ఈ చిత్రానికి నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న త్వరలో తెరపైకి రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శనివారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ పరాశక్తి, మామన్నన్, విడుదలై వంటి చిత్రాల తరహాలో సామాజిక సహ కలిగిన కథా చిత్రం ఇదన్నారు. ఇందులో నవరస నాయకుడు కార్తీక్ ఇందులో నవరసాలు పండించారని చెప్పారు. ఆయనకు సాటి ఆయనే అన్నారు. సంస్కృతి సంప్రదాయాల గురించి చెప్పాలంటే మగాడు చెడితే జీవితం పోతుందని, ఆడది చెడితే వంశమే నాశనం అవుతుందని చెప్పే చిత్రం ఇదని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ తిరుపూర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ తాను ఈ చిత్రాన్ని చూశానని, ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని పేర్కొన్నారు. కార్తీక్, సుకన్య కలిసి నటించాలని, కార్తీక్ అద్భుతంగా నటించారని చెప్పారు. తీ ఇవన్ చిత్రాన్ని త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు.

క్లుప్తంగా

ఎస్‌ఐ ఆత్మహత్యాయత్నం

తిరువొత్తియూరు: తెన్‌కాశి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. నెల్లై జిల్లా పాండియాపురం గ్రామానికి చెందిన పశుపతి (53). ఇతను ఊత్తుమలై పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐ. ఇతని భార్య మణిమేగలై (48). వీరికి విఘ్నేష్ (29), వినిత్ (27) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పశుపతి ప్రస్తుతం తన కుటుంబం సహా కీల్ సురండైలో నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న పశుపతి పురుగుల మందు తాగి స్పృహ తప్పాడు. బయటకు వెళ్లిన భార్య మణిమేగలై ఇంటికి వచ్చిన సమయంలో భర్త స్పృహ తప్పి పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందింది. వెంటనే భర్తను తెన్‌కాసి ప్రభుత్వాస్పత్రికి తరలించింది. ఆత్మహత్యకు కారాణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

తిరువొత్తియూరు: తల్లితో వివాహేతర సంబంధం కలిగి ఉన్న రైతును ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వేలూరు జిల్లా గుడియాత్తం సమీపము ఏర్తాంగల్ గ్రామానికి చెందిన భరత్ (56) రైతు. ఇతను అదే ప్రాంతంలోని ఓ వివాహిత(48)తో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న ఆ మహిళ కుమారుడు నవీన్ కుమార్ (26) భరత్ తీరును ఖండించాడు. కానీ భరత్ తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో నవీన్‌కుమార్, భరత్‌పై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేశాడు. చేసి గుడియాత్తం తాలూకా పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించండి

- మదురై హైకోర్టు ఆదేశం

తిరువొత్తియూరు: తిరువణ్ణామలైలో ప్రకటన బోర్డు పడి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుటుంబానికి రూ. 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని మదురై హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నెల్లై సుత్తమల్లికి చెందిన స్వామీజి మదురై హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. అందులో తన కుమారుడు అంగప్పన్ అలియాస్ విగ్నేష్ ఇంజినీరింగ్ మే14, 2014 రోజున గిరివలయంలో ప్రకటన బోర్డు విగ్నేష్‌పై పడి మృతిచెందాడు. ప్రభుత్వం రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జీయర్ స్వామినాథన్ బాధిత కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారాన్ని నాలుగు వారాల్లోపు తిరువణ్ణామలై జిల్లా నిర్వాహక సంస్థ తరపున అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు.

'వందేభారత్'కు ఘనస్వాగతం



గూడూరురూరల్ : విజయవాడ–చైన్నై మధ్య నూతనంగా ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం సాయంత్రం గూడూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ఘనస్వాగతం పలికారు. రైలులోకి వెళ్లి వసతులను పరిశీలించి ప్రయాణికులతో ముచ్చటించారు. అనంతరం వందేభారత్ రైలుకు జెండా ఊపి చెన్నైకు సాగనంపారు. స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఆరేటి వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్ సీఐ లక్ష్మణరావు, డీఆర్‌యూసీసీ మెంబర్ శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని భక్తుడికి తీవ్రగాయాలు

గుడిపాల: మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారి పల్లూరు ఆశ్రమం వద్ద బస్సు ఢీకొన్న ప్రమాదంలో గోవింద భక్తుడు ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్‌ఐ చలపతి కథనం మేరకు వివరాలు ఇలా.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కన్నియంబాడి తాలూకా పెరియపాలం బాక్కం గ్రామానికి చెందిన రాజేష్(20) గ్రామస్తులు 45మందితో కలిసి తిరుమల పాదయాత్రకు బయలుదేరాడు. ఆదివారం వేకువజామున 5గంటల ప్రాంతంలో మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారి పల్లూరు ఆశ్రమం వద్ద రాజేష్ నడుచుకుంటూ వెళుతుండగా తమిళనాడు ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

3 టన్నుల కూరగాయల వితరణ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం హోసూరుకు చెందిన మిత్ర బృందం 3 టన్నుల కూరగాయలను వితరణగా అందించింది. ఆదివారం ఉదయం హోసూరుకు చెందిన గోపాల్ రెడ్డి, మిత్ర బృందం సేకరించిన 3టన్నుల కూరగాయలను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు సమక్షంలో అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

బ్రహ్మాండోత్సవం

తిరుగిరుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం శోభాయమానంగా సాగుతోంది. సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన ఏడుకొండలస్వామిని దర్శించి భక్తకోటి పరవశించింది. బాల భాస్కరుని లేలేత కాంతుల్లో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న దేవదేవుని సన్నిధిలో ప్రణమిల్లింది. ఉభయ దేవేరీ సమేతంగా సుగంధ పరిమళభరిత విశేష అభిషేకంలో సేదతీరిన మలయప్పను వీక్షించి పులకించింది. చల్లటి పిల్లగాలుల నడుమ చంద్రప్రభ వెలుగుల్లో దివ్యతేజస్సుతో అలరారుతున్న వైకుంఠనాథుని సేవించి తరించింది. శ్వేత వర్ణ కలువల అలంకరణలో కటాక్షించిన శ్రీమహావిష్ణువుకు దాసోహమంటూ నమస్సులర్పించింది.

- సూర్యప్రభ..చంద్రప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు
- తిరుమంజనంలో సేదతీరిన దేవదేవేరులు
- నేడు రథోత్సవం.. అశ్వవాహన సేవ
- రేపటి చక్రస్నానంతో ఉత్సవాలు పరిపూర్ణం

తిరుమల : తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. శ్రీవారికి ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహన సేవను వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో మూడో స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామివారు ఊయలూగుతూ దర్శనమిచ్చారు. రాత్రి అశేష భక్త జనసందోహం నడుమ చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీవారి ఎదుట కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శనశాలలోని పుష్ప, విద్యుత్ అలంకరణలు భక్తులను కటిపడేస్తున్నాయి. ఇక నాదనీరాజనం, ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న భక్తి, సంగీత కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న దేవదేవుడు





వాహన సేవలో కళా బృందాల ప్రదర్శన

నేడు రథోత్సవం.. అశ్వవాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం ఉదయం 6.55 గంటలకు శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. టీటీడీ ఇంజినీర్లు రథచక్రాలను పరీక్షించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో విహరించనున్నారు.

రేపటి చక్రస్నానానికి పుష్కరిణిలో ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు మంగళవారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఇందుకోసం పుష్కరిణిలో టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే కొత్త నీటిని నింపి, వంద శాతం క్లోరినేషన్ పూర్తి చేసింది. ప్రత్యేకంగా ఇనుప చైన్‌లింక్ కంచెలు ఏర్పాటు చేయించింది. వరాహస్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో సుదర్శన చక్రత్తాళ్వారుకు పుణ్యస్నానం నిర్వహించే ప్రాంతంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. భక్తులను ఉదయం 4 గంటల నుంచే పుష్కరిణిలోకి అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది.







సూర్యప్రభ వాహన సేవలో కళా బృందాల ప్రదర్శనలు

35 ఏళ్ల నాటి కల సాకారమైంది

- ఏర్కాడు కొండ గ్రామానికి బస్సు
- ఆనందోత్సాహంలో గ్రామస్తులు

సేలం: సేలం–మారమంగళం కొండ గ్రామం ఏర్కాడు వాసుల 35 ఏళ్ల కలను నెరవేర్చేందుకు రోడ్డులేని కొండ గ్రామానికి తారురోడ్డు నిర్మించి బస్సు సౌకర్యాన్ని ఆదివారం ప్రారంభించారు. కొండ గ్రామస్థులు తప్పెట్లతో నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ప్రభుత్వ బస్సుకు స్వాగతం పలికారు. సేలం జిల్లా మారమంగళం కొండ గ్రామస్తుల 35 ఏళ్ల కలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రోడ్డులేని కొండ గ్రామానికి తారురోడ్డు నిర్మించడంతో కొండ గ్రామానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ బస్సులో కొండ ప్రాంతవాసులతో కలిసి ప్రయాణిస్తూ జిల్లా గవర్నర్ ఎస్.కార్మేగం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కొండ ప్రాంత వాసులకు మౌలిక వసతులైన రోడ్డు, తాగునీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. రూ.7.01 కోట్ల వ్యయంతో కొత్త లింక్ రోడ్డును నిర్మించారు. మారమంగళం గ్రామపంచాయతీ పరిధిలోని నార్తఖేడు, కోటంచేడు, చెందిట్టు, ఆరంగం, బెలకాడు సహా 18 గ్రామాలకు లబ్ధి చేకూరేలా రోడ్డు పనులు పూర్తి చేసి తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ ద్వారా టెస్ట్ డ్రైవ్ నిర్వహించి నేటి నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. ఈ కొండ గ్రామస్తుల 35 ఏళ్ల కల నెరవేరింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



బస్సు రావడంతో ఆనందోత్సాహంలో గ్రామస్తులు, కలెక్టర్ కార్మేగం

భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఇంజినీర్

అన్నానగర్: సేలం జిల్లా కడైయాంబట్టి సమీపంలోని జోడుకులి ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు మేకలు మేపేందుకు శనివారం అడవికి వెళ్లారు. ఆ సమయంలో 20 ఏళ్ల యువతి కాలిపోయిన మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలు జలకండపురానికి చెందిన కోకిల వాణి(20)గా తేలింది. ఈమె ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో దివట్టిపట్టి పోలీసు స్టేషన్‌లో బెంగళూరుకి చెందిన ఐ.టీ. కంపెనీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ మురళీకృష్ణ (24) ఆదివారం లొంగిపోయాడు. పోలీసుల విచారణలో కోకిల, మురళీకృష్ణ ఇద్దరూ ప్రేమించుకున్నట్లు తేలింది. రెండు సంవత్సరాల క్రితం ఇంట్లో ఎవరికీ తెలియకుండా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. కోకిలను చూసేందుకు మురళీకృష్ణ అప్పుడప్పుడూ బెంగళూరు నుంచి బైకులో సేలం వచ్చేవాడు. ఇదే క్రమంలో శనివారం కూడా సేలం జిల్లా జోడుకులికి వచ్చాడు. అయితే కోకిల తనను చూసేందుకు ఇకపై రావద్దని సూచించడంతో తీవ్ర ఆగ్రహం చెంది పెట్రోల్ పోసి తగలబెట్టాడు. తర్వాత బెంగళూరు వెళ్లిపోయాడు. జరిగిన సంఘటనను మురళీకృష్ణ తన తల్లికి వివరించాడు. అది విని షాక్ అయిన తల్లి వెంటనే మురళీకృష్ణను తీసుకొచ్చి పోలీసులకు లొంగిపోయినట్లు వెల్లడించారు. దీంతో మురళీకృష్ణను అరెస్టు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగునీటిని వదిలే వారిపై చర్యలు

తిరువొత్తియూరు: వర్షపు నీటి కాలువలోకి మురుగునీటిని వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కారోపరేషన్ చైర్మన్ అన్నారు. చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ తిరువొత్తియూర్ జోనల్ కమిటీ సమావేశం జోనల్ కమిటీ అధ్యక్షుడు డీఎం తనిఅరసు అధ్యక్షతన జరిగింది. జోనల్ అసిస్టెంట్ కమిషనర్ నవేంద్రన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో 40 తీర్మానాలను ఆమోదించారు. కమిటీలో సభ్యుల ప్రశ్నలకు మండల కమిటీ చైర్మన్ తనియరసు సమాధానమిస్తూ తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కౌన్సిలర్లు వినతిపత్రం అందజేస్తే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నార్త్ చెన్నై డెవలప్‌మెంట్ ప్లాన్ కింద తీరప్రాంతంలో 3వేల వీధిలైట్లు ఏర్పాటు చేయడంతోపాటు జోన్ పరిధిలోని ప్రాంతాల్లో వర్షపు నీటి కాలువలోకి అక్రమంగా మురుగునీటి వదిలే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షపు నీటి కాలువలోకి వ్యర్థ జలాలను విడుదల చేసే వారికి రూ.10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పోలీసుల సాయంతో ప్రియుడిని పెళ్లి చేసుకున్న యువతి

అన్నానగర్: కడలూరు జిల్లా విరుదాచలం సమీపంలోని భువనూరు ప్రాంతానికి చెందిన నితీష్ కుమార్ గ్రాడ్యుయేట్. ఎం.పరూర్ గ్రామానికి చెందిన నాగలక్ష్మి (21)ని గత ఆరేళ్లుగా ప్రేమిస్తున్నాడు. నాగలక్ష్మి మంగళం పేట ప్రాంతంలోని ఓ దుకాణంలో పనిచేస్తోంది. ఈ దుకాణానికి నితీష్ కుమార్ తరచూ వస్తుంటారు. దీంతో ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ప్రస్తుతం నాగలక్ష్మి గర్భం దాల్చింది. ఈమేరకు తనను పెళ్లి చేసుకోవాలని సతీష్ ఇంటికెళ్లి కోరింది. అయితే అతడు నిరాకరిచడంతో విరుదాచలం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తర్వాత నితీష్‌కుమార్ నాగలక్ష్మితో పెళ్లికి అంగీకరించాడు. ఆదివారం ఇరు కుటుంబాల సమక్షంలో విరుదాచలం ముత్తుమారియమ్మన్ ఆలయంలో వారి వివాహం చేశారు.

కిందపడి కార్మికుడి మృతి

తిరువళ్లూరు: విధులు నిర్వహిస్తూ స్పృహతప్పి కింద పడ్డ కార్మికుడు మృతిచెందిన సంఘటన తిరువళ్లూరు సమీపంలో విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు కావేరినగర్‌కు చెందిన జయరామన్ కుమారుడు చక్రపాణి(47). ఇతను తిరువళ్లూరు జిల్లా ఎగువనల్లాటూరు గ్రామంలోని కేటర్ పిల్లర్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఈ నేపథ్యంలో యథావిధిగా పనిచేస్తుండగా స్పృహతప్పి కిందపడ్డాడు. వెంటనే సహచర కార్మికులు స్థానికంగా వున్న వైద్యశాలకు తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చక్రపాణిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు రామచంద్రన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరువళ్లూరు తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడి మృతి

తిరువళ్లూరు: మద్యం తాగొద్దని పిల్లలు మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా మురుగుచ్చేరి గ్రామానికి చెందిన ఆదియాన్(85). ఇతను తరచూ మద్యం తాగి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయంపై 20వ తేదీన ఇంట్లో గొడవ చోటుచేసుకుంది. మనస్తాపం చెందిన వృద్ధుడు పెయింట్ తిన్నర్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే బంధువులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మనవాలనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 74,884 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 2.70 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

గజవాహనంపై గణనాథుని విహారం

స్వయంభు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి గజ వాహనంపై గణనాథుడు పురవీధుల్లో విహరించారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణల అనంతరం గ్రామోత్సవం వేడుకగా జరిగింది. ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.



అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు



ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు



బిందెపై భరత నాట్యం చేస్తున్న కళాకారిణి



త్రిశూలంతో నాట్యం చేస్తున్న కళాకారిణి

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీకాణిపాకం వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఆదివారం వేకువజామున ఆలయంలో స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు చేసి, ప్రత్యేక అలంకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. క్యూలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చంటి పిల్లలకు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు భక్తుల సౌకర్యాలపై పలుమార్లు పర్యవేక్షించారు. ఉదయం 10 గంటల సమయంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉభయదారులు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకు వచ్చి గజ వాహనంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ముందు సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతుండగా, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశులయ్యారు.

క్లుప్తంగా...

రాజకీయాల్లో సోషల్ మీడియాది కీలకపాత్ర

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ



సాక్షి, విశాఖపట్నం: ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియాది కీలకపాత్ర అని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ, మైనార్టీ శాఖల మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. బీజేపీపై ప్రత్యర్థి పార్టీల ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆ పార్టీ సోషల్ మీడియా వలంటీర్లను కోరారు. ఆదివారం విశాఖ పోర్టు సాగరమాల ఆడిటోరియంలో శంఖనాద్ పేరిట రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా వలంటీర్ల మీట్–2023లో ఆమె పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఏపీ అభివృద్ధికి ఎంతో సహకరిస్తోందని చెప్పారు. వీటితో పాటు ప్రధాని మోదీ తన పాలనలో సాధించిన విజయాలను కూడా మాధ్యమాల ద్వారా అన్ని వర్గాలకు తెలియజేయాలని, తద్వారా రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అధికారం చేపట్టిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదా

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



అమలాపురం రూరల్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తుందని ఏపీపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన వల్ల ఏపీకి జరిగిన అన్యాయంపై తాను ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో ప్రస్తావించానని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రానికి న్యాయం చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హామీ ఇచ్చారని చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 70 స్థానాలు సాధిస్తుందని చెప్పారు. ఏపీలో సీఎం జగన్ బెయిల్‌పై తిరుగుతుంటే..మాజీ సీఎం చంద్రబాబు జైల్లో ఉండి బెయిల్ కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారన్నారు. డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రుద్రరాజు మాట్లాడుతూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

టీడీపీ నాయకుల అరాచకం

కర్నూలు జిల్లా అలసందిగుత్తిలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి

- 20 మందికి గాయాలు..
- ఆస్పత్రిలోనూ మరోసారి దాడికి యత్నం..



గాయం చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ఉచ్చీరప్ప

ఆదోని (అర్బన్): కర్నూలు జిల్లా ఆదోని మండలం అలసందిగుత్తి గ్రామంలో టీడీపీ నాయకులు అరాచకానికి తెగబడ్డారు. 20 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై సుమారు 70 మంది టీడీపీ నాయకులు ప్రణాళికాబద్ధంగా వేట కొడవళ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు ఆదోని పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అలసందగుత్తిలో చిగిళి తాయప్ప అనే వ్యక్తి ఇల్లు టీడీపీ నాయకుల ఇళ్ల మధ్యలో ఉంది. జంబయ్య సోమలింగ, లక్ష్మన్న, శంకరప్పతోపాటు మరికొంతమంది టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా చిగిళి తాయప్ప ఇంటి ముందు ఎద్దుల బండి ఆపి దానిపై కూర్చుని వారి ఇంట్లో ఉన్న మహిళలను దుర్భాషలాడారు. ఇలా చేయడం తప్పని, బండి వేరేచోట ఆపి అక్కడే కూర్చోవాలని చెప్పడంతో చిగిళి తాయప్పపై ఆదివారం ఉదయం దాడి చేశారు. బాధితుడి తరఫున మాట్లాడేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు రాజీ కోసం వస్తున్నారని తెలుసుకుని పథకం ఇంటి మిద్దెలపై రాళ్లు, సీసాలు, కర్రలు, వేట కొడవళ్లతో 70 మంది టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. ఆదివారం రాత్రి మాట్లాడేందుకు వచ్చిన 20మంది వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేతలు దాడి చేశారు. ఉచ్చీరప్పకు తీవ్ర గాయాలు అయ్యాయని, వెంకటేశ్, భీరప్ప, భరత్‌తో పాటు మరో 17 మందికి గాయాలయ్యాలని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని వెంటనే బంధువులు వాహనాల్లో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న టీడీపీ నాయకులు క్షతగాత్రులపై మరోసారి దాడికి యత్నించారు. అక్కడే స్పెషల్ బ్రాంచ్ సీఐ రామాంజులు ఉండటంతో టీడీపీ నాయకులను చెదరగొట్టారు. దాడి చేసిన వారిలో జంబయ్య సోమలింగ, లక్ష్మన్న, శంకరప్ప, శీను, వెంకటేశ్, సోము, పాలబుడ్డితోపాటు మహిళలు, నాయకులు 60 మంది ఉన్నట్టు బాధితులు తెలిపారు. కేసులు పెడితే దాడి చేస్తామని టీడీపీ నాయకులు బెదిరించినట్టు వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు.

మా కులానికి బాబు కరోనాలా మారాడు

- ఆయనకు మద్దతుగా ఆందోళనలు చేస్తోంది మా కులస్తులే
- దీంతో సమాజంలో మా వర్గం ఒంటరిదైపోతోంది
- 'సాక్షి'తో టీడీపీ మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి : చంద్రబాబు స్వశక్తి హీనుడని, పరాన్నజీవి రకమని.. సొంత బలంతో ఎప్పుడూ ముందడుగు వేయలేదని, ఇకపైనా వేయలేడని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత అడుసుమిల్లి జయప్రకాశ్ వ్యాఖ్యానించారు. కుట్రలు, కుతంత్రాలు, అవినీతే ప్రధాన బలాలని.. వ్యవస్థల విధ్వంసం, మాయోపాయాలే ఆయన ఆయుధాలన్నారు. ఎన్టీఆర్, వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డిలా ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఒక్క మంచి పథకాన్ని అమలుచేయలేకపోయాడని 'సాక్షి'తో అన్నారు. తమ కులానికి కరోనాలా మారాడని తమ పెద్దలు మథనపడుతున్నారని అడుసుమిల్లి ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

బాబు పాపం పండింది

వైఎస్సార్‌ను మించి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. కరోనా సమయంలో జగన్ ప్రభుత్వ సేవలు, పరిపాలనా విధానాలు యావత్ దేశంతో పాటు నోబెల్ బహుమతి గ్రహీతల నుంచి ప్రశంసలు దక్కాయి. కానీ.. అమరావతి రాజధాని పేరిట ఐదేళ్లలో చంద్రబాబు చేసిందేముంది? అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన బాబు పాపం పండి రాజమండ్రి జైలులో ఊచలు లెక్కిస్తున్నాడు. ఒంటరిగా పోటీ చేయలేని స్థాయికి టీడీపీని దిగజార్చాడు. ఇక మా కులానికి కరోనా వైరస్‌లా దాపురించిన అతని నుంచి ఎలా కాపాడుకోవాలనే ఆలోచనల్లో మా పెద్దలున్నారు. బాబు జైలుకు వెళ్లింది కేవలం ఆయన చేసిన అవినీతి, అక్రమాలవల్లే. దానికోసం సామాజికవర్గం మొత్తం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాలా? వీటివల్ల గ్రామాల్లో మా వర్గం ఒంటరిదవుతోంది. బాబు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలేగానీ కృత్రిమ ఉద్యమాలు చేయించకూడదు.

మాకు సీఎం కావాలన్న ఆలోచనలేదు

- చంద్రబాబుకు మద్దతుగా మాత్రమే ఉన్నాం
- కాపు నేతలు టీడీపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నారు
- ఇలా వ్యతిరేకించే వారిని మేం పరిగణనలోకి తీసుకోం
- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



సాక్షి, తిరుపతి : తమకు సీఎం కావాలన్న ఆలోచన లేదని.. టీడీపీకి, చంద్రబాబుకు తాము మద్దతుగా మాత్రమే ఉన్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు చెప్పారు. టీడీపీతో పొత్తుపట్ల 95 శాతం పార్టీ శ్రేణులు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. వ్యతిరేకంగా ఉన్న వారిని పరిగణనలోకి తీసుకోవడంలేదని ఆయన స్పష్టంచేశారు. తిరుపతి సమీపంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీకి మద్దతుగా కలిసి పోరాడాలని నిర్ణయించామని ప్రకటించారు. అయితే, కాపు నేతలు టీడీపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎవరు సీఎం అనేది కాలమే నిర్ణయిస్తుందని నాగబాబు చెప్పారు. ఇక పొత్తుపై బీజేపీ నుంచి కూడా త్వరలోనే నిర్ణయం వస్తుందని నాగబాబు ఒక ప్రశ్నకు బదులిచ్చారు. ప్యాకేజీ అంటే చెప్పు తీసుకుని కొడతామని వ్యాఖ్యానించారు. త్వరలోనే రాయలసీమలో పవన్ వారాహి యాత్ర ఉంటుందన్నారు.

మేం అలా అనలేదు..

జనసైనికులు ఎప్పుడూ ఎవరిదో ఒకరి జెండాను మోయాల్సిందేనా? అని మీడియా అడిగిన ప్రశ్నకు.. మీరు సాక్షి వారా? ఈరోజు సాక్షిలో వచ్చిన వార్త గురించి చర్చించుకున్నాం. మేం అలా అనలేదు.. అని అంటూ.. సాక్షికి సమాధానం చెప్పడం కూడా వృథా అని వ్యాఖ్యానించారు. కేసులకు భయపడబోమని, వాటిని ఎదుర్కొంటామని.. తమకూ మంచి లీగల్ టీం ఉందన్నారు.

టీడీపీతో పొత్తుకు ఒప్పుకోం..

అంతకుముందు జరిగిన కార్యకర్తల సమావేశంలో.. టీడీపీతో పొత్తుకు ఒప్పుకునేది లేదని, వారితో కలిసి వెళ్లే ప్రసక్తేలేదని జనసేన శ్రేణులు నాగబాబు సమక్షంలో తేల్చిచెప్పారు. లేదంటే పవన్‌ని సీఎం అభ్యర్థిగా టీడీపీ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. జనసేన శ్రేణులను టీడీపీ వాడుకుని వదిలేసే రకమని సభలో కొందరు బిగ్గరగా అరిచినట్లు తెలిసింది. అయితే, సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు దీనిపై స్పందించకుండా మౌనం వహించినట్లు సమాచారం. దీంతో చేసేదిలేక మరోసారి క్షేత్రస్థాయిలో చర్చిద్దామని, సంయమనం పాటించాలని ప్రాథేయపడినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా విభాగం సమావేశంలో ప్రభుత్వ సలహాదారు అలీ



వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అలీ తదితరులు

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో ఎన్నికలకు ముందు చెప్పిన మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ ప్రభుత్వ సలహాదారు (ఎలక్ట్రానిక్ మీడియా) అలీ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బ్రిస్బేన్‌లో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అలీ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయమని ధీమా వ్యక్తంచేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకునేందుకు ఎన్‌ఆర్‌ఐలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తండ్రి వైఎస్సార్ చూపిన బాటలో సీఎం జగన్ నడుస్తూ ప్రజా సంక్షేమంలో నాలుగు అడుగులు ముందుకేస్తూ కొత్త ఒరవడిని సృష్టించారని ప్రశంసించారు. ప్రజలే తన బలమని విశ్వసించి వారితోనే పయనం సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, ఇరువూరి బ్రహ్మారెడ్డి, జస్వంత్‌రెడ్డి బొమ్మిరెడ్డి , కోట శ్రీనివాస్‌రెడ్డి, రఘు రెడ్డి బిజివేముల, గజ్జల చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రూ.65 లక్షలు సొంతానికి వాడుకున్నా

- రంపచోడవరం పంచాయతీలో నిధుల దుర్వినియోగం
- బదిలీపై వెళ్తూ రికార్డుల్లో లేఖ పెట్టిన కార్యదర్శి
- దర్యాప్తు చేస్తున్న అధికారులు

రంపచోడవరం(అల్లూరి సీతారామరాజు జిల్లా): రంపచోడవరం మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై దర్యాప్తును అధికారులు వేగవంతం చేశారు. రూ.65 లక్షలను పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణమూర్తి సొంతానికి వాడుకున్నారు. బదిలీపై వెళ్తూ ఆయనే స్వయంగా ఈ విషయాన్ని తెలియజేస్తూ లేఖ రాసి పంచాయతీ రికార్డుల్లో పెట్టారు. ఈ నేపథ్యంలో డీఎల్పీవో రాఘవన్ రికార్డులను పరిశీలిస్తుండగా నిధుల దుర్వినియోగం బయటపడింది. వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్, డీపీవోకు తెలిపారు. వారి ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. రికార్డున్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సత్యనారాయణ మూర్తి ప్రస్తుతం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలో పనిచేస్తున్నారు. దీనిపై డీఎల్పీవో రాఘవన్‌ను వివరణ కోరగా.. దర్యాప్తు పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

తెలంగాణ

డిసెంబర్ 7న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు !

- తాత్కాలిక షెడ్యూల్ రూపొందించిన సీఈవో కార్యాలయం
- ఇవే తేదీలతో వాస్తవ షెడ్యూల్ ఉండే అవకాశం

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్ 7న జరుగుతాయి. దీనికి సంబంధించి నవంబర్ 12న ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత నవంబర్ 22న తుది అభ్యర్థుల జాబితా(ఫారం–7ఏ) ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఓట్లు లెక్కించి ఫలితాల ప్రకటిస్తారు' తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల కసరత్తులో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం రూపొందించుకున్న ఓ తాత్కాలిక ఎన్నికల షెడ్యూల్ మాత్రమే ఇది. దీనిని అనుసరించే ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ కార్యక్రమాలకు గడువు కూడా నిర్దేశించారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీని ముద్రించి కార్యాలయ ప్రాంగణంలో ప్రదర్శనకు ఉంచారు. రాష్ట్ర శాసనసభకు 2018లో జరిగిన సాధారణ ఎన్నికల షెడ్యూల్ సైతం ఇదే కావడం గమనార్హం. అయితే కొన్నిరోజులు అటుఇటుగా ఇదే షెడ్యూల్‌తో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. వాస్తవానికి తెలంగాణతోసహా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరం రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నిర్వహణకు అక్టోబర్ తొలివారం లేదా ఆ తర్వాత ఎప్పుడైనా కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సంసిద్ధతను పరిశీలించడానికి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన కేంద్ర ఎన్నికలసంఘం ఫుల్ బెంచ్ అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రంలో పర్యటిస్తుంది. ఆ తర్వాత వాస్తవ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారు.

రైతుల చూపు.. పండ్లతోటల వైపు

- అన్నమయ్య జిల్లాలో 5266 ఎకరాల్లో సాగు
- 2735 మందికి ఉపాధి ద్వారా లబ్ధి
- రైతులకు వందశాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం


పీలేరు రూరల్ : సన్న, చిన్నకారు రైతులకు ఆదాయ మార్గాలను సమకూర్చడం... జీవనోపాధులకు భద్రత కల్పించడం.. ఉత్పాదక ఆస్తులను పెంపొందించడం.. కరువుపీడిత ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, శాశ్వత ప్రాతిపదిక భూ అభివృద్ధి, భూసార రక్షణ లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన పండ్ల తోటల పెంపకం అన్నమయ్య జిల్లాలో లక్ష్యాన్ని అధిగమించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2735 మంది రైతులకు లబ్ధి కలిగింది. జిల్లాలో 5050 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం కాగా 5266 ఎకరాల్లో సాగు చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు డ్వామా పీడీ ఎంసీ మద్దిలేటి తెలిపారు. లబ్ధిదారులు ఇప్పటికే 85 శాతం మొక్కలు నాటడం పూర్తయిందని, వర్షాలు కురిస్తే వందశాతం పూర్తి చేస్తామని చెప్పారు.

ప్రభుత్వం ద్వారా సహకారం...

ఎంపిక చేసిన రైతులకు పండ్లతోటల పెంపకం, 3 సంవత్సరాల వరకు వంద శాతం నిర్వహణ వ్యయం ప్రభుత్వం చెల్లిస్తుంది. భూమి దున్నేందుకు, గుంతలు తీసేందుకు, ముళ్ల కంచెల ఏర్పాటుకు, సేంద్రియ, రసాయన ఎరువులు, సస్యరక్షణ మందులకు, పాదుల్లో కలుపు తీసేందుకు, అంతర్‌పంటలకు, 30 శాతం డ్రిప్ పరికరాల ఏర్పాటుకు, మామిడి తోటల పెంపకానికి ఏడాదికి 20 పర్యాయములు నీరు పోయుటకు బిల్లులు మంజూరు అవుతాయి.

పండ్ల తోటల పెంపకానికి ఎకరాకు నిర్వహణ ఖర్చు...

మామిడికి రూ. 10,31,193, చీని రూ. 1,07,459, నిమ్మ రూ. 1,41,515, జామ రూ. 1,27,451, తైవాన్ జామ, రూ. 2,26,783, సపోట రూ. 90,027, కొబ్బరి రూ. 90,610, సీతాఫలం రూ. 59,217, సీతాఫలం (బ్లాక్) రూ. 1,82,840, దానిమ్మ రూ. 2,44,819, నేరేడు రూ. 41,292, చింత రూ. 66,500, ఆపిల్‌రేగు రూ. 1,08,338, 5 లేయర్స్ బహళ పంట రూ. 1,64,863, డ్రాగన్ ఫ్రూట్ రూ. 1,84,533, గులాబీ పూల తోట రూ. 10,795, మల్లెపూల తోట రూ. రూ. 10,295 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది.



ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

నియోజకవర్గాల వారీగా పండ్ల తోటల పెంపకం...

నియోజకవర్గం	ఎకరాలు
పీలేరు	1357
మదనపల్లె	400
తంబళ్లపల్లె	1100
రాయచోటి	1059
రాజంపేట	500
రైల్వేకోడూరు	850

85 శాతం మొక్కలు నాటడం పూర్తి...



ఈ ఆర్థిక సంవత్సర పండ్ల తోటల పెంపకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 85 శాతం మొక్కలు నాటడం పూర్తి చేశాం. వర్షాభావ పరిస్థితులతో ఇంకా కొన్ని ప్రాంతాల్లో పూర్తి కాలేదు. వర్షాలు కురిస్తే వందశాతం పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం. లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించడం జరుగుతోంది.

– ఎం.సి. మద్దిలేటి, డ్వామా పీడీ.

ఉపాధి హామీతో ఎంతో ప్రయోజనం...



ఉపాధి హామీ పథకంతో ఎంతో ప్రయోజనం పొందాం. ఆర్థిక స్థోమత లేక నాకున్న పొలం మొత్తం ఖాళీగా పెట్టుకున్నాం. అయితే ఉపాధి హామీ పథకంతో నా రెండు ఎకరాల్లో 150 మామిడి మొక్కలు నాటా. అందుకు సంబంధించి బిల్లులు మొత్తం నా ఖాతాకు జమ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– బి.డి. సిద్దారెడ్డి, రైతు రామిరెడ్డిగారిపల్లె, పీలేరు మండలం.

వందశాతం రాయితీ లభిస్తోంది...



ఉపాధి హామీ పథకంలో 16 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవడానికి రైతులకు వందశాతం రాయితీ లభిస్తోంది. వివిధ రకాల పండ్ల తోటల తోపాటు పూల తోటలు పెంపకాన్ని ప్రోత్సహిస్తూ సకాలంలో బిల్లులు ఇస్తున్నాం. అంతర్‌పంటలకు కూడా బిల్లులు ఇవ్వడం జరుగుతోంది. గట్లపై టేకు, ఎర్రచందనం లాంటి మొక్కలు నాటుకోవడానికి బిల్లులు మంజూరవుతున్నాయి.

– ఎస్. మధుబాబు, ఏపీడీ, కలికిరి

బిల్లులు చెల్లించారు



ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేసుకోవడానికి బిల్లులు అందించడం తోపాటు అధికారులు సలహాలు కూడా ఇస్తున్నారు. రెండు ఎకరాల పొలంలో మామిడి మొక్కలు నాటా. ఇప్పటి వరకు బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించారు. మా లాంటి పేద వారికి ప్రభుత్వం ఎంతో మేలు చేసింది.

– జి. శ్రీధర్‌నాయుడు, భయ్యారెడ్డిగారిపల్లె, పీలేరు మండలం.

సంపద కేంద్రంలో ప్రకృతి వనం

- ప్రకృతి విధానంలో కూరగాయల మొక్కల సాగు
- ఎరువులు, పురుగు మందులు వాడకుండా పోషణ
- మొక్కల పెంపకంపై దృష్టి పెట్టిన కంకిపాడు పంచాయతీ
- రానున్న రోజుల్లో ఆదాయ వనరుగా మార్చేందుకు చర్యలు



కంకిపాడు లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

కంకిపాడు(పెనమలూరు): అది చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం. నిన్నటి వరకూ ప్రజలకు అంత వరకే తెలుసు. ప్రస్తుతం ప్రకృతి విధానంలో కూరగాయల మొక్కల సాగు జరుగుతోంది. ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా సంపద కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు కంకిపాడు పంచాయతీ పాలకవర్గం పాటుపడుతూ స్థానిక సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది.

మండల కేంద్రమైన కంకిపాడులో గత పాలకపక్షం హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. ఈ పాలకపక్షం అధికారం చేపట్టాక సంపద వృద్ధి, ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించింది. ప్రస్తుతం వర్మీకంపోస్టు, పాడి చెత్త విక్రయాలు సాగిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం

సంపద కేంద్రంలో ఉన్న ఖాళీ స్థలంలోనూ సంపద సృష్టించేందుకు పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఐదు నెలల క్రితం సంపద కేంద్రం ప్రాంగణంలో వృథాగా ఉన్న స్థలాన్ని బాగుచేయించారు. ఆ ప్రాంతంలో వర్మీకంపోస్టు, మట్టి కలిపి మొక్కల పెంపకానికి ఏర్పాట్లు చేశారు. వంగ, బెండ, గోరు చిక్కుడు, టమాటా, మిర్చి మొక్కలు నాటారు. తీగజాతికి చెందిన సొర, బీర, కాకర, పొట్లను కూడా సాగుచేస్తున్నారు. వీటికి పందిరి అవసరం లేకుండా ప్రాంగణంలో కొంచెం ఎత్తు మాత్రమే ఉన్న చెట్లకు పాదులను పాకిస్తున్నారు. తోటకూర, పాలకూర, గోంగూర నారుపోసి సంరక్షించారు. అరటి, జామ, దానిమ్మ, పనస, మామిడి, ఉసిరి వంటి పండ్ల జాతి మొక్కలను పెంచుతున్నారు. ఈ మొక్కలు తెగుళ్లు, పురుగుల బారిన పడకుండా నిత్యం పంచాయతీ సిబ్బంది సంరక్షిస్తున్నారు. మొక్కలు ఆరోగ్యంగా ఎదిగేందుకు, మంచి ఫలసాయం లభించేందుకు ఎప్పటికప్పుడు వర్మీకంపోస్టు, సేంద్రీయ ఎరువును మొక్కలకు అందిస్తున్నారు.

ఆదాయం పెంపు దిశగా..

ఇప్పటికే చెత్త నుంచి సంపద కేంద్రం నుంచి వర్మీకంపోస్టు, పాడి చెత్త విక్రయాలు జరుగుతున్నాయి. వీటి తోపాటుగా అన్ని సీజన్లలో ప్రకృతి విధానంలో కూరగాయ మొక్కలను పెంచి వాటి ఉత్పత్తులను విక్రయించటం ద్వారా అదనపు ఆదాయాన్ని ఆర్జించేందుకు పంచాయతీ చర్యలు తీసుకుంది. వర్మీకంపోస్టు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు ఆర్గానిక్ కూరగాయలకు ఆసక్తి చూపుతారు. అదే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సంపద కేంద్రంలో అమలు చేస్తోంది.



ఏపుగా పెరుగుతున్న వంగ మొక్కలు



మొక్కలను సంరక్షించే పనిలో పంచాయతీ కార్మికురాలు



గోరుచిక్కుడు మొక్కలు



ఒకే చోట పండ్ల మొక్కలు, తీగజాతి మొక్కల సంరక్షణ

ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్



ప్రస్తుతం ఆర్గానిక్ ఉత్పత్తులను మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఆరోగ్యంపై అవగాహన, శ్రద్ధ పెరిగాయి. ఆర్గానిక్ పద్ధతిలో పెరిగిన కూరగాయలను భుజించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అదే కారణంతో ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావా లని నిర్ణయించుకున్నాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వృథాగా ఉన్న ఖాళీ స్థలాన్ని మొక్కల పెంపకానికి వినియోగిస్తున్నాం. కేంద్రం ప్రాంగణం మొత్తం కూరగాయలు, ఆకుకూరలు పెంచి విక్రయించటం ద్వారా పంచాయతీకి కూడా ఆదాయం సమకూరుతుంది.

– రాచూరి చిరంజీవి, ఉప సర్పంచ్, కంకిపాడు


వాగ్గేయకార వైభవం

శాంతం-సంగీతం

వాగ్గేయకారులైన వారు రచించిన గీతాలు మహాకవులయిన ఇతరులు రచించిన పద్యాల సందర్భాల్లాగే ఉంటాయి. శివలింగం అంటే శివుడితో మాట్లాడుతున్నట్లే, ఇది విగ్రహం కాదు రాముడే, ఇది శిల కాదు.. అక్కడ ఉన్నది కామాక్షియే, అది మూర్తి కాదు సాక్షాత్ కృష్ణ పరమాత్ముడే.. అని పరవశాన్ని పొంది లోపలి భావాలను గీతాలుగా స్వరయుక్తంగా ప్రవహింపచేశారు. అవి అజరామరమై ఎన్ని శతాబ్దాలు గడిచినా రామాయణ, భారత, భాగవతాల్లాగే ఉండిపోతున్నాయి.

వారికి అనేక శాస్త్రాల్లో నిష్ఠ ఉండేది. త్యాగరాజ స్వామివారి ''మా జానకిచేతపట్టగ..' కీర్తననే చూడండి.రామాయణాన్ని భవిష్యపురాణంతో కలిపారు. రామావతారంలోంచి శ్రీవేంకటేశ్వర అవతారం లోకి వెళ్ళింది. అంటే వారికి సమస్త పురాణేతిహాసాలు, వేదవేదాంగాలు సప్తధాతువుల్లో జీర్ణమయిపోయాయి. అన్ని సంగీత పరికరాల్లోకి అత్యంత ప్రధానమైన నాదోపాసనకు సాధనమైన వీణ మీద వీరు అధికారం పొందారు. ''వీణావాదనతత్త్వజ్ఞః శృతిజాతి విశారదః తాళజ్ఞశ్చాప్రయాసేన మోక్షమార్గం సగచ్ఛతి'' ఎవరయితే ఆ వీణావాద తత్త్వాన్ని, నాదోపాసన చేయగలిగిన స్థితిని పొంది ఉన్నారో, సంగీతంలో ఉన్న అన్ని శబ్దాల గురించి పరిపూర్ణ జ్ఞానాన్ని పొంది ఉన్నారో, తాళం వినగానే తాళ లక్షణాల గురించి చెప్పగలరో వారు మోక్షమార్గంలో పోతున్నారనడం నిస్సందేహం. అంటే భారతీయ సంగీతం మోక్షానికి కారణం. త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి, రామదాసు, అన్నమాచార్యులూ ఆ స్థితినే పొందారు. కేవలం మనోరంజకత్వం కాదు, భగవంతునిలో ఐక్యమయిపోవడానికి దివ్యసాధనంగా మనకు ఆ సంగీతాన్ని పవిత్రమైన వస్తువుగా, గంగాజల భాండంగా, ఆవుపాల కుండగా అందించారు. వారి సంగీతం ఎంత గొప్పగా ఉంటుందో, సాహిత్యం కూడా అంత గంభీరంగా ఉంటుంది. వీరిలో మరో విశేషం కనపడుతుంది. అది సర్వకాల సర్వావస్థల్లో పరమ ప్రశాంతంగా ఉండగలిగిన స్థితి. మనం ఎంత సాధన చేసినా, ఏ యజ్ఞయాగాదులు, జపాలు, పూజలు చేసినా ఎక్కడో ఒకచోట శాంతం తప్పుతాం. అందుకే త్యాగరాజస్వామి అంటారు...'శాంతము లేక సౌఖ్యము లేదు...' అని. శాంతం అంటే రాగద్వేషాలు లేకుండా ఉండడం. నాకిది కావాలని కానీ, నాకు వారంటే కోపం అని కానీ, వీరంటే చికాకని కానీ ఉండదు. ఎవరిమీదా ప్రేమా ఉండదు, ద్వేషం ఉండదు. రాగద్వేషా లు లేకుండా ఎలా ..? అమ్మ ఈ రెండే పట్టుకుని ఉంటుంది.''రాగ స్వరూప పాశాఢ్య క్రోధాంకారేంమేశోజ్వలా..'' నన్ను ఉపాసన చేయగా చేయగా నీకున్న రాగం అన్న పాశం తీసి భక్తి అన్న పాశం వేసి నా దగ్గరకు లాక్కుంటాను... అంటుంది. అంకుశం పెట్టి పొడిస్తే ఏనుగు ఎంత బాధ పడుతుందో తన కోపం తన శత్రువయి అంత బాధ పెడుతుంది. అందువల్ల రాగద్వేషాలు లేని ప్రశాంత స్థితిని పొందాలి. సాధన చేస్తున్నప్పుడు ఈ స్థితిని కొంతవరకే పొందగలం. కానీ ఎప్పుడూ అలా ఉండడం అంత సులభం కాదు. దానిని సాధ్యం చేసేది ఒక్క సంగీతం మాత్రమే. అలా సాధ్యం చేసి చూపారు మనకు వాగ్గేయకారులు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



బౌద్ధవాణి

ఉభయ శ్రేయస్సు

అది చంపానగర సమీపంలో ఉన్న గర్గరా పుష్కరిణీ తీరం. ఆ పుష్కరిణి దక్షిణపు ఒడ్డున సువిశాలమైన మర్రిచెట్టు. ఆ చెట్టుకింద బుద్ధుడు తన భిక్షు సంఘంతో కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో ఏనుగులకు శిక్షణ ఇచ్చే పేస్సుడు, కందరకుడు అనే పరివ్రాజకుడు ఇద్దరూ వచ్చారు. వారు వచ్చి మౌనంగా ఒకపక్క కూర్చున్నారు. కొంతసేపటికి బుద్ధుని ప్రబోధం ముగించాడు. అప్పుడు వారిద్దరూ బుద్ధుని దగ్గరకు వెళ్ళారు. కొన్ని అనుమానాలు అడిగి నివృత్తి చేసుకున్నారు.



అప్పటికి చాలా సమయం గడిచింది. భిక్షుసంఘం అంతసమయం నిశ్శబ్దంగానే ఉండటం చూసి వారిద్దరూ ఆశ్చర్యపడ్డారు.

వారు అనేక ఇతర పరివ్రాజక సంఘాల్ని చూశారు. గురువులు చెప్పే సందేశాలు ముగిశాక గానీ ఇంత ప్రశాంతత కానరాదు. ఎవరో ఒకరు మాట్లాడుకుంటూనో, గుసగుసలాడుకుంటూనో, గొణుక్కుంటూనో ఉంటారు. ఆ గురువులు 'నిశ్శబ్దం నిశ్శబ్దం' అని అరుస్తూనే ఉంటారు. కానీ ఇక్కడ అలాంటిదేమీలేదు. ఎవ్వరూ అసహనంగా లేరు. ఇతరుల్ని సహనాన్ని చెడగొట్టడం లేదు. తాము బాధపడటం లేదు, ఇతరుల్ని బాధపెట్టడం లేదు.

అప్పుడు కందరకుడు ''భగవాన్! విచిత్రం! మనుషుల ప్రవర్తన రకరకాలుగా ఉంటుంది. కానీ, ఇక్కడ అందరూ ఒకే శ్రద్ధతో ఉన్నారు'' అని ఆశ్చర్యంగా అడిగాడు. అప్పుడు బుద్ధుడు–

''కందరకా! మనుషుల్లో ముఖ్యంగా తాపసుల్లో నాలుగు రకాల వారు ఉంటారు. మొదటి రకం వారు, తమని తామే బాధించుకుంటారు. తాము బాధపడుతూ తమ శరీరాల్ని అతిగా బాధలకి గురిచేస్తారు. నిరాహారంతో శుష్కింపచేస్తారు. అతి చలికి, అతి వేడిమికి గురిచేస్తారు. తినకూడని పదార్థాల్ని తింటారు. అలా తమని తాము శిక్షించుకోవడమే సరైన శిక్షగా భావిస్తారు. ఇంకొందరు ఇతరుల్ని బాధించి తాము సుఖంగా బతకాలనుకుంటారు. దొంగలూ దోపిడీదారులు, ఇతర జీవుల్ని పట్టి చంపి వాటి మాంసాన్ని అమ్మేవారు. ఇలా పరుల్ని నష్టపరచి తాము లాభాలు పొందాలనుకునే వారంతా ఈ కోవలోకి వస్తారు. అలాగే తాము దుఃఖపడుతూ ఇతరుల్ని దుఃఖపరిచే వారు మూడోరకం. ఒక మహారాజు గొప్ప యజ్ఞం చేయాలనుకుంటాడు. దాని నిర్వహణ కోసం ఎంతో సొమ్ము... ఎన్నో జంతువులూ కావాలి. కాబట్టి ఆజ్ఞలు జారీ చేస్తాడు. ఆ ఆజ్ఞల్ని అమలు చేయడానికి ఉద్యోగుల్నీ, సైనికుల్నీ నియమిస్తాడు. వారు గ్రామాల మీద పడి పేద ప్రజల నుండి, సామాన్య రైతుల నుండి పశువుల్ని, డబ్బుల్నీ బలవంతాన లాక్కు వస్తారు. అలా వారు తమకి ఇష్టం లేకపోయినా బాధపడుతూనే... బలవంతంగా ఆ పనులు చేస్తారు. తాము బాధపడుతూ, ఇతరుల్నీ బాధపెడతారు.''

ఇక కొందరు తమ శరీరాన్ని, తమ మనస్సునీ తాము బాధించుకోరు. తమ సుఖం కోసం పరుల్నీ బాధించరు– ఇలాంటి వారు స్వీయ క్రమశిక్షణతో నడుచుకుంటారు. అలా ఉంటే ఆ వినేది తామూ శ్రద్ధతో వింటారు. పక్కనున్న వారినీ విననిస్తారు. అది ఉభయులకీ శ్రేయస్సునిస్తుంది. నా భిక్షువులు అలాంటి వారు'' అన్నాడు బుద్ధుడు. శ్రద్ధ, స్వీయక్రమశిక్షణ ఎంత అవసరమో వారికర్థమయ్యింది. ఇద్దరూ బుద్ధునికి ప్రణమిల్లి ''మమ్మల్ని, మీ సంఘంలో చేర్చుకోండి'' అని ప్రార్థించారు. బుద్ధుడు అంగీకరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

మంచిమాట

సత్సాంగత్యం

ఏమీ చదువుకోక పోయినా, విద్యాగంధం ఏ మాత్రం లేక పోయినా కొంత మంది మాటలు పండితులకే ఆశ్చర్యం కలిగిస్తాయి. వారు ఉంటున్న, లేదా పని చేస్తున్న ప్రదేశంలో ఉన్న వాతావరణం ప్రభావం అది. అందరు వైద్యులే ఉన్న కుటుంబంలో ఉన్న పిల్లలు అప్రయత్నంగా వైద్య పరిభాషని ఉపయోగించటం, సంగీత విద్వాంసుల కుటుంబంలో వారి పిల్లలు రాగాలని గుర్తు పట్టటం వంటివి మనం చూస్తూనే ఉంటాం కదా! అదంతా సాంగత్య ప్రభావం.



ఒక వ్యక్తి నిత్యం ఎవరితో ఎక్కువగా కలిసి ఉంటే వారి ప్రభావం వల్ల కొన్ని లక్షణాలు సంక్రమిస్తాయి. మంచివారితో కలిసి ఉంటే సహజంగా దురాలోచన ఉన్న వ్యక్తి అయినా కొంత వరకు చెడు ప్రవర్తనకు దూరంగా ఉండటం జరుగుతుంది. దుర్మార్గుల సాహచర్యంలో ఉంటే చెడ్డపనులు చేయక పోయినా ఆమోదించటం, అనుమోదించటం జరుగుతుంది. కనుకనే ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నాము... అన్న దానిని గమనించుకుంటూ ఉండాలి. కొన్ని ప్రభావాలు తాత్కాలికం. మందారపువ్వు పక్కన ఉన్న గాజుపట్టకం లాగా. పువ్వుని అక్కడి నుండి తీసేయగానే అప్పటి వరకు ఎర్రగా కనపడిన గాజుపట్టకం తన సహజ వర్ణానికి వచ్చేస్తుంది. కొన్నిటిని తప్పించుకోవటం కష్టం. మరికొన్నిటి ప్రభావం శాశ్వతం. స్వభావంలో జీర్ణించుకుపోతాయి. శక్తివంతమైన చెడు ప్రభావాల నుండి తప్పించుకోవటానికి మార్గం దూరంగ ఉండటమే. ''దుష్టుడికి దూరంగా ఉండ'' మని పెద్దలు చెప్పిన మాట ఇందుకోసమే. మరి కొన్నిటి ప్రభావం ఆ పట్టకం పైన రంగులని పూసినట్టు. గట్టిగా తుడిచినా, నీళ్ళతో కడిగినా సహజ స్థితికి వస్తుంది. అదే, పట్టకం తయారు అయే సమయంలో ద్రవ స్థితిలో ఉండగానే ఏదైనా రంగు కలిపితే అది శాశ్వతంగా ఉండిపోతుంది.

అందుకే మంచివారి సాంగత్యంలో ఎంత వీలైతే అంత ఎక్కువ సమయం గడిపే ప్రయత్నం చేయాలి. స్వభావసిద్ధంగా దుర్బుద్ధి అయిన ధృతరాష్ట్రుడు ఉత్తమ గతులు పొందటానికి కారణం ఎంతో సమయం విదురుడి సమక్షంలో గడపటమే. మనసు బాగుండనప్పుడు విదురుడిని పిలిపించుకొని అతడి సమక్షంలో కాలం గడిపేవాడు. శాశ్వతంగా కాకపోయినా విదురుడు మాట్లాడినంత సమయం ధృతరాష్ట్రుడు సదాలోచనలతోనే ఉన్నాడు. కనీసం దురాలోచనలు చేయకుండా ఉన్నాడు కదా! పూలు మాల కట్టిన దారానికి ఆ పూల పరిమళం అంటుకు పోతుంది.

ఒకరి ప్రభావం మరొకరి మీద ఉండటం ఎట్లా కుదురుతుంది? అనే దానికి సాన్నిధ్యంలో ఉండటమే కారణం అన్నది సమాధానం. ఇనుము అయస్కాంత సన్నిధిలో కొంతకాలం ఉండగా ఉండగా దాని లక్షణాలు ఇనుముకి రావటం చూస్తున్నాముగా!

ఆయుధాన్ని దగ్గర ఉంచుకున్న మునిలో హింసాప్రవృత్తి క్రమంగా పెంపొందిన ఇతివృత్తాన్ని సీత రాముడికి చెప్పింది. అదే విధంగా బోయల మధ్య పెరిగిన ప్రచేతసుడనే ముని కుమారుడు బోయవాడుగా మారటం మనకి తెలుసు.

ఇది పైకి కనిపించే అర్థం. అసలు అర్థం మరొకటి ఉన్నదని పెద్దలు చెపుతూ ఉంటారు. 'సత్' అంటే ఉన్నది, సత్యము అని కూడా అర్థాలున్నాయి. 'సత్' అంటే భగవత్తత్త్వం. ఆ సత్ (వేదాంతులు సత్తు అని అంటూ ఉంటారు) తో సాహచర్యం చేస్తూ ఉండటం. అంటే నిరంతరం దైవచింతనలో ఉండటం. అట్లా కుదురుతుందా? అంటే అందరినీ దైవస్వరూపులుగా భావిస్తే అదెంతపని?

'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చల తత్త్వం, నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః' అన్నారు ఆది శంకరులు.

– డా. ఎస్.అనంతలక్ష్మి

> ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చాలా మంది పాల్గొంటారు. వీరిలో ఒకరికైనా సద్బుద్ధి కలిగిందని చెప్పగలరా? అంటూ విమర్శిస్తూ ఉంటారు కొందరు. వారికి సద్బుద్ధి కలిగిందో లేదో మనకి అనవసరం. కాని, ఆ కార్యక్రమంలో ఉన్నంత కాలం దురాలోచనలు లేక ఉంటారు. అది గొప్ప ప్రయోజనమే కదా! తరువాత అది నెమ్మదిగా మిగిలిన సమయాలకి కూడా విస్తరించే అవకాశం ఉంది. పూలు మాల కట్టిన దారం పువ్వుగా మారక పోవచ్చు కాని పూలవాసనని మాత్రం సంతరించుకుంటుంది.

సినిమా

అక్టోబరులో మళ్లీ ఆరంభం

రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి, సునీల్, నవీన్ చంద్ర, ఎస్‌జే సూర్య, జయరాం కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా 'గేమ్‌చేంజర్' తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 20 నుంచి ప్లాన్ చేశారు. అయితే ఈ షెడ్యూల్ రద్దు అయ్యింది. ''గేమ్‌చేంజర్'లోని కొందరు ఆర్టిస్టులు షూటింగ్‌కు అందుబాటులో లేని కారణంగానే ఈ నెలలో జరగాల్సిన షూటింగ్ రద్దు అయింది. అక్టోబర్ రెండో వారంలో తిరిగి షూటింగ్‌ను స్టార్ట్ చేస్తాం'' అని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్


● రామ్‌చరణ్

ఇటలీలో ఆటాపాటా

గోపీచంద్ ఇటలీకి మకాం మార్చారు. శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనెపూడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆదివారం (సెప్టెంబరు 24) శ్రీనువైట్ల బర్త్ డే. ఈ సందర్భంగా ఇటలీలో శ్రీనువైట్ల అండ్ టీమ్ లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేస్తున్న వీడియోను చిత్రయూనిట్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సౌత్ ఇటలీలోని మాంటెరా లొకేషన్స్‌లో ప్రారంభం కానుంది. మేజర్ షూటింగ్‌ను విదేశాల్లోనే కంప్లీట్ చేస్తారట చిత్రయూనిట్. గోపీచంద్‌పై ముందుగా ఓ యాక్షన్ సీన్‌ను ప్లాన్ చేశారట శ్రీనువైట్ల. ఆ తర్వాత ఓ పాటని కూడా చిత్రీకరించనున్నారని భోగట్టా. ఈ చిత్రంలో కావ్యాథాపర్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది.


● గోపీచంద్

లక్కీ భాస్కర్ షురూ


● దుల్కర్ సల్మాన్‌పై క్లాప్ ఇస్తున్న దృశ్యం

'మహానటి, సీతారామం' వంటి హిట్ చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న స్ట్రయిట్ తెలుగు చిత్రం 'లక్కీ భాస్కర్' షురూ అయింది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ''ఒక సాధారణ మనిషి ఉన్నత శిఖరాలకు చేరిన అసాధారణమైన ప్రయాణంగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. 'సార్' (తమిళంతో 'వాతి') చిత్రం తర్వాత వెంకీ అట్లూరితో మేము నిర్మిస్తున్న రెండో పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

ఘనంగా పరిణీతి చోప్రా పెళ్లి

బాలీవుడ్ హీరోయిన్ పరిణీతి చోప్రా పెళ్లి పీటలెక్కారు. ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) ఎంపీ రాఘవ్ చద్దాతో ఆదివారం ఆమె ఏడడుగులు వేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లీలా ప్యాలెస్‌లో వీరి పెళ్లి వేడుక ఆదివారం సాయంత్రం 6: 30 నిమిషాలకు ఘనంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న వీరి పెళ్లి వేడుక అత్యంత వైభవంగా కొనసాగింది. ఇందులో భాగంగా శనివారం రాత్రి సంగీత్, ప్రీ-వెడ్డింగ్ నిర్వహించారు. ఆదివారం 6:30గంటలకు వివాహం జరిగింది. వీరిద్దరి వివాహానికి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సానియా మీర్జా, హర్భజన్ సింగ్, మనీష్ మల్హోత్రా, ఆదిత్య ఠాక్రేతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. అయితే ఈ పెళ్లికి పరిణీతి చోప్రా సోదరి, హీరోయిన్ ప్రియాంక చోప్రా మాత్రం హాజరు కాలేదు. కానీ, ఆమె తల్లి డాక్టర్ మధు చోప్రా హాజరయ్యారు. ఈ నెల 30న చండీగఢ్‌లో పరిణీతి-రాఘవ్ చద్దాల వివాహ రిసెప్షన్ జరగనుందట. కాగా రాఘవ్, పరిణీతి ఒకే పాఠశాలలో చదువుకోవటం విశేషం.


● రాఘవ్ చద్దా, పరిణీతి చోప్రా

యాక్షన్.. ఎమోషన్

వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు కాలిస్ ఓ సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కీర్తీ సురేష్, వామికా హీరోయిన్స్‌గా నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ చిత్రీకరణ అక్టోబరు రెండో వారం వరకూ సాగుతుందట. వరుణ్, కీర్తీ కాంబోలో కొన్ని భావోద్వేగ సన్నివేశాలతో పాటు, వరుణ్‌తో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట కాలిస్. కీర్తీసురేష్‌కు బాలీవుడ్‌లో ఇదే తొలి చిత్రం. ఈ సినిమాను దర్శకుడు అట్లీ నిర్మిస్తున్నారు. అయితే అట్లీ దర్శకత్వంలోని తమిళ హిట్ 'తేరీ' హిందీ రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోందనే టాక్ కూడా బాలీవుడ్‌లో వినిపిస్తోంది.


● వరుణ్ ధావన్


● కీర్తీ సురేష్

వినోదాల కుటుంబం

రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా 'సఃకుటుంబనాం' చిత్రం ప్రారంభమైంది. ఉదయ్ శర్మ దర్శకత్వంలో హెచ్ఎన్‌జీ మూవీస్ పతాకంపై హెచ్.మహాదేవ్ గౌడ, హెచ్.నాగరత్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కొరియోగ్రాఫర్ చిన్నిప్రకాష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత ఏఎం రత్నం క్లాప్ ఇవ్వగా, ఉదయ్‌శర్మ దర్శకత్వం వహించారు. ''వినోదాలు పంచే చక్కని కుటుంబ కథా చిత్రమిది'' అన్నారు ఉదయ్ శర్మ. ''ఈ చిత్రంలో నా పాత్ర పేరు సిరి.. నాకు బాగా నచ్చిన పాత్ర ఇది'' అన్నారు మేఘా ఆకాష్. ''అన్ని భావోద్వేగాలు ఉన్న చాలా శక్తివంతమైన కథ ఇది'' అన్నారు రామ్‌కిరణ్. ''కొత్త కథాంశంతో రూపొందుతున్న మా చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హెచ్.మహాదేవ్ గౌడ, హెచ్.నాగరత్నం అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: రోహిత్ పద్మనాభం.


● మేఘా ఆకాశ్, రామ్‌కిరణ్

సూర్యపుత్రన్ కర్ణన్

భారతీయ ఇతిహాసం మహాభారతం ఆధారంగా దాదాపు ఐదు సంవత్సరాల క్రితం విక్రమ్ హీరోగా ఆర్ఎస్ విమల్ దర్శకత్వంలో 'సూర్యపుత్రన్ కర్ణన్' అనే సినిమా ప్రకటన వెల్లడైన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాని దాదాపు మూడొందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తారనే ప్రచారం అప్పట్లో సాగింది. కానీ వివిధ కారణాల వల్ల ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. అయితే 'సూర్యపుత్రన్ కర్ణన్' సినిమా 'రోలింగ్ సూన్'(త్వరలో చిత్రీకరణ ప్రారంభం అవుతుందన్నట్లుగా..) అంటూ కర్ణుడి పాత్రలో ఉన్న విక్రమ్ ఫోటోను షేర్ చేశారు విమల్. అలాగే ఈ సినిమా టీజర్ అంటూ మరో వీడియోను ఆదివారం షేర్ చేశారాయన. మరి... ఈ మూవీకి ఉన్న అడ్డంకులు తొలగినట్లేనా? త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందా? వేచి చూడాలి.


● విక్రమ్

రీల్స్

సంక్రాంతికి అయలాన్


● శివ కార్తికేయన్

శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా ఆర్.రవికుమార్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'అయలాన్'. కోటపాడి జె.రాజేష్, ఆర్‌డీ రాజా నిర్మించిన ఈ సినిమాను సంక్రాతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. ''అయలాన్ అంటే ఏలియన్ అని అర్థం. ఈ ప్రయాణంలో మాకు కొన్ని కష్టాలు ఎదురైనప్పటికీ ధైర్యం కోల్పోకుండా, పట్టుదలతో ఈ సినిమా చేశాం. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడాలనుకోవడం లేదు. అందుకే సినిమా విడుదల కొంత ఆలస్యం అవుతోంది. మా మూవీలో 4500 సీజీ షాట్స్ ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మా మూవీ రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

వైవిధ్యమైన కథ


● సుమన్

నటుడు సుమన్ ప్రధాన పాత్రలో మునిప్రసాద్ దర్శకత్వం వహించిన చిత్రం 'సిర్నాపల్లి సంస్థాన్'. మనోహర్, శ్రీనివాస్, జ్యోతీసింగ్, శృతీ పాండే హీరోహీరోయిన్లుగా నటించారు. కృష్ణకాంతి క్రియేషన్స్‌లో మంచాల రమేశ్ యాదవ్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మంచాల రమేశ్ యాదవ్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'సిర్నాపల్లి సంస్థాన్'. మునిప్రసాద్ చక్కగా తీశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వేల్ మురుగన్, సంగీతం: ఏలేందర్.

రాయలసీమ నేపథ్యంలో...

రవి మహాదాస్యం, విషిక లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. హీరో నవదీప్ సి-స్పేస్ సమర్పణలో దేవీ ప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించారు. ఈ సినిమాను అక్టోబరు 6న విడుదల చేస్తున్నట్లు యూనిట్ వెల్లడించింది. ''రాయలసీమ పల్లెటూరి నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం, కెమెరా, ఎడిటింగ్: రాజశేఖర్ సుద్మూన్, సంగీతం: జశ్వంత్ పసుపులేటి, నేపథ్య సంగీతం: సనల్ వాసుదేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నరేష్ మాదినేని, లైన్ ప్రొడ్యూసర్: చందు కొత్తగుండ్ల.


● రవి, విషిక

సుర సుర సుర అసుర!


● ప్రభాకర్

'బాహుబలి' ఫేమ్ ప్రభాకర్ ప్రధాన పాత్రలో పాలిక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రౌద్ర రూపాయ నమః'. రావుల రమేష్ నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని, చిత్రంలోని మొదటి లిరికల్ (సుర సుర సుర అసురసురసుర...) వీడియోను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాని త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు రావుల రమేష్. ''మా చిత్రానికి జాన్ భూషణ్ సంగీతం, సురేష్ గంగుల సాహిత్యం బాగా కుదిరాయి'' అని పాలిక్ అన్నారు.



హంపి, హారిక శుభారంభం

ఆసియా క్రీడల మహిళల చెస్ ఈవెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన రెండు గేముల్లోనూ హంపి, హారిక తమ ప్రత్యర్థులను ఓడించారు. తొలి రౌండ్ గేముల్లో హంపి 62 ఎత్తుల్లో మోజినా (ఇరాన్)పై, హారిక 65 ఎత్తుల్లో అలాలీ రూడా (యూఏఈ)పై... రెండో రౌండ్ గేముల్లో హంపి 35 ఎత్తుల్లో ఫామ్ లె థావో (వియత్నాం)పై, హారిక 57 ఎత్తుల్లో కియాన్‌యున్ గాంగ్ (సింగపూర్)పై గెలుపొందారు. రెండు రౌండ్ల తర్వాత హారిక, హంపి, హు ఇఫాన్ (చైనా), ఉమిదా (ఉజ్బెకిస్తాన్) రెండు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. పురుషుల విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి గేమ్‌లో పాలో బెర్సామినా (ఫిలిప్పీన్స్)పై గెలిచి, రెండో గేమ్‌ను లె తువాన్ మిన్ (వియత్నాం)తో 'డ్రా' చేసుకున్నాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ తొలి గేమ్‌లో ఫహాద్ (బంగ్లాదేశ్)పై గెలిచి, రెండో గేమ్‌లో నొజెర్‌బెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.



స్వర్ణ పతకానికి గెలుపు దూరంలో

- ఫైనల్లో భారత మహిళల క్రికెట్ జట్టు
- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- పూజ వస్త్రకర్‌కు 4 వికెట్లు
- నేడు శ్రీలంకతో తుది పోరు


పూజ

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ మహిళలపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 17.5 ఓవర్లలో 51 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (12) టాప్ స్కోరర్ కాగా మిగతా వారిలో ఎవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. ఐదుగురు బ్యాటర్లు 'డకౌట్' కావడం విశేషం. పేస్ బౌలర్ పూజ వస్త్రకర్ (4/17) తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనను నమోదు చేసి బంగ్లాను దెబ్బ కొట్టింది. భారత్ 8.2 ఓవర్లలో 2 వికెట్లకు 52 పరుగులు చేసి విజయాన్నందుకుంది. స్మృతి మంధాన (7) తొందరగానే అవుటైనా... జెమీమా రోడ్రిగ్స్ (20 నాటౌట్), షఫాలీ వర్మ (17) కలిసి గెలిపించారు. స్వర్ణపతకం కోసం నేడు జరిగే ఫైనల్లో శ్రీలంకతో భారత్ తలపడుతుంది. రెండో సెమీస్‌లో శ్రీలంక 6 వికెట్లతో పాకిస్తాన్‌పై గెలిచింది.

భారత్ 16 ఉజ్బెకిస్తాన్ 0

లలిత్, వరుణ్ కుమార్, మన్‌దీప్ సింగ్ 'హ్యాట్రిక్' సాధించడంతో... ఆసియా క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు భారీ విజయంతో శుభారంభం చేసింది. ఉజ్బెకిస్తాన్‌తో ఆదివారం జరిగిన పూల్ 'ఎ' తొలి మ్యాచ్‌లో భారత్ 16-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున లలిత్ (7వ, 24వ, 37వ, 53వ ని.లో), వరుణ్ కుమార్ (12వ, 36వ, 50వ, 52వ ని.లో) నాలుగేసి గోల్స్ చేశారు. మన్‌దీప్ (18వ, 27వ, 28వ ని.లో) మూడో గోల్స్ సాధించగా... అభిషేక్ (17వ ని.లో), అమిత్ రోహిదాస్ (38వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (42వ ని.లో), షంషేర్ సింగ్ (43వ ని.లో), సంజయ్ (57వ ని.లో) ఒక్కో గోల్ నమోదు చేశారు. తమ రెండో లీగ్ మ్యాచ్‌లో మంగళవారం సింగపూర్‌తో టీమిండియా ఆడుతుంది.


లలిత్

'ఐదు'తో అదరగొట్టారు


రజత పతకాలతో రమిత, మెహులీ, ఆశి


రజత పతకాలతో భారత రోయింగ్ జట్టు

ఈసారి పతకాల వేటలో 'సెంచరీ' దాటాలని చైనాలో అడుగుపెట్టిన భారత క్రీడాకారులు తొలి రోజే పతకాల ఖాతా తెరిచారు. 19వ ఆసియా క్రీడల్లో మొదటి రోజు ఐదు పతకాలతో అదరగొట్టారు. స్వర్ణ పతకం అందకపోయినా మూడు రజతాలు, రెండు కాంస్యాలతో శుభారంభం చేశారు. అంచలను అందుకుంటూ షూటర్లు తమ గురిని పతకాలపై పెట్టగా... రోయింగ్‌లోనూ భారత క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. మహిళల బాక్సింగ్, పురుషుల హాకీ, టెన్నిస్ క్రీడాంశాల్లోనూ మనోళ్లు రాణించారు. టేబుల్ టెన్నిస్, వాలీబాల్, మహిళల ఫుట్‌బాల్‌లో భారత్ పతకాల రేసు నుంచి నిష్క్రమించారు.

- ఆసియా క్రీడల్లో తొలి రోజు భారత్‌కు ఐదు పతకాలు
- షూటింగ్‌లో రజతం, కాంస్యం
- రోయింగ్‌లో రెండు రజతాలు, కాంస్యం

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో తొలి రోజు భారత క్రీడాకారులు మెరిపించారు. షూటింగ్‌లో రెండు, రోయింగ్‌లో మూడు పతకాలతో రాణించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం టీమ్ ఈవెంట్‌లో రమితా జిందాల్, మెహులీ ఘోష్, ఆశి చౌక్సీలతో కూడిన భారత జట్టు రజత పతకం సాధించింది. క్వాలిఫయింగ్‌లో భారత బృందం 1886 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. హాన్ జియావు, యుటింగ్ హువాంగ్, జిలిన్ వాంగ్‌లతో కూడిన చైనా జట్టు 1896.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. గాన్‌హుయగ్, యసుజెన్, నరన్‌తుయాలతో కూడిన మంగోలియా జట్టు 1880 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది. క్వాలిఫయింగ్‌లో రమిత 631.9 పాయింట్లతో రెండో స్థానంలో, మెహులీ 630.8 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన వారి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో ఫైనల్‌ను నిర్వహిస్తారు. ఫైనల్లో రమిత 230.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకోగా... మెహులీ 208.3 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. యుటింగ్ హువాంగ్ (252.7 పాయింట్లు) స్వర్ణం, హాన్ జియావు (251.3 పాయింట్లు) రజతం గెల్చుకున్నారు.


రజత పతకాలతో అర్జున్ లాల్, అరవింద్ సింగ్

రోయింగ్‌లో పురుషుల లైట్‌వెయిట్ డబుల్ స్కల్స్ ఈవెంట్‌లో అర్జున్ లాల్ జాట్-అరవింద్ సింగ్ ద్వయం రజత పతకంతో బోణీ కొట్టింది. భారత జోడీ 6ని:28.18 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. జున్‌జీ ఫాన్-మన్ సున్ (చైనా; 6ని:23.42 సెకన్లు) జంట స్వర్ణ పతకం సాధించింది. పురుషుల పెయిర్ విభాగంలో బాబూలాల్ యాదవ్-లేఖ్ రామ్ జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది. ఫైనల్ రేసులో బాబూలాల్-లేఖ్ రామ్ జంట 6ని:50.41 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానాన్ని దక్కించుకుంది. అనంతరం పురుషుల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో భారత జట్టు రజతం గెల్చుకుంది. నీరజ్, నరేశ్ కల్వానియా, నితీశ్ కుమార్, చరణ్‌జీత్ సింగ్, జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత జట్టు 5ని:43.01 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని పొందింది. వాలీబాల్‌లో భారత పురుషుల జట్టు పతకం రేసు నుంచి నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 16-25, 18-25, 17-25తో జపాన్ చేతిలో ఓడిపోయింది. పురుషుల టెన్నిస్ డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ (భారత్) 6-2, 6-3తో అభిషేక్-ప్రదీప్ (నేపాల్)లపై గెలిచారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ 6-0, 6-0తో మార్కో టిన్ (మకావు)పై ఘనవిజయం సాధించాడు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	20	7	3	30
దక్షిణ కొరియా	5	4	5	14
జపాన్	2	7	5	14
హాంకాంగ్	2	0	5	7
ఉజ్బెకిస్తాన్	1	3	3	7
చైనీస్ తైపీ	1	1	2	4
భారత్	0	3	2	5
ఇండోనేసియా	0	1	3	4
మంగోలియా	0	1	2	3
ఇరాన్	0	1	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

ఏషియాడ్‌లో నేటి భారతీయం

మెడల్ ఈవెంట్స్





షూటింగ్: పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్, వ్యక్తిగత విభాగం : రుద్రాంక్ష్ పాటిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్, దివ్యాంశ్ (ఉదయం గం. 6:30 నుంచి 9 వరకు).

మహిళల క్రికెట్ ఫైనల్: భారత్ X శ్రీలంక (ఉదయం గం. 11:30 నుంచి).

రోయింగ్: పురుషుల సింగిల్ స్కల్స్ (బల్‌రాజ్ పన్వర్; ఉదయం గం. 7 నుంచి); పురుషుల క్వాడ్రాపుల్ స్కల్స్ (ఉదయం గం. 8:30 నుంచి); మహిళల ఎయిట్ (ఉదయం గం. 8:50 నుంచి).

నిఖత్ పంచ్ అదిరె...



తొలిసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న భారత మహిళా స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. 50 కేజీల విభాగం తొలి రౌండ్‌లో నిఖత్ 5-0తో థి టామ్ ఎన్గుయెన్ (వియత్నాం)పై ఘనవిజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. భారత్‌కే చెందిన మరో బాక్సర్ ప్రీతి (54 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సిలీనా (జోర్డాన్)తో జరిగిన బౌట్‌లో ప్రీతి సంధించిన పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి తట్టుకోలేకపోయింది. మూడో రౌండ్ మొదలైన 23 సెకన్ల తర్వాత రిఫరీ బౌట్‌ను నిలిపివేసి ప్రీతిని విజేతగా ప్రకటించాడు.

టీటీలో ముగిసిన పోరు

గత ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచిన భారత పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు ఈసారి క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. దక్షిణ కొరియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 0-3తో ఓడిపోయింది. భారత మహిళల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్లో 2-3తో థాయ్‌లాండ్ చేతిలో ఓటమి పాలైంది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్



సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు 13 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరోసారి ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. మయన్మార్‌తో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌ను భారత్ 1-1తో 'డ్రా' చేసుకుంది. భారత్ తరఫున 23వ నిమిషంలో సునీల్ ఛెత్రి... మయన్మార్ తరఫున కివా హెట్వే 74వ నిమిషంలో ఒక్కో గోల్ చేశారు. చైనా ఏడు పాయింట్లతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలువగా... భారత్, మయన్మార్ నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అయితే లీగ్ దశలో మయన్మార్ కంటే భారత్ ఒక గోల్ ఎక్కువ చేయడంతో ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు పోరాటం లీగ్ దశలోనే ముగిసింది. గ్రూప్ 'బి'లో థాయ్‌లాండ్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 0-1తో ఓడిపోయింది.

ఇండోర్‌లో ఇరగదీశారు

వరల్డ్ కప్‌కు ముందు భారత్ అదరగొట్టే ప్రదర్శన... పలువురు కీలక ఆటగాళ్లు లేకపోయినా అద్భుత ఆటతో టీమిండియా బృందం ఆస్ట్రేలియాకు చుక్కలు చూపించింది. భారీ విజయమే కాకుండా ఇప్పటి వరకు వరకు బెంగగా ఉన్న శ్రేయస్ ఫామ్ సమస్య కూడా తొలగిపోగా... సూర్యకుమార్ కూడా ఎట్టకేలకు తన అసలు ప్రతాపాన్ని చూపించాడు. ఫలితంగా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ భారత్ సొంతమైంది.

- రెండో వన్డేలో భారత్ ఘన విజయం
- 99 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు
- శ్రేయస్, గిల్ సెంచరీలు
- 2-0తో సిరీస్ టీమిండియా సొంతం
- బుధవారం రాజ్‌కోట్‌లో చివరి వన్డే

ఇండోర్: సమష్టి ప్రదర్శనతో అదరగొట్టిన భారత్ ఆదివారం హోల్కర్ స్టేడియంలో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో 99 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 399 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా జట్టుపై భారత్‌కు వన్డేల్లో ఇదే అత్యధిక స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయస్ అయ్యర్ (90 బంతుల్లో 105; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (97 బంతుల్లో 104; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో సత్తా చాటారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 164 బంతుల్లోనే 200 పరుగులు జోడించడం విశేషం. ఈ ఇద్దరితో పాటు సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 72 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (38 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు సాధించగలిగింది. భారత్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 31 ఫోర్లు, 18 సిక్సర్లు ఉండటం విశేషం. అనంతరం వర్షం కారణంగా ఆస్ట్రేలియా లక్ష్యాన్ని 33 ఓవర్లలో 317 పరుగులుగా (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) నిర్దేశించారు. ఆసీస్ 28.2 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. వార్నర్ (39 బంతుల్లో 53; 7 ఫోర్లు, 1 సిక్స్), అబాట్ (36 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. చివరి వన్డే బుధవారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.



శ్రేయస్


గిల్

చివరి వరకు మెరుపులు...

అరంగేట్ర బౌలర్ స్పెన్సర్ వేసిన తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన రుతురాజ్ (8) ఎక్కువసేపు నిలవలేదు. అయితే నాలుగో ఓవర్ ఐదో బంతి నుంచి మొదలైన గిల్, శ్రేయస్ భాగస్వామ్యం ఆస్ట్రేలియాను ఒక ఆటాడుకుంది. గత మ్యాచ్‌లో రనౌటై తీవ్ర నిరాశకు గురైన శ్రేయస్ ఈసారి తనను తాను నిరూపించుకునే ప్రయత్నంలో జోరు ప్రదర్శించాడు. తన తొలి 14 బంతుల్లోనే అతను 5 ఫోర్లు కొట్టాడు. అబాట్ ఓవర్లో గిల్ 6, 4 కొట్టడంతో భాగస్వామ్యం 29 బంతుల్లోనే 50 పరుగులకు చేరింది. వానతో 40 నిమిషాల విరామం తర్వాత ఆట మళ్లీ మొదలైంది. గిల్ 37 బంతుల్లో, శ్రేయస్ 41 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఈ భాగస్వామ్యాన్ని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు తీవ్రంగా శ్రమించినా లాభం లేకపోయింది. తన ధాటిని కొనసాగిస్తూ 86 బంతుల్లో కెరీర్‌లో మూడో సెంచరీ అందుకున్న శ్రేయస్ తర్వాతి ఓవర్లో వెనుదిరగ్గా... కొద్ది సేపటికే 92 బంతుల్లో గిల్ ఆరో వన్డే సెంచరీ పూర్తయింది. గిల్ కూడా అవుటయ్యాక ఇషాన్ (18 బంతుల్లో 31; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్, సూర్య కలిసి మరింత దూకుడుగా ఆడారు. 43 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 311/4. ఈ దశలో సూర్య మెరుపు బ్యాటింగ్‌తో ఇండోర్ దద్దరిల్లింది. తర్వాతి 7 ఓవర్లలో భారత్ 88 పరుగులు చేయగా... అందులో సూర్య ఒక్కడే 68 పరుగులు సాధించడం విశేషం. 24 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు.

అశ్విన్‌కు 3 వికెట్లు...

ఛేదనలో ఆసీస్ ఆరంభంలోనే తడబడింది. ప్రసిధ్ తన తొలి ఓవర్లోనే వరుస బంతుల్లో షార్ట్ (9), స్మిత్ (0)లను అవుట్ చేసి దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత వార్నర్, లబుషేన్ (27) కలిసి మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే వీరిద్దరితో పాటు ఇన్‌గ్లిస్ (6)ను 12 పరుగుల వ్యవధిలో అశ్విన్ అవుట్ చేయడంతో ఆసీస్ కోలుకోలేకపోయింది. ఆఖర్లో సీన్ అబాట్, హాజల్‌వుడ్ (23) కలిసి తొమ్మిదో వికెట్‌కు 44 బంతుల్లోనే 77 పరుగులు జోడించి పోరాడినా లక్ష్యానికి జట్టు చాలా దూరంలో ఆగిపోయింది.


సూర్యకుమార్

వరుసగా 4 సిక్సర్లు...

గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో రాణించిన సూర్యకుమార్ ఈసారి తన అసలైన 360 డిగ్రీ ఆటను ప్రదర్శించాడు. ముఖ్యంగా గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ 44వ ఓవర్లో అతను అద్భుత షాట్లతో చెలరేగాడు. తొలి నాలుగు బంతులను అతను లాంగ్ లెగ్, ఫైన్ లెగ్, కవర్స్, డీప్ మిడ్‌వికెట్ మీదుగా సిక్సర్లుగా మలచడం విశేషం. ఆట చూస్తే తర్వాతి రెండు బంతులూ సిక్సర్లుగా మారతాయేమో అనిపించింది. అయితే గ్రీన్ రెండు చక్కటి బంతులతో కట్టడి చేయడంలో సఫలమయ్యాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) క్యారీ (బి) హాజల్‌వుడ్ 8; గిల్ (సి) క్యారీ (బి) గ్రీన్ 104; శ్రేయస్ (సి) షార్ట్ (బి) అబాట్ 105; రాహుల్ (బి) గ్రీన్ 52; ఇషాన్ కిషన్ (సి) క్యారీ (బి) జంపా 31; సూర్యకుమార్ (నాటౌట్) 72; జడేజా (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 399. వికెట్ల పతనం: 1-16, 2-216, 3-243, 4-302, 5-355. బౌలింగ్: స్పెన్సర్ 8-0-61-0, హాజల్‌వుడ్ 10-0-62-1, అబాట్ 10-0-91-1, గ్రీన్ 10-0-103-2, జంపా 10-0-67-1, షార్ట్ 2-0-15-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: షార్ట్ (సి) అశ్విన్ (బి) ప్రసిధ్ 9; వార్నర్ (ఎల్బీ) (బి) అశ్విన్ 53; స్మిత్ (సి) గిల్ (బి) ప్రసిధ్ 0; లబుషేన్ (బి) అశ్విన్ 27; ఇన్‌గ్లిస్ (ఎల్బీ) (బి) అశ్విన్ 6; క్యారీ (బి) జడేజా 14; గ్రీన్ (రనౌట్) 19; అబాట్ (బి) జడేజా 54; జంపా (బి) జడేజా 5; హాజల్‌వుడ్ (బి) షమీ 23; స్పెన్సర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (28.2 ఓవర్లలో ఆలౌట్) 217. వికెట్ల పతనం: 1-9, 2-9, 3-89, 4-100, 5-101, 6-128, 7-135, 8-140, 9-217, 10-217. బౌలింగ్: షమీ 6-0-39-1, ప్రసిధ్ 6-0-56-2, అశ్విన్ 7-0-41-3, శార్దుల్ 4-0-35-0, జడేజా 5.2-0-42-3.

వార్నర్ రైట్ హ్యాండర్‌గా...

ఆసీస్ ఇన్నింగ్స్ 13వ ఓవర్లో వార్నర్ అనూహ్యంగా గార్డ్ తీసుకొని మరీ పూర్తి స్థాయి 'రైట్ హ్యాండ్' బ్యాటర్‌గా ఆడాడు. అశ్విన్ వేసిన ఈ ఓవర్లో ఒక చక్కటి ఫోర్ సహా అతను 6 పరుగులు చేశాడు. అయితే అశ్విన్ తర్వాతి ఓవర్లోనూ ఇలాగే దిగి లెఫ్ట్ హ్యాండర్ తరహాలో రివర్స్ స్వీప్ ఆడబోయి తొలి బంతికే ఎల్బీగా అవుటయ్యాడు. వార్నర్ దీనిని రివ్యూ చేయకపోగా, రీప్లేలో బంతి అతని బ్యాట్‌ను తాకినట్లు తేలింది.



ఇండియన్ జీపీ విజేత బెజెకీ



న్యూఢిల్లీ: భారత్ వేదికగా తొలిసారి జరిగిన ఇండియన్ గ్రాండ్‌ప్రి మోటో జీపీ రేసులో ఇటలీకి చెందిన మార్కో బెజెకీ చాంపియన్‌గా నిలిచాడు. మూనీ వీఆర్46 రేసింగ్ జట్టు తరఫున బరిలోకి దిగిన బెజెకీ 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించాడు. 21 ల్యాప్‌లతో కూడిన 105.21 కిలోమీటర్ల దూరాన్ని బెజెకీ అందరికంటే వేగంగా 36 నిమిషాల 59.1570 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బెజెకీకి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విన్నర్స్ ట్రోఫీని అందజేశారు. ఇక్కడి బుద్ధ్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఆదివారం జరిగిన ఈ రేసులో మొత్తం 20 మంది రేసర్లు పాల్గొన్నారు. తొలి మలుపు ముగిశాక బెజెకీ మూడో స్థానంలో ఉన్నా... రేసు కొనసాగుతున్నకొద్దీ ప్రత్యర్థులను వెనక్కి నెట్టాడు. జార్జి మార్టిన్ (స్పెయిన్; ప్రైమా ప్రామిక్ రేసింగ్) రెండో స్థానంలో, ఫాబియో క్వార్టారారో (ఫ్రాన్స్; మాన్‌స్టర్ ఎనర్జీ యామహా మోటో జీపీ) మూడో స్థానంలో నిలిచారు.

వెర్‌స్టాపెన్‌దే విజయం

రెడ్‌బుల్ జట్టుకు ఎఫ్1 టీమ్ టైటిల్

సుజుకా (జపాన్): ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో వరుసగా 14 రేసుల్లో గెలిచి 15వ రేసులో ఓటమి రుచి చూసిన రెడ్‌బుల్ జట్టు మళ్లీ గెలుపు బాట పట్టింది. ఆదివారం జరిగిన సీజన్‌లోని 16వ రేసు జపాన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 53 ల్యాప్‌లను ఒక గంట 30 నిమిషాల 58.421 సెకన్లలో ముగించి అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 13వ విజయం. నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, ఆస్కార్ (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. మొత్తం 20 మంది డ్రైవర్లు రేసును ఆరంభించి ఐదుగురు ముగించలేకపోయారు. తాజా గెలుపుతో రెడ్‌బుల్ జట్టు సీజన్‌లో మరో ఆరు రేసులు మిగిలి ఉండగానే 623 పాయింట్లతో టీమ్ టైటిల్‌ను ఖరారు చేసుకుంది. డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో వెర్‌స్టాపెన్ 400 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... పెరెజ్ (రెడ్‌బుల్) 223 పాయింట్లతో రెండో స్థానంలో, హామిల్టన్ (మెర్సిడెస్) 223 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. తదుపరి రేసు ఖతర్ గ్రాండ్‌ప్రి అక్టోబర్ 8న జరుగుతుంది.



సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
25-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
221	68
66,009	19,674

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	13,212	▽	12
డోజోన్స్	33,964	▽	107
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	△	5
డాక్స్	15,557	▽	15
షాంఘై	3,132	△	48
నికాయ్	32,397	▽	222

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.10	83.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.19	103.52
€	యూరో	ఎస్‌బీఐ	86.81	89.91
¥	జపాన్ ఎన్(100)	ఎస్‌బీఐ	55.12	56.85
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.17	54.51
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.72	61.66
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హమ్	థామస్‌కుక్	21.68	23.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.31

వృద్ధాప్యంలో సంక్షోభానికి దూరంగా..

• భారంగా మారుతున్న ఆరోగ్య సంరక్షణ • వ్యయాలకు ముందు నుంచే తగిన ప్రణాళిక • హెల్త్ ఇన్సూరెన్స్, క్రిటికల్ కేర్ అవసరం • ప్రత్యేక అత్యవసర నిధి ఉండాలి • భవిష్యత్ ఆర్థిక సవాళ్లకు ముందే సన్నద్ధత

ప్రతి కుటుంబానికి సమగ్ర ఆర్థిక ప్రణాళిక ఉండాలి. కుటుంబ లక్ష్యాలు అన్నింటికీ ఇందులో చోటు కల్పించుకోవడం ఎంతో అవసరం. స్కూల్, కాలేజీ ఫీజులు, విదేశీ విద్య, జీవిత, ఆరోగ్య బీమా పథకాలు, అత్యవసర నిధి, విహార, పర్యాటక యాత్రలు ఇలా అన్నింటికీ చోటు కల్పించుకోవాలి. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని, ఈ లక్ష్యాలు అన్నింటికీ కావాల్సిన మేర సమకూర్చుకునేందుకు వీలుగా తగిన పెట్టుబడుల ప్రణాళిక రూపొందించుకోవాలి. అందరూ కాకపోయినా కొందరు అయినా దీన్ని అనుసరిస్తుంటారు. కాకపోతే ఎక్కువ మంది ఇక్కడ విస్మరించే విషయం ఒకటి ఉంది. తమపై ఆధారపడిన వృద్ధాప్య తల్లిదండ్రుల సంరక్షణను ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోరు. దీన్ని ఒక లక్ష్యంగా చూడరు. గతంతో పోలిస్తే వృద్ధాప్యంలో సంరక్షణ వ్యయాలు గణనీయంగా పెరిగాయి. కనుక ప్రతి ఒక్కరి ఆర్థిక ప్రణాళికలో దీనికి తప్పకుండా చోటు ఉండాల్సిందే. లేదంటే ఆర్థిక సంక్షోభాన్ని ఆహ్వానించినట్టు అవుతుంది..



పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు

అతిపెద్ద ఆర్థిక వ్యయంతో కూడుకున్న లక్ష్యాల్లో వృద్ధాప్య సంరక్షణ (జెరియాట్రిక్ కేర్) ఒకటి. అయినా, అధిక శాతం మంది ఆర్థిక ప్రణాళికల్లో దీనికి చోటు ఉండదు. వృద్ధుల సంక్షేమం కోసం ఎంత ఖర్చు అవుతుందన్న అవగాహన కూడా ఉండడం లేదు. ఇది ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటుంది. వృద్ధులైన తల్లిదండ్రులు తమతోనే ఉంటున్నారా? లేక మరో చోట నివసిస్తున్నారా? లేక వృద్ధాశ్రమంలో చేరారా? వారికి ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? లేదంటే వారికి సంరక్షకులను ఏర్పాటు చేయాలా? వారికి పింఛను సదుపాయం ఉందా లేక ఇతరత్రా వేరే రూపంలో ప్రతి నెలా ఆదాయం వచ్చే ఏర్పాటు ఉందా? ఇలాంటి అంశాలన్నింటి ఆధారంగా వృద్ధుల సంక్షేమం కోసం ఏ విధంగా సన్నద్ధం కావాలనేది తేల్చుకోవచ్చు. వృద్ధాప్య సంరక్షణ ఇంత కాలం పాటు, నిర్దిష్ట సమయం అని నిర్ణయించుకోవడం కష్టం. వృద్ధులైన తల్లిదండ్రులకు ఇప్పుడు ప్రత్యేక సంరక్షణ అవసరం పడకపోవచ్చు. అలా అని ముందు ముందు వయసు మీద పడితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో తెలియదు. అప్పుడు ప్రత్యేక సంరక్షకుల అవసరం ఏర్పడొచ్చు. దీనికి ఎంత వ్యయం అవుతుందన్నది ముందుగా అంచనా వేయలేం.

నేడు ఆరోగ్య సంరక్షణ వ్యయాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. సామాజిక భద్రత ఉండడం లేదు. నేటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చూస్తే వృద్ధుల సంక్షేమం అతిపెద్ద ఆర్థిక లక్ష్యాల్లో ఒకటిగా మారిపోయింది. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన దత్తాత్రేయ తల్లికి కిడ్నీల సమస్య ఉంది. కిడ్నీల డయాలసిస్, ఇతర చికిత్సా వ్యయాల కోసం రూ.80,000 వరకు ప్రతి నెలా ఖర్చు చేయాల్సి వస్తోంది. గతేడాది వరకు కేవలం ఔషధాల వరకే ఖర్చు అయ్యేది. కానీ, కిడ్నీల సమస్య మరింత తీవ్రతరం కావడంతో వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. ఒక్క సెషన్‌కు రూ.3,000 ఖర్చు అవుతోంది. ఇక దత్తాత్రేయ తల్లి మృణాళిని టెస్ట్‌లు, వైద్యుల కన్సల్టేషన్ కోసం ఏటా మరో రూ.లక్ష ఖర్చు చేస్తున్నారు. నిజానికి దత్తాత్రేయకు పనిచేసే సంస్థ అందిస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్ ఉంది. ఇప్పటి వరకు బీమా కంపెనీ మృణాళిని వైద్య ఖర్చుల భారం మోస్తోంది. కాకపోతే ఇటీవల డయాలసిస్, ఇతర

ఎన్నో నిదర్శనాలు..

వ్యయాలు పెరిగిన నేపథ్యంలో కవరేజీ చాలడం లేదు. సొంతంగా తమ వంతు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక పట్టణాల్లో తల్లిదండ్రుల సంక్షేమ వ్యయాలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. అందులోనూ తల్లిదండ్రులు ఒకచోట, పిల్లలు మరో చోట నివసిస్తుంటే, వారికి అదనపు వ్యయాలతో పాటు ఇతరత్రా సవాళ్లు ఎదురవుతుంటాయి. ఇందుకు ముంబైకి చెందిన భట్టాచార్యే నిదర్శనం. ఆయన తల్లిదండ్రులు కోల్‌కతాలో నివసిస్తున్నారు. వారి సంరక్షణ బాధ్యతలు ఏకైక కుమారుడైన దత్తాత్రేయపైనే ఉన్నాయి. వాటిని ఆయన నెరవేరుస్తున్నారు కూడా. కాకపోతే తాను నివస్తున్న పట్టణానికి దూరంగా తల్లిదండ్రులు ఉంటుండడం, పైగా తల్లి కేన్సర్‌తో బాధపడుతూ పూర్తి స్థాయిలో సొంతంగా నడవలేకపోతుండడం సవాలుగా మారింది. దీంతో ఆమెకు తన కుమారుడి నుండి భౌతిక సాయం కూడా అవసరమవుతోంది. దీంతో భట్టాచార్య ముంబై నుంచి కోల్‌కతాకు తరచూ వెళ్లి రావాల్సి వస్తోంది. తనతో పాటు ఆస్పత్రికి వెళ్లి రావడానికి అమ్మ సౌకర్యంగా భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. తన తల్లిదండ్రులను ముంబైకి మార్చుదామంటే ఆర్థికంగా అది సులువైన నిర్ణయం కాదని అతడికి తెలుసు. కోల్‌కతాలో అయితే వారి సంరక్షణకు నెలకు రూ.60,000–65,000 ఖర్చు అవుతోంది. ముంబైకి మారిస్తే రూ.లక్ష ఖర్చు చేయాల్సి వస్తుంది. ముంబైలో జీవన వ్యయాలు ఎక్కువ. ఇప్పుడు కాకపోతే మరికొంత కాలం తర్వాత అయినా తన తల్లిదండ్రులను ముంబైకి తీసుకురావడం ఒక్కటే ఆయన ముందున్న ఆప్షన్. ఏడాది క్రితం వరకు తల్లిదండ్రుల ఔషధాలకు నెలకు రూ.30,000 ఖర్చు అయితే, ఇప్పుడు రూ.45,000కు పెరిగింది. తమపై ఆధారపడిన లేదంటే భవిష్యత్తులో తమ సంరక్షణ అవసరం పడే తల్లిదండ్రులు ఉంటే, వారి కోసం ముందు నుంచే ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ఈ నిదర్శనాలు తెలియజేస్తున్నాయి.

అస్పష్ట సవాళ్లు

ఆర్థికంగా పడే భారాన్ని అధిగమించడం ఒక్కటే కాదు, ఇతర సవాళ్లు కూడా ఎదురుకావచ్చు. ఢిల్లీకి చెందిన మంజీత్ తండ్రికి శస్త్రచికిత్స తర్వాత ఆస్పత్రిలోనే చాలా రోజులు ఉండాల్సి వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రి కావడంతో రాత్రి సమయాల్లో సంరక్షణ చూసేందుకు ఒక వార్డ్ బోయ్ ఉంటే బాగుంటుందని అనిపించింది. ప్రభుత్వ హాస్పిటల్ కావడంతో ప్రతి రోగికి విడిగా ఒక్కో వార్డ్ బోయ్ లేదా కేర్‌టేకర్ ఏర్పాటు సదుపాయం ఉండదు. దీంతో ప్రైవేటుగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేసుకోవడం మినహా వేరే మార్గం కనిపించలేదు. అందుకు అర్హత కలిగిన వ్యక్తిని గుర్తించడం, వారి చార్జీలు చెల్లించడం కష్టమైన టాస్క్‌గా మారింది. కొన్ని పేరొందిన ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ వ్యయాలు 40–50 శాతం అధికంగా ఉంటాయి. వృద్ధాప్య సంరక్షణ కేంద్రాల్లో ఈ సేవలు అన్నీ అందుబాటులో ఉంటాయి. కానీ, తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో, అనారోగ్యంతో ఉన్నప్పుడే వేరే కొత్త ప్రాంతానికి మారిస్తే.. వారు ఒంటరితనంతో వేదనకు గురవుతారు. పైగా తమ పిల్లలు అలక్ష్యం చేస్తున్నారనే బాధ కూడా ఉంటుంది. బంధు మిత్రుల నుంచి ఈ విషయంలో అవహేళనలు కూడా ఎదురుకావచ్చు. కొన్ని ప్రముఖ పట్టణాల్లో సర్జరీల తర్వాత వృద్ధుల కోసం తాత్కాలిక సంరక్షణ కేంద్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక్కడ సర్జరీ అనంతరం కావాల్సిన సేవలను 3–8 వారాల పాటు అందిస్తారు. ప్రత్యేక రూమ్, నర్స్, అటెండెంట్ తదితర సేవలు పొందొచ్చు. వైద్యులు కూడా వచ్చి చూసి వెళుతుంటారు. కైట్స్ సీనియర్ కేర్‌తోపాటు కేర్ హాస్పిటల్ తదితర కొన్ని సంస్థలు ఈ తరహా సేవలను ఆఫర్ చేస్తున్నాయి. కాకపోతే రోజువారీ రూ.3,000–4,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. వృద్ధులకు ఉన్న సమస్యల ఆధారంగా ఈ వ్యయం మారుతుంది. భార్యా, భర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే వారిపై ఆధారపడిన పెద్దలకు తాత్కాలికంగా ఇలాంటి కేంద్రాల్లో సేవలు అందించొచ్చు. ఒకవైపు భవిష్యత్తులో పెద్దల సంక్షేమం కోసం అయ్యే వ్యయాలకు ప్రణాళిక రూపొందించుకోవడం ఎంత ముఖ్యమో.. భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా సన్నద్ధం కావడం కూడా అంతే అవసరం.



ప్రణాళిక ఎలా..?

తమపై తల్లిదండ్రులు ఆధారపడి ఉంటే, వారి కంటూ హెల్త్ ఇన్సూరెన్స్ ముందుగా తీసుకోవాలి. వీలైతే 45 ఏళ్లలోపు, అది వీలు పడకపోతే 60 ఏళ్లలోపు తప్పకుండా తీసుకోవాలి. దీంతో ఏదైనా ఆరోగ్య సమస్యతో వారు హాస్పిటల్‌లో చేరితే, అయ్యే వ్యయాన్ని హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీయే భరిస్తుంది. ముఖ్యంగా కుటుంబ ఆర్థిక చరిత్ర గురించి ఒక్కసారి విశ్లేషించుకోవాలి. తల్లిదండ్రులను అడిగి, వారి తల్లిదండ్రులు, సోదరుల్లో ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయనేది తెలుసుకోవాలి. ముఖ్యంగా మధుమేహం, ఆర్థరైటిస్, డిమెన్షియా, గుండె జబ్బులు, కేన్సర్, స్ట్రోక్ తదితర సమస్యలు ఉన్నాయేమో విచారించాలి. క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌ను కూడా తీసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా డయాలసిస్, ఓరల్ కీమో థెరపీ తదితర చికిత్సలకు డేకేర్ కింద కవరేజీ ఉండేలా చూసుకోవాలి. అలాగే, హోమ్‌కేర్ కవర్ కూడా ఉండాలి. దీనివల్ల ఇంట్లో ఉండి చికిత్స తీసుకుంటే బీమా కంపెనీ నుంచి క్లెయిమ్ పొందొచ్చు. అయినప్పటికీ ఇంట్లో అటెండెంట్, హోమ్ నర్స్, మెడికల్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాల్సి వస్తే అందుకే అయ్యే చార్జీలను కంపెనీలు చెల్లించవు. నెలకు ఒక అటెండెంట్ సేవలు పొందేందుకు మెట్రోల్లో అయితే రూ.25,000–30,000, చిన్న పట్టణాల్లో అయితే రూ.15,000–20,000 వరకు ఖర్చు అవుతుంది. ఇంటి వద్దే నర్స్ సేవల కోసం నెలవారీ వ్యయాలు 25–40 శాతం అధికంగా అవుతాయి. అందుకే ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవడం వల్ల తర్వాత ఆర్థికంగా సతమతం కాకుండా ఉంటుంది. ఎందుకంటే వృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం రూపంలో ఖర్చులు ఎదురైన సమయంలోనే పిల్లల ఉన్నత విద్య, ఇతర కీలక లక్ష్యాలు తారసపడతాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం ఎంత అవసరమో.. తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అత్యవసర నిధిని కూడా సమకూర్చుకోవడం అంతే అవసరమనేది ఆర్థిక నిపుణుల సూచన. నిజానికి తల్లిదండ్రుల కోసం కొంత ఫండ్‌ను సిద్ధంగా ఉంచుకునే వారు అరుదుగా కనిపిస్తారు. అవసరం అయితే జీవన వ్యయాలను కొంత తగ్గించుకుని అయినా, తమపై ఆధారపడి వారి కోసం అత్యవసర నిధిని సమకూర్చుకోవాలే కానీ, వాయిదా వేయరాదని నిపుణుల సూచన. కనుక తల్లిదండ్రులు లేదా తమపై ఆధారపడిన అత్త మామల వృద్ధాప్య సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి.

భారత్‌లో ఉత్పత్తి 5 రెట్లు పెంపు

యాపిల్ ప్రణాళికలు



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని 5 రెట్లు పైగా పెంచుకోవాలని యోచిస్తోంది. వచ్చే 4–5 ఏళ్లలో 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 3.32 లక్షల కోట్లు) విలువ చేసే ఉత్పత్తులను తయారు చేయాలని భావిస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యాపిల్ గతేడాది 7 బిలియన్ డాలర్ల ఉత్పత్తి మార్కును అధిగమించినట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతానికైతే ఐటీ హార్డ్‌వేర్ ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్‌ఐ)లో భాగమయ్యే యోచనేది యాపిల్‌కు లేవని వివరించాయి. ఇప్పటికైతే ఉత్పత్తిని పెంచుకోవడంపైనే కంపెనీ దృష్టి పెడుతోందని, రాబోయే రోజుల్లో పీఎల్‌ఐ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండొచ్చని పేర్కొన్నాయి. యాపిల్ ప్రస్తుతం భారత్‌లో ఐఫోన్లను తయారు చేస్తుండగా, వచ్చే ఏడాది నుంచి ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తి కూడా ప్రారంభించే యోచనలో ఉంది. ఇప్పటికైతే ఇక్కడ ఐప్యాడ్స్ లేదా ఇతరత్రా ల్యాప్‌టాప్‌లను తయారు చేసే ఆలోచనేదీ కంపెనీకి లేనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది సెప్టెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో యాపిల్ అంతర్జాతీయంగా 191 బిలియన్ డాలర్ల విలువ చేసే ఐఫోన్లను విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో ఐఫోన్ విక్రయాలు సుమారు 4 శాతం తగ్గి 157 బిలియన్ డాలర్ల స్థాయిలో నమోదయ్యాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-9-2023	
విశాఖ	528–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	528–00
విజయవాడ	528–00
రిటైల్ ధర (డజను)	72.00
24-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	511–00
వరంగల్	513–00
రిటైల్ ధర	5.60

స్టాక్స్ వ్యూ

డేటా ప్యాటర్న్స్ | ఇన్‌క్రెడ్ ఈక్విటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,066
టార్గెట్: రూ. 3,000

ఎందుకంటే: అధిక వృద్ధి బాటలో ఉన్న కంపెనీ డేటా ప్యాటర్న్స్ (ఇండియా) నిలకడైన మార్జిన్లను సాధిస్తోంది. రిటర్నుల రేషియోలనూ మెరుగుపరచుకుంటోంది. మధ్యకాలంలో కంపెనీ ఇదే తరహా పనితీరును ప్రదర్శించే వీలున్నట్లు భావిస్తున్నాం. ఇప్పటికే పూర్తి చేయవలసిన భారీ ఆర్డర్లకుతోడు మరిన్ని కాంట్రాక్టులు పైప్‌లైన్‌లో ఉండటం కంపెనీకి బలాన్నిస్తోంది. సొంత ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, ఎగుమతులు వంటి అంశాలు వృద్ధికి, మార్జిన్ల పటిష్టతకు సహకరించనున్నాయి. 2023 మార్చికల్లా ఆర్డర్ బుక్ విలువ దాదాపు రెట్టింపునకు చేరింది. గత 12 నెలల టర్నోవర్‌తో పోలిస్తే రెట్టింపుకాగా.. డైవర్సిఫైడ్ ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది. దీనిలో ప్రొడక్షన్ 31 శాతం, డెవలప్‌మెంట్ 64 శాతం, సర్వీసులు 5 శాతం చొప్పున ఆక్రమిస్తున్నాయి. మార్కెట్లో మరింత విస్తరించే బలమైన కాంక్షను ప్రదర్శిస్తున్న కంపెనీ రానున్న మూడేళ్లలో రూ. 3,000 కోట్ల విలువైన కాంట్రాక్టులపై కన్నేసింది. మ్యాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీలో విస్తరణ, సగటున 20ఏళ్లకుపైగా అనుభవంగల యాజమాన్య టీమ్ కంపెనీ భవిష్యత్ పురోగతికి దోహదపడనున్నాయి. వెరసి మూడేళ్ల కాలం(2023–26)లో కంపెనీ వార్షిక ప్రాతిపదికన అమ్మకాలు 38 శాతం, షేరువారీ ఆర్జన(ఈపీఎస్) 45 శాతం చొప్పున వృద్ధి చెందగలవని అంచనా. ఫలితంగా 2025–26 ఏడాదికల్లా 22 శాతం ఆర్‌వోఈ, ఆర్‌వోసీఈలను సాధించవచ్చని భావిస్తున్నాం. అయితే కొత్త ఆర్డర్లను పొందడంలో వెనుకబాటు, అంచనాలు అందుకోని మార్జిన్లు, ప్రభుత్వ బడ్జెట్‌లో కోతలు లేదా ప్రభుత్వ వ్యయాల ఆలస్యం వంటి అంశాలు కంపెనీగల రిస్కులుగా పేర్కొనవచ్చు.



ఎన్ఎండీసీ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 143
టార్గెట్: రూ. 180

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ అమ్మకాల పరిమాణం 32–40 మిలియన్ టన్నులను అధిగమించవచ్చని అంచనా. 2030కల్లా 100 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్య ప్రణాళికల నేపథ్యంలో దీర్ఘకాలిక అమ్మకాల్లో వృద్ధి నమోదయ్యే అవకాశముంది. ఒడిషాలోని వాణిజ్య మైనింగ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోనందున భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలకు దారి చూపనుంది. దీంతో ప్రస్తుతం 22 శాతంగా నమోదవుతున్న ఆర్‌వోఈ మరింత మెరుగుపడేందుకు ఆస్కారముంది. స్టీల్ ప్లాంటును విడదీయడం ద్వారా మైనింగ్‌కు ప్రాధాన్యం పెరగడం ఇందుకు దోహదం చేయనుంది. గతేడాది వరకూ సాధించిన అమ్మకాలు, పెరగనున్న ఉత్పత్తుల ధరలు వంటి అంశాల నేపథ్యంలో వార్షిక ప్రాతిపదికన నిర్వహణ లాభం ఈ ఆర్థిక సంవత్సరంలో 22 శాతం, వచ్చే ఏడాది(2024–25) 38 శాతం చొప్పున పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నాం. ఈ ఏడాది తొలి త్రైమాసిక(ఏప్రిల్–జూన్) ఫలితాల సందర్భంగా కంపెనీ యాజమాన్యం పూర్తి ఏడాదికి 47–50 మిలియన్ టన్నుల అమ్మకాలను అంచనా వేసింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి కర్ణాటకలోని డోనిమలై మైన్స్‌కు పెరిగిన ఈసీ లిమిట్ అమలులోకి రానుండటం ఇందుకు మద్దతివ్వనుంది. అయితే అంచనాలకంటే తక్కువగా అమ్మకాల పరిమాణం నమోదుకావడం, ముడిఇనుము ధరలు పడిపోవడం వంటి అంశాలు కంపెనీగల ప్రధాన రిస్కులుగా భావించవచ్చు. ఇటీవల ప్రభుత్వం విధించిన ఎగుమతి సుంకం కంపెనీకి ప్రతికూలమని చెప్పవచ్చు.



నామినీలను తెలిపేందుకు ఈ నెల 30 వరకు డెడ్‌లైన్

• డీమ్యాట్, ఎంఎఫ్ ఖాతాదారులకు సెబీ నిబంధన



న్యూఢిల్లీ: వ్యక్తిగత డీమ్యాట్‌హోల్డర్లు, మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు తమ ఖాతాలకు సంబంధించి లబ్ధిదారులను నామినేట్ చేసేందుకు గడువు సెప్టెంబర్ 30తో ముగియనుంది. ఆలోగా నామినేట్ చేసేందుకు లేదా నామినీల పేర్లను ఉపసంహరించుకునేందుకు ఉద్దేశించిన డిక్లరేషన్ ఫారంను సమర్పించకపోతే ఆయా డీమ్యాట్ ఖాతాలు, ఫోలియోలను ఫ్రీజ్ చేయనున్నారు. దీంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను రిడీమ్ చేసుకోలేని పరిస్థితి తలెత్తుతుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రకారం ఈ నిబంధన కొత్త, పాత ఇన్వెస్టర్లు అందరికీ వర్తిస్తుంది. ఏదైనా దురదృష్టకరమైన సంఘటన జరిగితే ఇన్వెస్టర్లు తమ సెక్యూరిటీస్‌ను చట్టబద్ధమైన వారసులకు ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా బదిలీ అయ్యేలా చూసేందుకు ఇది ఉపయోగపడగలదని ఫైయర్స్ సహ–వ్యవస్థాపకుడు తేజస్ ఖోడే తెలిపారు.


రెండవసారి పొడిగింపు

ఇన్వెస్టర్లు తమ నామినీల పేర్లను ఇచ్చేందుకు 2022 మార్చి 31 వరకు గడువునిస్తూ 2021 జూలైలో సెబీ తొలిసారిగా నిబంధనను రూపొందించింది. ఆ తర్వాత దాన్ని 2022 మార్చి వరకు, అటు పైన 2023 మార్చి 31 వరకు పొడిగించింది. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు మరోసారి సెప్టెంబర్ 30 నాటికి పెంచింది. నామినీలను సూచించకుండా పలువురు ఇన్వెస్టర్లు గతంలో ఖాతాలు తెరిచిన నేపథ్యంలో వారికి ఏదైనా జరిగితే సదరు సెక్యూరిటీలను పొందడంలో వారసులకు సమస్యలు ఎదురవుతున్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. సెబీ తాజా డెడ్‌లైన్‌తో ఇలాంటి పరిస్థితి ఉండదని పేర్కొన్నారు.

రియల్ ఎస్టేట్ మెరుగైన పెట్టుబడి సాధనమేనా?

ఫ్లెక్సీక్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్.. ఒకేసారి, ఒకటికి మించిన ఫండ్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?
- వెంకటరమణ

మీరు సంక్లిష్టతను ఇష్టపడే వారు అయితే ఒకటికి మించిన విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే నిర్ణీత కాలానికి ఒకసారి పోర్ట్‌ఫోలియోని రీబ్యాలన్స్ (సమీక్ష/మార్పులు, చేర్పులు) చేసుకోవడం మర్చిపోవద్దు. ఇలా ఎన్నో విభాగాల మధ్య పెట్టుబడులను వర్గీకరించినప్పుడు అది గజిబిజీగా, పన్ను పరంగా అనుకూలం కాకపోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. ఎందుకంటే ఈ పథకాలు వివిధ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల్లో (స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్) ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాకపోతే ఆయా విభాగాలకు కేటాయించే మొత్తం పథకాలను బట్టి వేర్వేరుగా ఉండొచ్చు. సాధారణంగా ఫ్లెక్సీక్యాప్ పథకాలు తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో 70–75 శాతాన్ని లార్జ్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మిగిలిన పెట్టుడులను మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాలకు కేటాయిస్తుంటాయి. కనుక మీరు రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఫ్లెక్సీక్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక మీరు విడిగా లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం లేదు. పెట్టుబడుల విషయంలో మరింత దూకుడుగా, రిస్క్ తీసుకునే వారు, ఫ్లెక్సీక్యాప్‌నకు అదనంగా 10–15 శాతం పెట్టుబడులను మిడ్, స్మాల్‌క్యాప్‌నకు కేటాయించుకోవడం ద్వారా దీర్ఘకాలంలో అధిక రాబడులు సొంతం చేసుకోవచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పెట్టుబడికి రియల్ ఎస్టేట్ మెరుగైన సాధనమేనా? ఇతర ఉత్పత్తులతో దీన్ని ఎలా పోల్చి చూడాలి?
- శివమ్

రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడి సాధనంగా నేను భావించడం లేదు. ఇల్లును ఒక కుటుంబం నివసించేందుకే గానీ, పెట్టుబడిగా చూడకూడదు. ఒక్కసారి ఇల్లు కొనుగోలు చేసి, దానిలో నివసిస్తుంటే విలువ పెరుగుతుందా? లేక తగ్గుతుందా అన్నది పట్టించుకునే విషయం కాదు. పెట్టుబడిగా రియల్ ఎస్టేట్‌కు కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. పెట్టబడి పరిమాణం అధికంగా కావాల్సి ఉంటుంది. ఇతర సాధనాలతో పోలిస్తే లిక్విడిటీ (నగదుగా మార్చుకునే సౌలభ్యం) తక్కువగా ఉంటుంది. దీంతో కోరుకున్నప్పుడు విక్రయించుకునే వీలు ఉండకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడిలో సవాళ్లు ఉంటాయి. మరో కోణం నుంచి చూస్తే.. ప్రాపర్టీని అద్దెకు ఇస్తే క్రమం తప్పకుండా అద్దె రూపంలో ఆదాయం వస్తుంది. కిరాయిదారు రూపంలో ఇంటి నిర్వహణ సక్రమంగా ఉండొచ్చు. అలా చూస్తే ఇల్లు మంచి పెట్టుబడే అవుతుంది. ఎందుకంటే ద్రవ్యోల్బణంతోపాటే అద్దె కూడా పెరుగుతూ వెళుతుంది. అదే సమయంలో ప్రతికూలతలూ కనిపిస్తాయి. ఇల్లు ఎంత గొప్పది అయినా 20 ఏళ్ల తర్వాత డిమాండ్ తగ్గుతుంది. అద్దెకు ఉండేవారు అధునికమైన, కొత్త ఇంటి కోసం ప్రాధాన్యం ఇస్తుంటారు. కనుక రియల్ ఎస్టేట్ విలువ పెరిగినా కానీ, దానికి అనుగుణంగా అద్దె రాబడి మెరుగ్గా ఉండదు. అందుకే ప్రాపర్టీని కొనుగోలు చేసే ముందు ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలి. నా సలహా ఏమిటంటే రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడిగా కాకుండా నివాసంగానే చూడండి.

జగనన్న ఆరోగ్య సురక్ష




పశ్చిమగోదావరి జిల్లా బలుసుమూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



విజయవాడ లంబాడీపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని



శ్రీకాకుళం జిల్లా టెక్కలి రోటరీనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



గుంటూరు జిల్లా తెనాలి పట్టణం ముత్తెంశెట్టిపాలెంలో వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులోని విఘ్నేశ్వరపురం కాలనీలో బీపీ పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది



అన్నమయ్య జిల్లా పీలేరు మండలం తలపుల, రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అగ్రి బీఎస్సీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశాలకు ఇంతకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు మొదటి వెబ్ ఆప్షన్స్‌ను ఈ నెల 27వ తేదీ నుంచి 30 వరకు నమోదు చేసుకోవాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆప్షన్‌ల ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు అక్టోబర్ 5 నుంచి 7 వరకు సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు www.angrau.ac.in ను చూడాలని తెలిపారు.

3 నుంచి ఎఫ్‌ఏ 2 పరీక్షలు

సాక్షి, అమరావతి: ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)–2 పరీక్షలు అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం ఉమ్మడి ప్రశ్నపత్రం ఉంటుందని, పరీక్షలు ఓఎంఆర్ కాకుండా పాతపద్ధతిలోనే ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఆయా ప్రశ్నపత్రాలను పరీక్ష జరిగే రోజు వాట్సాప్ ద్వారా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల గ్రూపులకు పంపిస్తామని, పరీక్షకు గంట ముందు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

సాగుకూ ఏఐ సాయం!

- వ్యవసాయ రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిశోధనలు
- కలుపు తీసే రోబోట్ల మీద ప్రయోగాలు.. ఇప్పటికే అందుబాటులోకి రోబో డ్రోన్లు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఇప్పుడు ప్రపంచం మొత్తం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) వైపు చూస్తోంది. ఇప్పటికే అన్ని రంగాల్లోనూ ఏఐ తన ప్రభావం చూపిస్తోంది. తాజాగా వ్యవసాయ రంగంలోనూ అడుగుపెట్టనుంది. ఈ రంగంలోని అన్ని విభాగాల్లో కృత్రిమ మేధను అమలు చేయడానికి గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అడుగులేస్తోంది. ఇప్పటికే కలుపు తీసే రోబోట్లపైన ప్రయోగాలు చేస్తోంది. ఇవి పూర్తయ్యాక పూర్తి స్థాయిలో కృత్రిమ మేధను అమల్లోకి తేవాలని నిర్ణయించింది.

రైతులకు ప్రయోజనకరం ఏఐ..

మనదేశంలో ఉన్న 143 మిలియన్ హెక్టార్లలో వ్యవసాయం చేయడానికి అవసరమైనంత మంది రైతులు అందుబాటులో ఉండటం లేదు. యువతరానికి వ్యవసాయం మీద పూర్తిస్థాయి అవగాహన ఉండటం లేదు. చదువులు, ఉద్యోగాలకు వారు వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఏఐలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయరంగంలో ప్రవేశపెడితే కూలీలు, మానవవనరుల కొరతకు చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. గతంలో చేలో మందు కొట్టడానికి రెండు గంటలు పట్టేది. ఇప్పుడు డ్రోన్లు అందుబాటులోకి వచ్చాక ఆరు నిమిషాల్లోనే పని పూర్తవుతోంది. ఉద్యోగాలు చేసుకుంటూనే వీకెండ్ వ్యవసాయం చేద్దామనుకునేవారు డ్రోన్లు అందుబాటులోకి వచ్చాక ఇటు వైపు మొగ్గు చూపుతున్నారు. బీమా కంపెనీలు, ప్రభుత్వాలు రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వడానికి కూడా ఈ కృత్రిమ మేధ ఉపయోగపడుతుంది. వాతావరణంలో తేమ శాతం ఎంత ఉందో ఒక్క క్షణంలోనే ఏఐ పరిజ్ఞానం ద్వారా చెప్పొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం 167 భూసార పరీక్షా కేంద్రాలను మన రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నారు. వీటికి శాంపిల్స్ తీయడం కష్టమవుతుండటంతో ఒక రోబోట్ రూపకల్పనపై వ్యవసాయ వర్సిటీ పరిశోధనలు చేస్తోంది. ఏఐ పరిజ్ఞానంతో ఏదైనా పంటకు రాబోతున్న తెగులును కూడా ముందుగానే తెలుసుకునే వీలుంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తద్వారా దాని నివారణకు చర్యలు చేపట్టవచ్చంటున్నారు.

సాగులో తగ్గనున్న ఖర్చు..

దేశంలో ఇప్పటికే నీటిపారుదలను నియంత్రించే యాప్‌లు, ట్రాక్టర్లను నడిపించే జీపీఎస్ సిస్టమ్‌లు, పశువులను పర్యవేక్షించే ఆర్‌ఎఫ్‌ఐడీ–చిప్డ్ ఇయర్ ట్యాగ్‌లు ఉన్నాయి. వ్యవసాయంలో సాంకేతిక స్థిరత్వం రావాలంటే కృత్రిమ మేధ అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు. సంప్రదాయ పద్ధతుల కంటే సులువుగా, ఖర్చు తగ్గించేలా చేయడానికి వ్యవసాయ వర్సిటీ కృషి చేస్తోంది. దేశంలోనే అత్యాధునిక ఏరియల్ రోబో డ్రోన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల్లో ఈ డ్రోన్లను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా పురుగు, కలుపు, తెగుళ్ల మందుల పిచికారీలే కాకుండా విత్తనాలు వేయడం, యూరియా, డీఏపీ లాంటి ఎరువులు చల్లడం వంటివి చేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా వ్యవసాయ రోబో..

వ్యవసాయ రంగంలో ఎల్వోటీ, బిగ్‌డేటా ఎనలిటిక్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను రైతుల ముంగిట్లోకి తేవడానికి వర్సిటీ పరిశోధనలను ముమ్మరం చేసింది. తద్వారా కూలీల కొరత, ఖర్చు, వాతావరణ మార్పుల వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించవచ్చని పరిశోధకులు అన్నారు. సాగు పనులకు వ్యవసాయ రోబోను వర్సిటీ ప్రయోగాత్మకంగా పరీక్షించింది. సంప్రదాయ సాగు పద్ధతులతో పోలిస్తే వ్యవసాయ రోబో 4–5 రెట్ల సామర్థ్యంతో పనిచేస్తుందంటున్నారు. అదే డ్రోన్‌ల ద్వారా అయితే పదిరెట్ల పని సామర్థ్యం ఉంటుందని పేర్కొంటున్నారు. వీటితో రైతులకు ఖర్చులూ తగ్గిపోతాయని అంటున్నారు. కూలీలు దొరక్కపోయినా మందులు, పోషకాలను అందించి పంటను కాపాడతాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ వర్సిటీ రోబోలను అందుబాటులో తేవడానికి వడివడిగా అడుగులేస్తోంది.

వచ్చే మూడేళ్లలో అందుబాటులోకి..

మానవ రహిత వ్యవసాయంతోపాటు, ఖచ్చిత వ్యవసాయం చేసేందుకు కృత్రిమ మేధ దోహదపడుతుంది. వచ్చే మూడేళ్లలో పూర్తిస్థాయిలో కృత్రిమ మేధను వ్యవసాయంలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. పరిశోధనలు ముమ్మరం చేశాం.

– అంగిరేకుల సాంబయ్య, సీనియర్ శాస్త్రవేత్త, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు

విశాఖ పశు వైద్యుడికి జాతీయ అవార్డు

- ప్రభుత్వ పథకాలు పశుపోషకులకు అందేలా విశేష కృషి
- ఈ నెల 27న హైదరాబాద్‌లో అవార్డు అందుకోనున్న ప్రసాదరావు



ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్న డాక్టర్ మాదిన ప్రసాదరావు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ పథకాలు, పశు పోషణలో నూతన ఆవిష్కరణలపై ఆయన పాడి రైతులకు అవగాహన కల్పించడంలో చేసిన విశేష కృషికి గాను 'ఉత్తమ విస్తరణ అధికారిగా' జాతీయ స్థాయి అవార్డు వరించింది. ఈ నెల 27న హైదరాబాద్‌లో భారత ప్రభుత్వ సంస్థ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ సదస్సులో ఈ అవార్డును అందుకోనున్నారు. ప్రస్తుతం డాక్టర్ ప్రసాదరావు విశాఖ జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో ఏడీగా పని చేస్తున్నారు. ఆయన ఇక్కడ శిక్షణ విభాగంలో ఫ్యాకల్టీ సభ్యుడిగా ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకునేలా చేయడం, పాడి పశువులు, కోళ్ల పెంపకంపై శిక్షణ ఇవ్వడం, శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించడంలో కృషి చేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పథకాలపై ఆయన లఘు చిత్రాలు, స్వీయ రచనలు చేయడంతో పాటు వీడియోలు రూపొందించారు. వాటి ద్వారా పాడి రైతులకు సులువైన పద్ధతిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇంతవరకు ఆయన ఆరు పుస్తకాలు, 200 పైగా వ్యాసాలు రాశారు. ప్రసాదరావు మాట్లాడుతూ యూ ట్యూబ్ చానల్ పెట్టి 140 వీడియోలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

వావిళ్ల సాహితీ వికాసం గ్రంథావిష్కరణ

నెల్లూరు (బృందావనం): నెల్లూరు పుర మందిరంలో వజ్జల సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'వావిళ్ల సాహితీ వికాసం' గ్రంథావిష్కరణ ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర, సంస్కృత సాహిత్యాలకు వావిళ్ల సంస్థ 170 ఏళ్లుగా అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. వావిళ్ల సాహితీ వికాసం గ్రంథంలో వావిళ్ల వారితో సంబంధం ఉన్న పండితులు, వారు ప్రచురించిన పుస్తకాల ముఖచిత్రాలు ఉన్నాయన్నారు. రచయిత వీవీ వేంకటరమణ ఎంతో శ్రమించి, పరిశోధించి పుస్తకాన్ని తీర్చిదిద్దడం, నెల్లూరులో ఆవిష్కరించడం ముదావహమన్నారు. కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ.. వావిళ్ల సంస్థ ఆంధ్ర వాఙ్మయానికి చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పనిచేసిన వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి అనేక సామాజిక కార్యక్రమాలకు దన్నుగా నిలిచారన్నారు. సాహిత్య విమర్శకులు మాచవోలు శివరామప్రసాద్ మాట్లాడుతూ.. వావిళ్ల సాహిత్య సేవలను కొనియాడారు. రచయిత వేంకటరమణ మాట్లాడుతూ.. 170 ఏళ్ల వావిళ్ల సంస్థ చరిత్రను అందించేందుకు 12 ఏళ్లు పరిశోధించి గ్రంథాన్ని ప్రచురించినట్లు వివరించారు. పొనకా కనకమ్మ ట్రస్ట్ సభ్యులు సురేంద్రనాథ్‌రెడ్డి, సమన్వయ కార్యదర్శి కె.గోపాలకృష్ణయ్య, కేవీ లక్ష్మి పాల్గొన్నారు.



గ్రంథావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, చిత్రంలో గోపాలకృష్ణయ్య, మాచవోలు, వెంకటరమణ, కేవీ లక్ష్మి

అపురూప కళకు.. ప్రాణం పోస్తూ..

నేటికీ సజీవంగా తోలుబొమ్మలాట

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 20కి పైగా బృందాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు
- గణపతి నవరాత్ర ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ

మండపేట: ఏమయ్యా.. రామయ్యా.. అంటూ దీపపు కాంతిలో చకచకా బొమ్మలు కదలాడుతూంటే.. ఆ బొమ్మలే మాట్లాడుతున్నాయా అన్నట్టుగా వెనుక నుంచి వినిపించే గొంతు.. ఆ గొంతుకు లయబద్ధంగా తాళం వేస్తూ.. హార్మోనియం, డోలక్, చిడతలతో శ్రావ్యమైన సంగీతం.. పూర్వం చూపరులను రేయంతా కట్టిపడేసిన తోలుబొమ్మలాట గూర్చి నేటి తరం వారికి తెలియదనే చెప్పాలి. పురాణేతిహాసాలు, సుప్రసిద్ధ కావ్యాల్లో వర్ణించిన పాత్రల ఆహార్యాన్ని అనుకరిస్తూ మనిషి రూపొందించుకున్న తొలి రంగస్థల కళారూపమే తోలుబొమ్మలాట అని పరిశోధకులు చెబుతారు. ఆ బొమ్మలను స్వయంగా రూపొందించడమే కాకుండా.. తన తెలివితేటలతో రకరకాల విన్యాసాలు చేయించి, వాటి కదలికలకు, సన్నివేశానికి అనుగుణంగా తనకు తెలిసిన భాషతో మాటలు పలికి, పాటలు, పద్యాలు పాడి.. పగలంతా అలసిసొలసిన ప్రజలకు గొప్ప వినోదాన్ని పంచారు ఈ కళాకారులు. నాటి గ్రామీణ జీవితంలో ప్రజల మధ్య ఎంతో ఐక్యతకు, అరమరికలు లేని జీవనానికి, సమాజంలో దుర్మార్గాలపై చైతన్యం పెంచడానికి తోడ్పడిన తోలుబొమ్మలాట భారతీయ జానపద కళారూపాల్లోనే ఎంతో అపురూపమైన కళ. పూర్వకాలం నాటి ఈ కళను ఇప్పటికీ సజీవంగా కాపాడుకుంటూ వస్తున్నారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు కళాకారులు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలిస్తూ తమ ఉనికిని చాటుతున్నారు.



మండపేటలో తోలుబొమ్మలాటను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

తోలుబొమ్మలాటకు ఒకప్పుడు గ్రామాల్లో తిరుగులేని ఆదరణ ఉండేది. పండగలు, జాతరలు, ఉత్సవాలు ఏవైనా సరే.. తోలుబొమ్మలాట ఉండి తీరాల్సిందే. రామాయణం, మహాభారతంలోని ఘట్టాలే కథాంశాలుగా తెల్లటి పరదా వెనుక నుంచి తోలుబొమ్మలను ఆడిస్తూ కళాకారులు చేసే ప్రదర్శనను రాత్రంతా ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించేవారు. ఈ కళాకారులు సంచార జీవనం సాగిస్తూ.. ఊరూరా ప్రదర్శనలిచ్చి జీవనోపాధి పొందుతూండేవారు. ఒక్కో గ్రామంలో రెండు మూడు వారాల పాటు ఉండి ప్రదర్శనలు ఇచ్చేవారు. పక్క గ్రామాల నుంచి ప్రజలు వచ్చి, తాంబూలం ఇచ్చి, ప్రదర్శన కోసం తమ ఊరికి ఆహ్వానించేంతగా కళాకారులకు పూర్వం మంచి గుర్తింపు ఉండేది. 1980వ దశకం వరకూ ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ కళ సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్ల రాకతో దాదాపు కనుమరుగవుతూ వస్తోంది.

ఒక్కో బృందంలో ఎనిమిది మంది వరకూ సభ్యులు ఉంటారు. ఒకరు సూత్రధారి (ఆర్గనైజర్) కాగా హార్మోనిస్ట్ ఒకరు, డోలక్ వాయించే వారు ఒకరు, తాళం వేసే వారు ఇద్దరు, బొమ్మలు ఆడించేందుకు ఇద్దరు, బొమ్మలు అందించేందుకు ఒకరు ఉంటారు. ఏ కళాకారుడు ఏయే బొమ్మలను ఆడిస్తాడో ఆ పాత్రకు అనుగుణంగా తానే పాడుతూ, పాటకు అనుగుణంగా బొమ్మను ఆడిస్తారు. రెండు బొమ్మలను ఆడించే సమయంలో, వాటి మధ్య వచ్చే పోరాటంలో ఆ రెండింటినీ చేతితో కొట్టిస్తారు. ఆ సమయంలో మిగిలిన వంతదారులు ఆ సన్నివేశానికి అవసరమైన అల్లరి, హంగామా చేస్తారు. యుద్ధఘట్టం వచ్చిందంటే డోలక్‌లు, డబ్బాలూ, ఈలలు, కేకలతో బీభత్స వాతావరణం ఉన్న భ్రమ కలిగిస్తారు.

ఆకట్టుకునే పాత్రలతో..

- కథ ఏదైనా సరే.. తోలుబొమ్మలాటలో కొన్ని పాత్రలు తప్పనిసరిగా ఉంటాయి.
- నాటకాలు, సినిమాలకు దర్శకుని మాదిరిగా తోలుబొమ్మలాటలకు 'సూత్రధారి'ది ప్రధాన బాధ్యత. అతడు కథ వివరంగా, ఆకట్టుకునే మాటలతో చెబుతూంటాడు. పాత్రలకు అనుగుణంగా గొంతు మారుస్తూంటాడు. ప్రేక్షకుల ఆదరణను, విసుగును గమనిస్తూ సమయానుకూలంగా అవసరమైన మార్పులు చేస్తాడు. ఇతర పాత్రలను ప్రవేశపెడతాడు.
- తోలుబొమ్మలాటల్లో జుట్టుపోలిగాడు, బంగారక్క దంపతుల పాత్రలు హాస్యరస ప్రధానమైనవి. తమ హాస్యంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ, నిద్రమత్తు వదలగొడుతూ ఉంటాయి. మధ్యమధ్యలో సమాజంలో దురంతాలపై ఎత్తిపొడుస్తూ, ప్రేక్షకుల్లో చైతన్యాన్ని నింపుతాయి.
- ఇంకా అల్లాటప్పాగాడు, కేతిగాడు వంటి పాత్రలు కూడా తోలుబొమ్మలాటలో ప్రధానమైనవే.



తెర వెనుక తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తున్న కళాకారులు

తోలుబొమ్మల తయారీ ఇలా ..

ఈ కళాప్రదర్శనలో ఉపయోగించే తోలు బొమ్మలను మేక, గొర్రె చర్మాలతో తయారు చేస్తారు.

- రామాయణంలోని రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, సుగ్రీవుడు, రావణాసురుడు తదితర పాత్రలతో పాటు.. మహాభారతంలోని శ్రీకృష్ణుడు, పాండవులు, కౌరవుల బొమ్మలు, హాస్యం పండించే జుట్టు పోలిగాడు, బంగారక్క ఆకారాలను ప్రత్యేకంగా ఆరబెట్టిన పశు చర్మాలపై వేసుకుని వాటికి అవసరమైన రంగులు, హంగులు అద్దుతారు.
- ఆ బొమ్మల కాళ్లు, చేతులు, తల ఆడించేందుకు వీలుగా ఆ భాగాలను విడివిడిగా తయారుచేసి అతికించి, తాళ్లు కడతారు.
- ఒక్కో బొమ్మ తయారీకి 10 నుంచి 15 రోజులు పడుతుంది.
- తెల్లటి వస్త్రాన్ని తెరలా కట్టి, దీపం పెట్టి, ఆ వెలుగులో ఆ బొమ్మలను ఆడిస్తారు.
- హార్మోనియం, డోలక్, చిడతలు వాయిస్తూ ఆయా కథలను సంభాషణలు, పద్యాలు, పాటల రూపంలో వినసొంపుగా వినిపిస్తారు.
- రామాయణంలోని సుందరకాండ, రామరావణ యుద్ధం, లక్ష్మణ మూర్ఛ, సతీ సులోచన, మహాభారతంలోని పద్మవ్యూహం, విరాటపర్వం, భీష్మపర్వం, దానవీరశూరకర్ణ తదితర ఘట్టాలను ప్రదర్శిస్తూంటారు.
- పూర్వం కాగడాల వెలుతురులో తోలుబొమ్మలాట ప్రదర్శించేవారు. ఆ తరువాత ఆముదం, కిరోసిన్, పెట్రోమాక్స్ దీపాల వెలుతురులో ప్రదర్శిస్తూ రాగా.. కాలానుగుణంగా ప్రస్తుతం విద్యుద్దీపాలు వినియోగిస్తున్నారు. గతంలో రాత్రంతా ఈ ప్రదర్శన ఉండేది. ప్రస్తుతం గంట నుంచి మూడు గంటల వరకూ చేస్తున్నారు.

వారసత్వంగా వస్తున్న కళ



కరపలో నాలుగు బృందాలున్నాయి. వారసత్వంగా వస్తున్న ఈ కళనే నమ్ముకుని రాష్ట్రంలోని పలుచోట్ల ప్రదర్శనలిస్తున్నాం. రెండు రోజుల క్రితం నగరిలో ప్రదర్శన ఇచ్చాం. ఖాళీ రోజుల్లో ఇంటింటికీ తిరిగి గ్యాస్ పొయ్యిలు, గ్రైండర్లు, మిక్సీలు రిపేరు చేస్తూంటాం.

– తోట దావీదు, కళాకారుడు, కరప

ఈ కళను ప్రోత్సహించాలనే..



మండపేట బస్టాండు వద్ద తొలిసారిగా గణపతి నవరాత్ర ఉత్సవాలను ఈ ఏడాది ప్రారంభించాం. ప్రాచీన కళను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తోలుబొమ్మలాట ప్రదర్శన ఏర్పాటు చేశాం. స్థానికులు, ప్రయాణికులతో పాటు దారిన వెళ్లే వారు కూడా ఆగి ఆసక్తిగా ఈ ప్రదర్శనను తిలకించారు.

– అయినవిల్లి రాజేష్, మండపేట

ఆవిర్భావం

తోలుబొమ్మలాట ఆవిర్భావం గురించి పరిశోధకులు అనేక ఆసక్తికర విషయాలు చెబుతారు. పూర్వం మహారాజులను సంతోషపెట్టడానికి కొంత మంది పండిత కళాకారులు బొమ్మలు తయారు చేసి, మానవులుగా నటింపజేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించే వారని, అలా తోలుతో బొమ్మలు తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపై దీపం కాంతిలో ఆ బొమ్మల నీడలు పడేటట్లు చేసి, బొమ్మలాట ప్రదర్శించేవారని అంటారు. ఈ విధంగా తోలుబొమ్మలాట పుట్టిందని చెబుతారు. ఈ తోలుబొమ్మలు మన రాష్ట్రంలోని కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నం తదితర ప్రాచీన ఓడరేవుల నుంచి విదేశాలకు కూడా వెళ్లిందని అంటారు.

సజీవంగా కాపాడుతున్నారు

గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 250కి పైగా తోలుబొమ్మలాట బృందాలు ఉండేవని కళాకారులు తెలిపారు. సినిమాలు, టీవీలు సెల్‌ఫోన్ల రాకతో ఈ కళకు ఆదరణ తగ్గి, జీవనం కష్టమవడంతో చాలా మంది వేరే పనుల్లోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా కరప, మాధవపట్నం, పెద్దాపురం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల తదితర ప్రాంతాల్లో 20 వరకూ బృందాలు ఈ కళను ఇప్పటికీ ప్రదర్శిస్తూనే ఉన్నాయి. ఖాళీ రోజుల్లో చిన్నచిన్న చేతివృత్తులు, వ్యాపారాలు చేసుకుంటూ ఉత్సవాలు, పండగల సమయాల్లో ప్రదర్శనలిస్తూ ఈ ప్రాచీన తోలుబొమ్మలాట కళను సజీవంగా కాపాడుకుంటూ వస్తున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యాన ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లోను, పలు ఉత్సవ కమిటీల వారు ఏటా వీరితో ప్రదర్శనలిప్పించి, సత్కరిస్తూ ఈ కళను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం వినాయక నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పలు మండపాల వద్ద తోలుబొమ్మలాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి

'రిప్'పాటులో ప్రాణాపాయం

పిఠాపురం: గణపతి నవరాత్రులు ముగుస్తున్నాయి. అందరి దృష్టీ వినాయక విగ్రహ నిమజ్జనాలపైనే ఉంది. తొలి రోజు నుంచి నిమజ్జనాలు ప్రారంభమైనా తొమ్మిదో రోజు భారీ విగ్రహాలను ఎక్కువగా నిమజ్జనం చేయడం ఆనవాయితీ. కాకినాడ జిల్లాలోని ఉప్పాడ సాగర తీరం ఏటా ఈ నిమజ్జనాలకు వేదిక అవుతుంది. కాకినాడ పరిసరాల్లో పెద్ద విగ్రహాలు ఇక్కడే నిమజ్జనం చేస్తుంటారు. గత ఏడాది నిమజ్జన వేడుకల్లో ప్రమాదాలు సంభవించి ముగ్గురు మృతి చెందారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఈసారి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా రిప్ కరెంటు కెరటాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రాకాసి అలలకు బలి

సాగరతీరంలో అలల్లో దాగి ఉంటే రిప్ కరెంట్ (చీలిక ప్రవాహాలు)పై నిమజ్జనోత్సవ వేళ అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఈ కెరటాలు ప్రాణాలను బలిగొంటున్నాయి. అలల మాటున పొంచి ఉండి ఒక్క సారిగా దాడి చేసి పెను విషాదాన్ని సృష్టిస్తున్నాయి. ఏమరపాటుగా ఉంటే సముద్రంలోకి లాగేస్తుంటాయి. తూర్పు తీరంలో ఆగస్టు– అక్టోబర్ నెలల మధ్య రిప్ కరెంట్ అలలు ఎక్కువగా ఉంటాయని సముద్ర పరిశోధకులు నిర్ధారించారు. కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు ఉన్న తీర ప్రాంతంలో ఇవి ఎక్కువగా ఏర్పడుతున్నట్లు గుర్తించారు. ఇప్పటికే వీటి ధాటికి ఎక్కువ మంది గురై మృత్యువాత పడ్డారు. ఉప్పాడ తీరంలో గతేడాది జరిగిన ప్రమాదంలో ముగ్గురు రిప్ కరెంట్ వల్లే చనిపోయారని భావిస్తున్నారు.

కడలి కెరటాల్లో పొంచిఉన్న ప్రమాదం



రిప్ కరెంటు అలలు

రిప్ కరెంట్ అంటే

- బలమైన అలల మధ్య ఇరుకైన ప్రవాహాన్ని రిప్ కరెంట్ అంటారు.
- ఇవి మనిషిని ఒక్కసారిగా లోతైన ప్రదేశంలోకి బలంగా లాగేస్తాయి.
- సముద్ర గర్భంలో సుదూర ప్రాంతలో గాలి ద్వారా ఏర్పడిన అలలు నీటి అడుగున బలమైన ప్రవాహంగా దూసుకు వస్తాయి.
- ఈ అలలు తీరానికి వచ్చే సరికి సముద్రం అడుగు భాగాన అత్యంత బలమైన ప్రవాహం ఏర్పడుతుంది.
- ఆ ప్రవాహంలో ఎవరున్నా రెప్ప పాటులో కడలిలో కలిసి పోతారు.
- తీరానికి వచ్చే కొద్దీ వేగం అధికమై తరంగాలు ఏర్పడతాయి.
- తిరిగి కెరటం వెనక్కి సముద్రంలోకి వెళ్లేటప్పుడు ఏర్పడే తీవ్రత అంతా ఇంతా కాదు. దానినే రిప్ కరెంట్ అంటారు.
- కరెంట్ షాక్ కంటే ఎక్కువగా ప్రభావం చూపి తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తాయి.
- రెండు సముద్రాలు లేదా రెండు ప్రవాహాలు కలిసే చోట ఇవి సంభవిస్తాయి.
- కాకినాడ నుంచి విశాఖ వరకు ఉన్న తీర ప్రాంతంలో ఉప్పుటేరులు కలిసే కాలువల దగ్గర రిప్ కరెంట్ అలలు ఏర్పడుతుంటాయి.
- రిప్ కరెంట్ ప్రవాహ వేగం సెకనుకు 2 నుంచి 8 అడుగుల వరకు ఉంటుంది. ఇది అల చీలికలో ఒడ్డుకు సమాంతరంగా 10 నుంచి 20 అడుగుల వెడల్పుతో ఏర్పడుతుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943